



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 11 మంగళవారం మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 175
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


## ప్రణయ్ హంతకుడికి ఉరి శిక్ష!



- ఏడేళ్ల కిందట సంచలనం కలిగించిన ప్రణయ్ హత్యకేసు
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఏడేళ్ల కిందట పరువు హత్య
- తన కూతురిని దళితుడు ప్రేమించి పెళ్లాడాడని ధనవంతుడైన మారుతీరావు,బీహారీకి సుపారీ ఇచ్చి హత్య చేయించిన ఘటన
- తదనంతరం మారుతీరావు ఆత్మహత్య..ఏ2 సుభాష్‌కుమార్‌కు ఉరి మిగతా నిందితులకు యావజ్జీవ కారాగారం



2

**నల్లగొండ-నవభూమిబ్యూరో**
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో ఏ2కు ఉరి విధిస్తూ నల్లగొండ ఎస్సీ,ఎస్టీ జిల్లా కోర్టు తీర్పు చెప్పింది. తెలుగు రాష్ట్రాల్లో ఏడేళ్ల కిందట తీవ్ర సంచలనం రేపింది ప్రణయ్ హత్య కేసు. తెలుగు రాష్ట్రాల్లో ఏడేళ్ల కిందట తీవ్ర సంచలనం రేపింది ప్రణయ్ హత్య కేసు. అప్పటివరకు ఇలాంటి ఉదంతాలు జరిగినట్లు ఎక్కడా వెలుగులోకి రాలేదు. వచ్చినా అవేమంత సంచలనం కాలేదు. తన కుమార్తెను ప్రేమ వివాహం చేసుకున్న యువకుడిని భారీమొత్తంలో సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించిన ఉదంతం పెను దుమారం రేపింది. ప్రణయ్ హత్య కేసులో తాజాగా నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలనం తీర్పు వెల్లడించింది. ఈ కేసులో రెండో నిందితుడికి ఉరి శిక్ష విధించింది. మొదటి నిందుతుడు చనిపోగా.. మిగిలినవారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది. ఇదీ అసలు కేసు.. ఉమ్మడి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారుతీరావు పెద్ద వ్యాపారి. సంపన్నుడైన ఆయనకు ఏకైక కుమార్తె అమృత. అగ్ర వర్ణానికి చెందిన ఈ యువతి దళిత

## కన్హా నేషనల్ పార్కులో భారీ ఎన్‌కౌంటర్




- పోలీసులు, నక్సల్స్‌కు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒకరి హతం
- అటవీ ప్రాంతంలో నక్సల్స్ సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు, భద్రతాదళాలు కూంబింగ్
- భద్రతాదళాలను చూసి కాల్పులు జరిపిన మావోలు
- 20మందికి పైగా మావోయిస్టులున్నారంటున్న పోలీసులు

**భోపాల్-నవభూమిబ్యూరో:** మధ్యప్రదేశ్‌లోని కన్హా నేషనల్ పార్కులో మంగళవారంనాడు పోలీసులు, నక్సల్స్‌కు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక నక్సల్ హతమయ్యాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో 18 నుంచి 20 మంది నక్సల్స్ పాల్గొన్నట్టు చెబుతున్నారు.
అటవీ ప్రాంతంలో నక్సల్స్ సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు, భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకున్నారని, ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. సుమారు 20 మంది వరకూ నక్సల్స్ ఇందులో పాల్గొన్నట్టు చెప్పారు. ఒక నక్సల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని, నక్సల్స్ మద్దతుదారులు ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్టు మండ్లా ఎస్పీ రజత్ సక్లేచా తెలిపారు. టైగర్ రిజర్వ్‌గా, టూరిస్ట్ ప్రాంతంగా మంచి పేరున్న కన్హా నేషనల్ పార్కులో ఇటీవల కాలంలో మావోయిస్టుల ఉనికి పెరుగుతోంది. విశాలమైన పార్కు, దట్టమైన అడవులు ఉండటంతో మావోయిస్టులు తలదాచుకునేందు కు ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నట్టు చెబుతు న్నారు. దీంతో వారిని గాలించి పట్టుకోవడం భద్రతా బలగాలకు ఒక సవాలుగా మారు తోంది. సందర్శకుల భద్రతతో పాటు పార్క్‌లో వన్యప్రాణుల సంరక్షణ అధికారులకు కీలకంగా మారుతోంది. నక్సల్స్ రహిత రాష్ట్రంగా మధ్యప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు సీఎంమోహన్ యాదవ్ చర్యలు తీసుకుంటున్నారు. 2026 నాటికి అన్ని రాష్ట్రాలను నక్సల్స్ బెడద నుంచి విముక్తి చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశాలతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, పోలీసులు ముమ్మర గాలింపులు సాగిస్తున్నారు.

## శ్రీ చైతన్య విద్యాసంస్థలపై ఐటీ దాడులు

- అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్నారన్న ఆరోపణలపై సోదాలు
- హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై సహా పలు ప్రాంతాల్లోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు
- మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో సోదాలు,,అక్రమ లావాదేవీల గుర్తింపు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై సహా పలు ప్రాంతాల్లోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్పొరేట్ కార్యాలయాలపై ఒక్కసారిగా దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు

## రాష్ట్రానికి నిధులు తెస్తే కిషన్‌రెడ్డిని సన్మానిస్తం

- మెట్రో తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే నిధులు అడుగుతున్నం
- ఎన్హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల కాదా?
- 39 సార్లు కాకుంటే 99 సార్లు ఢిల్లీ పోతాం.. తప్పేంటి?
- నిధుల విషయంలో ఢిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధం
- సీఎల్పీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ చిట్‌చాట్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ప్రాజెక్టులకు బడ్జెట్లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయని.. అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు సీఎం చెప్పారు. 39 సార్లు కాకుంటే 99 సార్లు ఢిల్లీ పోతాం.. తప్పేంటని సీఎం ప్రశ్నించారు. సందర్భం వస్తే నిధుల విషయంలో ఢిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎల్పీలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.
"మెట్రో తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్రెడ్డినే నిధులు అడుగుతున్నాం.

## కోడెల చావు వెనుక విజయసాయి?



- నరసరావుపేట పోలీసు స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు
- విజయసాయిరెడ్డితో పాటు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారని ఆరోపణ
- కోడెల శివప్రసాద్,ఆయన కుమారుడు శివరాంపై తప్పుడు కేసులు
- ఈ తప్పుడు కేసులతోనే కోడెల ఆత్మహత్య: టీడీపీ నేతల ఆరోపణ

2

**నరసరావుపేట-నవభూమిబ్యూరో:** వైసీపీలో ఒకప్పుడు అంతా తానై చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి తాజాగా రాజకీయాలకు గుడ్ బై చెప్పేసినా గత తప్పిదాలు మాత్రం ఆయన్ను వీడటం లేదు. ఇప్పటికే కాకినాడ పోర్టు వాటాల బదిలీ సహా పలు కేసుల్లో ఆయన పాత్రపై ఆరోపణలు, కేసులు ఉన్నాయి. ఇప్పుడు పల్నాడులో సాయిరెడ్డితో పాటు నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపైనా ఓ కేసు దాఖలైంది. దీంతో సాయిరెడ్డి మరోసారి తెరపైకి వచ్చారు.
పల్నాడు ప్రాంతానికి చెందిన మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్య చేసుకున్నారు. దీని వెనుక విజయసాయిరెడ్డితో పాటు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు నరసరావుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఆయన కుమారుడు శివరామకృష్ణపై తప్పుడు కేసులు పెట్టించారని వీరిపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు.
వీరు పెట్టించిన తప్పుడు కేసుల వల్ల మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకున్నారని ఫిర్యాదులో టీడీపీ నేతలు ఆరోపించారు. 2019లో కోడెలకు లంచం ఇచ్చినట్లు వీరు మాజీ రంజీ క్రికెటర్ నాగరాజుతో తప్పుడు కేసు పెట్టించారని టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. నరసరావుపేట టు టౌన్ పిఎస్ లో ఈ ముగ్గురిపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## రాములమ్మ నామినేషన్

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన విజయశాంతి, సీఎం రేవంత్ హాజరు
- అద్దంకి దయాకర్,శంకర్‌నాయక్ నామినేషన్ల కార్యక్రమానికి డిప్యూటీ సీఎం
- చివరిరోజు కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి శ్రవణ్,సీపీఐ అభ్యర్థి సత్యం నామినేషన్లు
- కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ హాజరు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ సోమవారంముగియనుంది. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్యా బలం ప్రకారం కాంగ్రెస్‌కు నాలుగు, బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ దక్కనున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయ శాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌లను అధిష్టానం ప్రకటించింది. పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని సీపీఐకి కేటాయించింది కాంగ్రెస్. సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం ఖరారు అయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, సహా పలువురు నేతలు హాజరయ్యారు. తమకు వచ్చే నాలుగు సీట్లలో పొత్తు ధర్మం ప్రకారం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. తమకు 2 అసెంబ్లీ స్థానాలు కేటాయించా లని సీపీఐ కోరగా, కొత్తగూడెం మాత్రమే కేటాయించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు ఈ సీటును కేటాయించింది. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో కాంగ్రెస్, సీపీఐ నుంచి నలుగురు అభ్యర్థులు, బీఆర్ఎస్ నుంచి ఒక అభ్యర్థి పోటీ చేస్తున్నారు. మరోవైపు ఈ

## మంగళగిరికి ఫ్రీ బస్సు

- మంగళగిరికి లోకేష్ గుడ్ న్యూస్-
- ఫ్రీగా ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణం..!
- నియోజకవర్గ పరిధిలో ఉచిత ప్రయాణం
- 2బస్సులు సమకూర్చిన మెగా ఇంజనీరింగ్

2



**మంగళగిరి-నవభూమి:** ఏపీ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఇవాళ తన నియోజకవర్గం మంగళగిరి ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పారు. నియోజకవర్గంలోని 2 కీలక ప్రాంతాలకు వెళ్లాలనుకునే ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ బస్సుల్లో ఇలా

## భారతీయ స్టాక్ మార్కెట్ పతనం

- లాభాల నుండి నష్టాల వైపు..స్టాక్‌మార్కెట్
- అమెరికా ఫ్యూచర్స్ నుండి ప్రతికూల సంకేతాలు
- మదుపర్లు అమ్మకాల ఒత్తిడి వల్ల నష్టాలు
- సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు నష్టాల బాట

2

**ముంబై-నవభూమిబ్యూరో:** భారతీయ స్టాక్ మార్కెట్లు, ఉదయం ఆశాజనకంగా ప్రారంభమైనప్పటికీ, మధ్యాహ్నం తర్వాత అనూహ్యంగా నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫ్యూచర్స్ నుండి ప్రతికూల సంకేతాలు రావడంతో, మదుపర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు నష్టాల బాట పట్టాయి. ఆరంభం అద్భుతం.. ముగింపు నిరాశ సెన్సెక్స్ ఉదయం 74,474.98 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై, రోజంతా అదే జోరును కొనసాగించింది. ఇంట్రాడేలో 74,741.25 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే, మధ్యాహ్నం తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అమ్మకాల ఒత్తిడి పెరగడంతో, సూచీ 74,022.24 పాయింట్ల కనిష్ఠ స్థాయికి

## తెలంగాణలో గ్రూప్-1 ఫలితాల విడుదల



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణలో గ్రూప్-1 పరీక్ష ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ పరీక్షల మొత్తం 563 పోస్టులకు గానూ, 31,403 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలను అధిగమించిన అభ్యర్థుల తుది ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. గ్రూప్-1 పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ప్రొవిజినల్ మార్కులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రిలీజ్ చేసింది. https://websitenew.tspsc.gov.in అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ లాగిన్ వివరాలతో మార్కులు చెక్ చూసుకోవచ్చు. తమ మార్కులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, నిర్దిష్ట గడువులోగా సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇక గ్రూప్-2 ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఈ నెల 20లోపు అన్ని పోటీ పరీక్షల ఫలితాలను వెల్లడించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకూ గ్రూప్-1 మెయిన్ పరీక్షలు జరిగాయి.

## తెలంగాణాలో భానుడి ప్రతాపం

- వారం రోజుల్లో భగభగలే!
- ఇళ్లలోంచి బయటకు వెళ్లొదంటున్న అధికారులు
- ఉక్కబోతతో అల్లాడుతున్న జనం
- రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలుగు రాష్ట్రాలలో ప్రచండ భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి చివరివారం నుండి ఎండలు ప్రారంభమయ్యాయి .ప్రస్తుతం మార్చి నెల మొదటి వారంలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న జనం ఇప్పుడు 11 దాటితే రోడ్డుమీదకు వెళ్లాలంటేనే జనం భయపడే పరిస్థితి వచ్చింది. భానుడి ప్రతాపానికి ప్రజలు

## మహిళలకు వర్క్ ఫ్రం హెూం

- ఏపీలో వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వే-
- చంద్రబాబు కీలక ఆదేశాలు..!
- సచివాలయ ఉద్యోగులతో క్షేత్రస్థాయిలో సర్వే
- 2.68 కోట్ల మందిని సర్వే చేయాలని లక్ష్యం
- ఇప్పటికే 82 లక్షల మంది అభిప్రాయాల సేకరణ

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ లో మహిళలకు వర్క్ ఫ్రమ్ హెూమ్ (ఇంటి నుంచే పనిచేసే విధానం) ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం తమ ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే సచివాలయ ఉద్యోగులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 2.68 కోట్ల మందిని సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. ఇందులో ఇప్పటికే 82 లక్షల మంది అభిప్రాయాలు తీసుకుంది. వీటి ఆధారంగా సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు.
రాష్ట్రంలో వర్క్ ఫ్రం హెూంను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. వర్క్ ఫ్రం హెూంతో పాటు నైబర్ హుడ్ వర్కింగ్, కో వర్కింగ్ విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఇంటి నుంచే పని విధానంలో వసతులు, అవకాశాలు కల్పించడం, శిక్షణ అందించడం ద్వారా పెద్ద ఎత్తున అవకాశాలు సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వర్క్ ఫ్రం హెూంపై సర్వే నిర్వహిస్తున్నారని, 2.68 కోట్ల మందిని సర్వే చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు.
ఇందులో ఇప్పటి వరకు 82.06 లక్షల మందిని సర్వే చేశారన్నారు. వీరిలో 1.72 లక్షల మంది వర్క్ ఫ్రం హెూం విధానంలో పని చేస్తున్నట్లు వివరించారు. వర్క్ ఫ్రం హెూం విధానంలో పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నా..తమకు తగిన అవకాశాలు లేవని...అటువంటి ఉపాధి కల్పిస్తే తాము కూడా వర్క్ ఫ్రం హెూం విధానంలో పనిచేస్తామని 20.43 లక్షల మంది చెప్పినట్లు అధికారులు సీఎంకు తెలిపారు.
సర్వే చేసిన వారిలో ఇంటర్ కంటే తక్కువ చదివిన వారు 9.05 లక్షల మంది ఉండగా, డిప్లొమా, ఆపై చదువులు చదివిన వారు 10.73 లక్షల మంది ఉన్నారన్నారు. ఆయా గ్రామాల్లో వర్క్ ఫ్రం హెూం సెంటర్లు, పని స్టేషన్ సెంటర్ల ఏర్పాటుకు ఉన్న

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

2 | హైదరాబాద్
మంగళవారం
11 । మార్చి । 2025




## తెలంగాణలో మారుతున్న రాజకీయం.. కలిసొచ్చేదెవరికి

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలం గాణ రాజకీయ పరిణామాలు రానున్న రోజుల్లో మారబోతున్నాయా అనే చర్చ మొదలైంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ ఓడి, బీజేపీ గెలవడంతో ఇక తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వ మేనంటూ కమలం నేతలు ప్రకటిస్తున్నారు. ప్రభుత్వంపై తక్కువకా లంలోనే ప్రజలు అసంతృప్తితో ఉన్నారని బీజేపీ ప్రచార చేస్తోంది. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో బీజేపీ గెలుపొం దిందని, రెండు పార్టీలు కలిసి తమపై కుట్ర చేసినా తమకు గణనీయమైన సంఖ్యలో ఓట్లు వచ్చాయని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. రెండుచోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. పోటీచేసిన ఒక స్థానంలో కాంగ్రెస్ పరాజయం చవిచూసింది. ఓవైపు బీఆర్ఎస్ పోటీ కి దూరంగా ఉంది. తెలంగాణ ప్రజలు కాంగ్రెసను నమ్మడం లేదని, రానున్న రోజుల్లో తామే ప్రత్యామ్నాయం అంటూ కమలం నేతలు చెప్పుకొస్తున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం ద్వారా బీజేపీ బలపడిందా.. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడనుందా.. తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారబో తున్నాయా.. మార్పులు వస్తే భవిష్యత్తులో ఏ రాజకీయపార్టీకి కలిసొ స్తుందనే చర్చ జరుగుతోంది. గెలుపుతో ఉత్సాహం..ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో బీజేపీ శ్రేణులు మంచి ఉత్సాహంతో ఉన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే ఊపుతో పనిచేసేందుకు హైకమాండ్ కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు తాము మాత్రమే ప్రత్యామ్నాయమనే అభిప్రాయం ప్రజల్లో వచ్చేలనే పక్కా ప్లాన్‌తో బీజేపీ నేతలు ముందుకెళ్తున్నారు.



## ఒకే నిర్ణయంపై డ్రైవర్లు.. క్యాబ్ సర్వీస్‌లు బంద్..



**హైదరాబాద్-నవభూమి:** ఓలా, ఉబెర్, రాపిడో క్యాబ్ డ్రైవర్లు హైదరాబాదు విమానాశ్రయానికి ప్రయా ణాలను బహిష్కరించనున్నట్లు ప్రకటిం చారు. రైడ్-హైలింగ్ ప్లాట్‌ఫామ్‌లు విధిస్తున్న తక్కువ చార్జీల కారణంగా వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ఉద్యమం ప్రారంభించబడనుంది. ప్రస్తుత టారిఫ్ వ్యవస్థ డ్రైవర్ల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని యూనియన్ అభిప్రాయపడుతోంది. TGPWU ప్రకారం.. క్యాబ్ సర్వీస్ కంపెనీలు విధిస్తున్న తక్కువ చార్జీలు డ్రైవర్ల ఆదాయాన్ని తగ్గించి.. వారి నిర్వహణ ఖర్చులను కూడా కష్టతరం చేస్తున్నాయి. వీటి వల్ల వారు జీవనోపాధిని కొనసాగించడం చాలా కష్టం అవుతోంది. ప్రభుత్వానికి, రవాణా శాఖకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ.. సరైన ఛార్జీల విధానాన్ని అమలు చేయడంలో ఎటువంటి మార్పు జరగలేదని యూనియన్ పేర్కొంది. దీనివల్ల.. డ్రైవర్లు తమ న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు విమానాశ్రయ ప్రయాణాలను బహిష్కరించడానికి నిర్ణయించుకున్నారు. TGPWU అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ మాట్లాడుతూ.. "మన సభ్యులు గత కొంతకాలంగా తక్కువ ఛార్జీ విధానాల గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ చార్జీల వల్ల డ్రైవర్ల ఆదాయాన్ని మాత్రమే ప్రభావితం చేయకుండా.. వారి సమయం, కృషిని కూడా వృథాగా మారుస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని, డ్రైవర్లకూ.. ప్రయాణికులకూ న్యాయమైన ఒక సమాన ఛార్జీల విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.

ఉద్యమ ప్రధాన లక్ష్యం డ్రైవర్లకు ప్రయోజనం కలిగించే కొత్త ఛార్జీల విధానాన్ని అమలు చేయించడమే. విమానాశ్రయ ప్రయాణాల బహిష్కరణ ద్వారా తమ ఆందోళనను హైలైట్ చేయడంతో పాటు.. రైడ్-హైలింగ్ కంపెనీలు తమ డిమాండ్లను గుర్తించాలని యూనియన్ కోరుతోంది. ఈ ఉద్యమం ద్వారా ప్రయాణికులకు గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కూడి ఉంది. ఖర్చులు పెరుగుతున్నప్పటికీ.. తక్కువ ఆదాయంతో అనేక మంది డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా.. రైడ్-హైలింగ్ ప్లాట్‌ఫామ్‌ల ధరల విధానాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని %ఱ+ూఔఖ% డిమాండ్ చేస్తోంది. ఒక నియంత్రిత ధర విధానం లేకపోతే, డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉంటారని.. దీనివల్ల ప్రయాణికులకు అందించే సేవల నాణ్యత కూడా తగ్గుతుందని యూనియన్ పేర్కొంది. ఈ సమస్యలను ఎదుర్కొంటున్న గిగ్ , ప్లాట్‌ఫామ్ వర్కర్లకు న్యాయమైన వేతనం, మెరుగైన జీవనోపాధి కోసం పోరాడాలని TGPWU విజ్ఞప్తి చేస్తోంది. సరైన ధర విధానం అమలు చేయించడానికి.. అందరూ ఐక్యంగా నిలబడి మద్దతు ఇవ్వాలని యూనియన్ కోరుతోంది. ఇది డ్రైవర్ల జీవితాలను మెరుగుపరిచేలా.. సేవల నాణ్యతను పెంచేలా ఉంటుంది.

## గ్రూప్-1 ఫలితాలు విడుదల

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ గ్రూప్-1 పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షల ప్రొవిజనల్ మార్కులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు లాగిన్ వివరాలతో మార్కులు చూసుకోవచ్చని పేర్కొంది. ప్రొవిజనల్ మార్కులను టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఈ నెల 24వరకు రీకౌంటింగ్‌కు అవకాశం కల్పిస్తున్నామని.. రూ.1000 చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది. ఇక రీకౌంటింగ్ అనంతరం జనరల్ ర్యాంక్స్ జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొంది. 563 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్ చివరివారంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగ్గా.. 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

## ఆయన పార్టీకి ద్రోహం చేశారు.. మావోయిస్టుల సంచలన లేఖ

**హైదరాబాద్-నవభూమి:** ఛత్తీస్‌గడ్: సంచలన ఆరోపణలతో మావోయిస్ట్ పార్టీ లేఖ విడుదల చేసింది. సౌత్ బస్తర్ డీ.వీ.సీ.ఎం సభ్యుడు మోడీ యం దినేష్ అతని భార్య కళ పార్టీ డబ్బుతో పారిపోయి పోలీసులకు లొంగిపోయారు. ఇరవై ఏళ్ల ఉద్యమ జీవితంలో ఉన్న దినేష్ పార్టీకి ద్రోహం చేశారని మావోయిస్ట్‌లు లేఖలో ప్రస్తావించారు. తీవ్రమైన అణచివేతకు గురైన వారు శత్రువుకు లొంగిపోతారని మావోయిస్ట్‌లు తెలిపారు. త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని 'ఆపరేషన్ కగార్' యుద్ధాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో పేరుతో మావోయిస్ట్‌లు లేఖ విడుదల చేశారు. కాగా.. దండకారణ్యం, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని గత కొంత కాలంగా మావోయిస్ట్‌లు కోరుతున్న విషయం తెలిసిందే. దండకాం ణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, ఆదివాసీలను కేంద్ర ప్రభుత్వం హత మారుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని మావోయిస్ట్‌లు డిమాండ్ చేశారు. అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలను వెళ్లగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, అడవుల్లో ఆదివాసీలకు మావోయిస్టులు అండ అని అన్నారు. ఆదివాసీలను లేకుండా చేసి అడవుల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని ప్రజలు, మేధావులు తిప్పికొట్టాలని మావోయిస్ట్‌లు పిలుపునిచ్చారు.

## మోస్ట్ వాంటెడ్ నోటోరియస్ అరెస్ట్.. మోసాల చిట్టా మామూలుగా లేదుగా

**హైదరాబాద్-నవభూమి:** కొత్తగా నిర్మిస్తున్న భవనాలు, సైట్సే అతని టార్గెట్. ఇంటీరియర్ డిజైనర్ అంటూ పరిచయమై అందరినీ తన మాటలతో మాయ చేస్తాడు. ఫేక్ వీడియోస్ చూపిస్తూ నమ్మబలుకుతాడు. ఇక డబ్బులు చేతుల్లో బడ్డాయో.. ఇంక అంతే. కంటికి కనిపించకుండా మాయమైపోతాడు. ఫోన్లలో అందుబాటులో ఉండడు. చివరకు మోసం పోవడం యజమానుల వంతవుతుంది. ఇతడి మాయ మాటలు నమ్మి మోసపోయినవారు ఎందరో. కానీ అన్ని రోజులు ఒకేలా ఉండవు కదా. అతడి అదృష్టం బాగున్నన్ని రోజులు బాగానే మోసం చేస్తూ పబ్బం గడిపాడు. మోసం చేసిన డబ్బులతో జెల్సాలు చేశాడు. ఎట్టకేలకు అతడి పాపం పండి కటకటాలపాలయ్యాడు. ఇంతకీ ఎవరా వ్యక్తి.. ఎలాంటి మోసాలకు పాల్పడ్డాడు.. అతని అకౌంట్‌లో ఉన్న రూ. 18,65,000 బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. పలాశ్ పాల్ కోసం తీవ్రంగా గాలించిన పోలీసులు.. చివరకు అతడిని అదుపులోకి తీసుకున్నారు. పలాశ్ వద్ద నుంచి 120 గ్రాముల బంగారం, 40 వేల రూపాయల కాష్, పలు ల్యాండ్ రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్, మొబైల్ ఫోన్స్‌ను పోలీసులు సీజ్ చేశారు.

## బెస్ట్ హలీం ప్రదేశం ఇదే.. ఒక్కసారైనా ఇక్కడ తినాల్సిందే..




**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో హలీం అంటే ఓ సంస్కృతి. ముఖ్యంగా రంజాన్ సీజన్‌లో దీనికి ఉన్న క్రేజ్ మాటల్లో చెప్పలేం. ఈ సీజన్‌లో హలీం టాప్ స్పాట్‌గా నిలిచిన హోటల్ సిటీ డైమండ్. ఇక్కడకు హలీం తినడానికి ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. సోషల్ మీడియా ద్వారా ఈ హోటల్ ఫేమస్ అయిపోయింది. అంతే కాదు.. ఇక్కడ రుచి కూడా తిన్నవారిని మైపరిపిస్తుంది. ఇంతకి హైదరాబాద్ లో ఈ హోటల్ ఎక్కడుంది.. వీటి యొక్క ధరలు ఏమిటి అనే వివరాలను ఇక్కడ తెలుసుకోండి.

హైదరాబాద్‌లో రంజాన్ సంబరాలు హలీం లేకుండా పూర్తవ్వవు. ప్రతి సంవత్సరం.. హలీం ప్రియులు ఏ హోటల్‌లో హలీం బెస్ట్ అన్నదానిపై చర్చించుకుంటారు. ప్రసిద్ధ హోటళ్లతో పాటు కొత్తగా వచ్చిన హలీం కేంద్రాలు కూడా తమ ప్రత్యేకతతో ఆకట్టుకునేందుకు పోటీ పడతాయి. సాంప్రదాయ భట్టి హలీం నుంచి మోడరన్ వేరియంట్స్ వరకు.. హైదరాబాద్‌లో హలీంపై మోజు రోజురోజుకూ పెరుగుతోంది. హైదరాబాద్‌లో ఓ హోటల్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.. అదే హోటల్ సిటీ డైమండ్. హైదరాబాద్‌లోని హలీం ప్రియులకే కాదు.. గతకొన్నేళ్లుగా ఎంతోమందికి ఇష్టమైన చోటుగా నిలిచింది హోటల్ సిటీ డైమండ్. గత ఏడాది కూడా ఈ హలీం కోసం ప్రజలు గంటల కొద్దీ క్యూలో నిల్చుండేవారు. అయితే ఈ సంవత్సరం.. సోషల్ మీడియా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ప్రభావంతో.. హోటల్ సిటీ డైమండ్ మరింత పాపులర్ అయింది. ఇక్కడి హలీం రీల్స్, వీడియోలు చూసి వందల మంది ఈ హోటల్‌కి వచ్చి హలీం రుచి చూస్తున్నారు. ఈ సీజన్‌లో అత్యంత చర్చనీయాంశంగా నిలిచిన హలీం సిటీ డైమండ్‌దే.

**ఈ హైప్ వెనుక అసలు కారణం ఏమిటి.. ?**

సిటీ డైమండ్ హలీం కేవలం సోషల్ మీడియా వల్లే ఫేమస్ అవలేదని అర్థం చేసుకోవాలి. ఇక్కడ హలీం రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. తిన్న వారిని నిజంగా రుచితో మంత్రముగ్ధుల్ని చేస్తుంది ఇక్కడి హలీం. దాని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది మృదువుగా, మాంసాహార రుచితో అద్భుతంగా ఉండటం. భట్టీలో నెమ్మదిగా ఉడికించబడే ఈ హలీంలో ప్రతి పదార్థం సమపాళ్లలో కలిసిపోతుంది. "ఈ హలీంలో మాంసం, పెసరపప్పు నిష్పత్తి చాలా సరిగ్గా ఉంటుంది. ఇతర హలీమ్‌లలో కొన్నిసార్లు ఎక్కువ కొవ్వు, ఎముకలు ఎక్కువగా ఉంటాయి. ఇది తినే వారికి కాస్త ఇబ్బందిగా అనిపించవచ్చు. కానీ సిటీ డైమండ్ హలీం చాలా స్మూత్, తేలికగా ఉంటుందనే ఒక కస్టమర్ చెప్పాడు. హోటల్ సిటీ డైమండ్.. మెహదీపట్నం ప్రాంతంలో ఉంది. దీనికి ఏ విధమైన బ్రాంచీలు కూడా లేవు. ఈ హలీం ఎటువంటి ఫుడ్ డెలివరీ యాప్‌లో అందుబాటులో లేదు. కేవలం హోటల్‌కే వెళ్లాలి. ఈ హోటల్ ముందు ఇఫ్తార్ సమయానికి పెద్ద క్యూలు కనపడతాయి. రంజాన్ రోజుల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి హలీం అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ఒక ప్లేట్ హలీం రూ.180, ఫ్యామిలీ ప్యాక్ రూ.500, డైమండ్ స్పెషల్ రూ.700లుగా ఉంటుంది. ఈ ధరల్లో కాస్త

## అమృత అంటే మారుతీరావుకు ప్రాణం.. ఇంట్లో 20 అడుగుల ప్లెక్సీ.. కాకపోతే.. : ఏవీ రంగనాథ్



**హైదరాబాద్-నవభూమి:** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ ప్రణయ్ పరువు హత్య కేసులో జిల్లా కోర్టు తుది తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరిశిక్ష, మిగిలిన ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కాగా ఈ తీర్పుపై అప్పటి జిల్లా ఎస్పీ, ప్రస్తుత హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. నిజం గెలిచిందని.. తమ కష్టానికి తగిన ఫలితం దక్కిందని అన్నారు. ప్రణయ్ హత్య కేసులో 9 నెలలు కష్టపడి ఛార్జ్‌షీట్ దాఖలు చేశామని చెప్పారు. అన్ని ఆధారాలతో 1600 పేజీలతో చార్జిషీట్ దాఖలు చేసినట్లు చెప్పారు. చివరకు నేడు తుది తీర్పు రావటం సంతోషంగా ఉందన్నారు. అయితే కూతురు ఇష్టం లేని కులాంతరం వివాహం చేసుకోవంటతోనే ప్రణయ్‌ను అమృత తండ్రి మారుతీ రావు హత్య చేయించినట్లు ఏవీ రంగనాథ్ తెలిపారు. అమృత అంటే మారుతీరావుకు ప్రాణమని అన్నారు. లేకలేక కలిగిన సంతానం కావటంతో.. కూతుర్ని చాలా ప్రేమగా చూసుకునేవారని చెప్పారు. ఇంట్లో 15 నుంచి 20 అడుగుల ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేసుకొని తన కూతురిపై ఉన్న ప్రేమను వ్యక్తం చేసేవాడని తెలిపారు. అయితే ఇష్టంలేని అబ్బాయిని ప్రేమించటంతో మారుతీరావు తట్టుకోలేకపోయాని చెప్పారు. అప్పటికే రియల్ ఎస్టేట్‌లో ఉన్న అతడు.. ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న అబ్దుల్ బారీతో హత్యకు ప్లాన్ చేసినట్లు చెప్పారు. బారీ గతంలో ఓ ల్యాండ్ సెటిల్‌మెంట్‌లో హెల్ప్ చేయగా.. కూతురు విషయంలోనూ అదే చేయాలని భావించినట్లు తెలిపారు. అక్కడే మారుతీ రావు పొరపాటు చేశారని.. సుపారీ ఇచ్చి ప్రణయ్ హత్య చేయించినట్లు చెప్పారు. అతడికి డబ్బు, పరపతి ఉన్నా.. కూతురుపై ఉన్న అమితమైన ప్రేమతో తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నట్లు ఏవీ రంగనాథ్ వెల్లడించారు. కాగా, ఈ కేసులో ఏ6గా ఉన్న మారుతీ రావు తమ్ముడు శ్రవణ్‌కు సైతం న్యాయస్థానం జీవత ఖైదు విధించింది. దీనిపై శ్రవణ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి ఏ తప్పు చేయకున్నా.. జీవిత ఖైదు విధించారని శ్రవణ్ కుమార్తె కన్నీరుమున్నీరుగా విలపించారు.

# తెలంగాణాలో భానుడి ప్రతాపం

(1వపేజీ తరువాయి)అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుండి ఎండలు మండుతున్నాయి. తీవ్రమైన ఎండలతో పాటుగా, వేడి గాలులు కూడా వీస్తున్నాయి. జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఉష్ణోగ్రతలు ఇలా ఉంటే రానున్న ఐదు రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రానున్న ఐదు రోజుల్లో సగటు ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుండి 40 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే నిన్న తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాలలో ఎండలు దంచికొట్టాయి. నిన్న అత్యధికంగా నల్గొండ జిల్లా చిట్యాల లో 39.8 డిగ్రీల సెల్సియస్ గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ వారం ఎండల తీవ్రత పెరుగుతుందని అంచనా మరోవైపు హనుమకొండ, భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్, మేడ్చల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సూర్యాపేట, వనపర్తి, మహబూబాబాద్ జిల్లాలలో గరిష్ట ఉష్ణోగ్రత 39.7శీ గా నమోదైనట్టు వెల్లడించారు. ఇదిలా ఉంటే హైదరాబాద్ నగరంలోని 37 ఉష్ణోగ్రత నమోదైనట్టు సమాచారం. ఇక రాష్ట్రంలో ముందు ముందు మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎండలలో జాగ్రత్త ముఖ్యంగా ఎండాకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల మధ్య బయటకు వెళ్లకుండా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు. ఎండాకాలంలో డిహైడ్రేషన్ కు గురికాకుండా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, జ్యూస్ తాగాలని చెబుతున్నారు.

## మంగళగిరికి ఫ్రీ బస్సు

(1వపేజీ తరువాయి)నియోజకవర్గం ప్రజలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. దీంతో మంగళగిరి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఉచిత ఎలక్ట్రికల్ బస్సు సేవలను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో జెండా ఊపి ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి ఎయిమ్స్ హాస్పటల్, పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో మంత్రి లోకేష్.. మెగా ఇంజనీరింగ్ సంస్థను ఒప్పించి నిధుల నుంచి బస్సులను సమకూరేలా చేశారు. దీంతో మెగా సంస్థ 2.4కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఒలెక్ట్రా 7 మీటర్ల ఎలక్ట్రిక్ బస్సులను ఇచ్చింది.

## కోడెల చావు వెనుక విజయసాయి?

(1వపేజీ తరువాయి)తాజాగా నాగరాజు తాను కోడెల తండ్రీ కొడుకులపై తప్పుడు ఫిర్యాదు చేశానంటూ గతంలో పెట్టిన ఫిర్యాదు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు వీరిపై ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం పల్నాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## పోసాని కృష్ణమురళీకి గుడ్ న్యూస్ చెప్పిన కోర్టు..

**నరసరావుపేట-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసుల్లో సినీ నటుడు పోసాని కృష్ణమురళీకి స్వల్ప ఊరట లభించింది.

# అమరావతికి రుణాలు..

**న్యూఢిల్లీ-నవభూమి:** రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలు ఆంధ్రప్రదేశ్ ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలోకి రావని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి స్పష్టం చేశారు. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితిలోకి లెక్కించకూడదని నిర్ణయించినట్లు పార్లమెంట్‌కు ఆయన తెలిపారు. సోమవారం లోకసభలో వైసీపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఆ క్రమంలో అందుకు సంబంధించిన అన్ని వివరాలను ఆయన సభలో వివరించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ప్రకటించిన అమరావతి నిర్మాణానికి విదేశీ సంస్థల నుంచి తీసుకునే రుణాలు ఏపీ ఆ రాష్ట్ర అప్పుల పరిధిలోకి రావని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంతంలో అత్యవసర మౌలిక వసతుల కోసం ఇప్పటి వరకు ప్రత్యేక సాయం... గ్రాంట్స్ కింద రూ.2,500 కోట్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి కార్యక్రమం, అమరావతి సమ్మిళిత,సుస్థిర రాజధాని నగర అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రూ.6,700 కోట్ల చొప్పున రుణ ఆమోదం కోసం సాయం చేశామని ఆయన సోదాహరణగా గణాంకాలతో సహా వివరించారు. ప్రపంచ బ్యాంకు రుణం ఈ ఏడాది జనవరి 22 నుంచి.. అలాగే ఆసియా అభివృద్ధి బ్యాంకు రుణం ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి వచ్చాయన్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంజక్ చౌదరి లోక్ సభ సాక్షిగా ప్రకటించారు. అయితే ఈ రుణాలకు సంబంధించిన పంపిణీ ఇంకా జరగలేదని తెలిపారు. ప్రస్తుత ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 10 శాతానికి మించకుండా..గరిష్టంగా రూ.1,500 కోట్లు, ప్రత్యేక సాయంగా..గ్రాంట్‌గా ఆంధ్రప్రదేశ్‌కు "కౌంటర్ పార్ట్ ఫండింగ్" సమకూర్చాలని కూడా నిర్ణయించామని ఆయ తెలిపారు.

ఈ ప్రాజెక్టుకు అందిస్తున్న రుణాన్ని ఆంధ్రప్రదేశ్ రుణ పరిమితిలో లెక్కించ కూడదని నిర్ణయించినట్లు ఆ సమాధానంలో ఆయన క్లియర్ కట్‌గా స్పష్టం చేశారు. రుణం మంజూరు చేసేటప్పుడు రూపొందించిన మార్గదర్శకాలు, షరతులను అనుసరించి నిధుల వినియోగ పర్యవేక్షణ జరుగుతుందని తన లిఖిత పూర్వక సమాధానంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రాజధాని అమరావతి, రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా కేంద్రం నుంచి సహాయ సహకారాలు తీసుకోంటుంది. అలాగే ప్రపంచ బ్యాంక్ నుంచి నిధులు, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి సైతం రుణాలు పొందేందుకు చర్యలు చేపట్టింది.

## ప్రణయ్ హంతకుడికి ఉరిశిక్ష!

(1వపేజీ తరువాయి)యువకుడైన ప్రణయ్ ను ప్రేమించి పెళ్లాడింది. ఈ వివాహం మారుతీరావుకు అసలు ఇష్టం లేదు. దీంతో 2018 సెప్టెంబరు 14న సుపారీ గ్యాంగ్‌తో ప్రణయ్ ను హత్య చేయించాడు. భార్య, తల్లితో కలిసి ఆస్పత్రికి వెళ్లివస్తున్న ప్రణయ్ ను సుపారీ గ్యాంగ్ సభ్యుడు సుభాష్ కుమార్ శర్మ కత్తితో దారుణంగా నరికి చంపాడు. అక్కడికక్కడే ప్రణయ్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ కేసును అప్పట్లో నల్లగొండ ఎస్పీగా ఉన్న ఏవీ రంగనాథ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎనిమిది మందిని నిందితులుగా పేర్కొంటూ 2019లో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఐదేళ్లకు పైగా కోర్టులో విచారణ సాగింది. కొన్నాళ్ల కిందట వాదనలు ముగిశాయి. సోమవారం నల్లగొండ కోర్టు తీర్పు ఇస్తూ ప్రణయ్ ను కత్తితో నరికి చంపిన ఏ2 సుభాష్‌కుమార్‌శర్మకు ఉరి శిక్ష విధించింది. ఏ3 అస్గర్ అలీ, ఏ4 బారీ, ఏ5 కరీం, ఏ6 శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాం. సుభాష్ గతంలో బెయిల్ కు ప్రయత్నించినా దొరకలేదు. అలీ వేరే కేసులో జైలులో ఉన్నాడు. మిగిలినవారికి బెయిల్ వచ్చింది. శ్రవణ్ కుమార్ అమృతకు సొంత బాబాయి. ఇక ఈ కేసులో ఏ1 మారుతీరావు. ఈయన 2020లో ఆత్మ హత్యకు పాల్పడ్డారు. పెళ్లయిన 9 నెలలకే.. ప్రణయ్, అమృత 2018 జనవరిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అదే ఏడాది సెప్టెంబరులో ప్రణయ్ హత్యకు గురయ్యాడు. కాగా, భర్త హత్య సమయానికి కే అమృతకు ఏడు నెలలు. ఆ తర్వాత ఆమెకు కుమారుడు పుట్టాడు.

## శ్రీ చైతన్య విద్యాసంస్థలపై ఐటీ దాడులు

(1వపేజీ తరువాయి)చేస్తూ రిసీట్ ఇవ్వకుండా పెద్దఎత్తున ట్యాక్స్ ఎగ్గొడుతున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ముందుగా హైదరాబాద్ మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించిన అధికారులు అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు సమాచారం. అనంతరం వరసగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో, అలాగే దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు చేశారు. ఈ సోదాల్లోనూ పెద్దమొత్తంలో అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నేరుగా నగదు తీసుకునేందుకు ఒక సాఫ్టేర్.. అలాగే ప్రభుత్వానికి కట్టే ట్యాక్స్ కోసం మరో సాఫ్టేర్ ఏర్పాటు చేసుకున్నట్లు ఐటీ అధికారులు నిర్ధారించారు. నగదు రూపంలో అధికంగా ఫీజులు వసూలు చేసి ప్రభుత్వానికి మాత్రం తక్కువగా చూపించారని ప్రాథమిక విచారణలో గుర్తించారని సమాచారం. అధికంగా ఫీజులు వసూలు చేస్తూ తప్పుడు లెక్కలు చూపించి పన్ను కట్టకుండా ఎగవేతకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే, ఐటీ అధికారులు ఈ వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## రాష్ట్రానికి నిధులు తెస్తే కిషన్‌రెడ్డిని సన్మానిస్తం

(1వపేజీ తరువాయి)ఎన్హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల రాజేందర్ కాదా? భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని అన్నప్పుడు. మాతో కదా చర్చించాలి. కేంద్ర మంత్రులు హైదరాబాద్ పీల్చి సమీక్షలు పెడితే కిషన్ రెడ్డి ఎందుకు రాలేదు. కేసీఆర్ బాధపడుతారని కిషన్రెడ్డి రాలేదా? పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమీక్ష పెడితే ఎందుకు రాలేదు? ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాజెక్టులు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. హైదరాబాద్ అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలని మేం భావిస్తున్నాం. రాష్ట్రానికి నిధులు రాకూడదని బారాస చూస్తోంది. రాష్ట్రాభివృద్ధి. కేంద్ర నిధులపై చర్చకు కేంద్రమంత్రి కిషన్రెడ్డి సిద్ధం
కావాలి. చర్చకు నేను, భట్టి విక్రమార్క రావడానికి సిద్ధంగా ఉన్నాం. అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్రెడ్డికి సన్మానం చేస్తాం. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ను విమర్శించేందుకు సీఎం స్థాయి సరిపోదా? పీసీసీ అధ్యక్షుడిగా కేసీఆర్ను గద్దెదింపి అధికారంలోకి వచ్చాం. భారాస హయాంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు. మందకృష్ణ మాదిగ అంటే నాకు గౌరవం ఉంది. పోటీ పరీక్షల ఫలితాలకు.. రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదు. మందకృష్ణ భాజపా నేతలా మాట్లాడితే ఎలా? గతంలో ఎప్పుడో వచ్చిన నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అంశం వర్తించదు. ఏదైనా చేయాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కేటీఆర్, కిషన్రెడ్డి కలిసి తిరుగుతున్నారని నేను చెబుతున్నా"" అని సీఎం పేర్కొన్నారు.

## రాములమ్మ నామినేషన్

(1వపేజీ తరువాయి)ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఎంఐఎం పార్టీ మద్దతు ప్రకటించింది. నామినేషన్ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన విషయం తెలిసిందే. దాంతో ఈ ఎన్నికల్లో గెలిచి సత్తాచాటాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తున్నాయి.

## మహిళలకు వర్క్ ఫ్రం హెూం

(1వపేజీ తరువాయి)భవనాలపైనా సర్వే నిర్వహిస్తున్నారు. విద్యార్హతలు ఉండి, పని చేసే సామర్థం ఉన్నవారికి ట్రైనింగ్ ఇవ్వడం ద్వారా ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశాలు కల్పించేందుకు ఆయా సంస్థలతో మాట్లాడాలని సీఎం అధికారులకు సూచించారు.

## భారతీయ స్టాక్ మార్కెట్ పతనం

(1వపేజీ తరువాయి)పడిపోయింది. చివరకు, 217.41 పాయింట్ల నష్టంతో 74,115.17 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 77.55 పాయింట్ల నష్టంతో 22,474.95 వద్ద స్థిరపడింది. లాభనష్టాల మిశ్రమం సెన్సెక్స్ 30 సూచీలో, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, ఎల్ అండ్ టి, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాలను చవిచూడగా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాలను నమోదు చేశాయి. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లలో కూడా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు సూచీలకు కొంత మద్దతునివ్వగా, ఎల్ అండ్ టి, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు సూచీలను కిందకు లాగాయి.

అమెరికా ప్రభావం.. అల్లకల్లోలం అమెరికా ఫ్యూచర్స్ మార్కెట్ల నుండి వచ్చిన ప్రతికూల సంకేతాలు భారతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 38 పైసలు క్షీణించి 87.33 వద్దకు చేరడం కూడా సెంటిమెంటును దెబ్బతీసింది. అటు అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.51 డాలర్లుగా ఉండగా, బంగారం ఔన్సు ధర 2914 డాలర్లుగా ఉంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నాయి. మదుపరులు జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది. పెట్టుబడులు పెట్టే ముందు నిపుణుల సలహాలు తీసుకోవడం ఉత్తమం.





## ప్రపంచ వ్యాప్తంగా నిలిచిన ఎక్స్ సేవలు..

**వాషింగ్టన్-నవభూమి:**అమెరికన్ టైకూన్, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఆధీనంలోని ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్ (ఎక్స్) ఇటీవలే మాటిమాటికీ సతాయిస్తోంది. ఏదో ఒక సమస్యతో యూజర్లను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటీవలే ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడటం.. లాగిన్ కాకపోవడం, ట్వీట్స్ మాయం కావడం వంటి సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ఎక్స్‌లో ఇలాంటి సమస్యే తలెత్తింది.సోమవారం మధ్యాహ్నం ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్ సేవలు నిలిచిపోయాయి. సైట్ ఓపెన్ కావడం లేదు. లాగిన్ అయినా యాక్సెస్ చేయలేక యూజర్లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వరుసగా పోస్టులు పెడుతున్నారు. దాదాపు అరగంట నుంచి ఎక్స్ సేవలు స్తంభించిపోయినట్లు పేర్కొంటున్నారు. ఎక్స్ సైట్‌ను ఓపెన్ చేయగా.. స్క్రీన్‌పై 'సమ్‌థింగ్ వెంట్ రాంగ్.. ప్లీజ్ ట్రై అగెయిన్' (%ంశీవ్‌వ్రీఖఅన్ర షవత్ షతీశీఅన్ర%) అన్న సందేశం వస్తున్నట్లు తెలిపారు.డౌన్‌డిటెక్టర్ నివేదిక ప్రకారం.. భారత్‌లో 2 వేల మంది, అమెరికాలో 18,000, యూకేలో 10,000 మంది ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఎక్స్ అంతరాయానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. చాలా మంది వినియోగదారులు సర్వర్ డౌన్ అయినట్లు ఫిర్యాదు చేశారు. ఈ అంతరాయం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు ఒకింత గందరగోళానికి గురయ్యారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
మంగళవారం
11 । మార్చి । 2025

## తల్లి కళ్లెదుటే.. తండ్రిని కర్రలతో చావబాదిన కూతుళ్లు.. వీడియో బయటికి రావడంతో..



**మొరెనా-నవభూమి:** మధ్యప్రదేశ్‌లోని మొరెనాలో ఒక తండ్రి ఈ నెలలోనే ఇద్దరు కుమార్తెలకు ఘనంగా వివాహం చేసి అత్తారింటికి పంపించాడు. కూతుళ్లు వెళ్లిపోయాక భార్య కూడా శాశ్వతంగా పుట్టింటికి వెళ్తానని చెప్పింది. ఇది జరిగిన రెండు రోజులకే ఇంట్లో అనుమానస్పద స్థితితో విగతజీవిగా కనిపించాడు ఆ వ్యక్తి. అయితే, అతడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నతర్వాత,ఇద్దరు కుమార్తెలు కలిసి తండ్రిని కర్రలతో కొడుతుండగా, తల్లి భర్తను గట్టిగా పట్టుకుని కొట్టమని చెబుతున్నట్లు కనిపించే ఒక వీడియో వెలుగులోకి వచ్చింది. మాకేం సంబంధం లేదని తల్లీ, కుమార్తెలు వాదిస్తుండగా.. వీరే హత్య చేశారని బాధితుడి తరపు బంధువులు ఆరోపిస్తున్నారు.

కూతుళ్లు వెళ్లిన రెండ్రోజులకే..మధ్యప్రదేశ్‌లోని మొరెనా సిటీ కొత్వాలి ప్రాంతంలో నివసించే హరేంద్ర మౌర్య ఒక ఎలక్ట్రికల్ మెకానిక్. హరేంద్రకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. హరేంద్ర, అతడి భార్య తరచుగా గొడవ పడుతుండేవారు.ఇదిలా ఉంటే ఇటీవల మార్చి 1న హరేంద్ర తన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. మార్చి 8 (శనివారం) ఉదయం ఇద్దరు కుమార్తెలను అత్తారింటికి పంపించాడు. ఆ సాయంత్రమే భార్య కూడా పుట్టింట్లోనే శాశ్వతంగా నివసిస్తానని హరేంద్రతో తెగేసి చెప్పింది. ఈ బాధతో హరేంద్ర ఇంట్లోకి వెళ్లి తాళం వేసుకుని ఎంతసేపటికీ బయటికీ రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఏదో జరిగిందని అనుమానించి తలుపు పగలగొట్టి చూడగా.. హరేంద్ర ఉరివేసుకుని కనిపించాడు. ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు కాపాడలేకపోయారు.

కర్రలతో కొడుతుండగా..హరేంద్ర ఆత్మహత్య చేసుకునే ముందే అతడి భార్య హరేంద్ర కాళ్లు గట్టిగా పట్టుకుని కూర్చుని ఉండగా ఇద్దరు కుమార్తెలు కర్రలతో కొడుతున్న వీడియో కూడా వైరల్ అయింది. ఈ విషయం పోలీసుల దృష్టికి కూడా వచ్చింది.ఇంతలోనే హరేంద్ర తరపు బంధువులు అతడి భార్యే ఈ హత్యకు పాల్పడిందని ఆరోపిస్తున్నారు.

రెండు కోణాల్లో దర్యాప్తు..ప్రస్తుతం ఈ వీడియో ఎప్పటిదో ఇంకా తెలియరాలేదు. కానీ, ఈ వ్యక్తి మృతి అనుమానాస్పదంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. వీడియో వైరల్ అయిన తర్వాత పోలీసులు గ్వాలియర్ మెడికల్ కాలేజీ వైద్య బృందంతో హరేంద్ర మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు జరుగుతుందని పోలీసులు వెల్లడించారు.

## పండగ వేళ శ్మశానంలో..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఫాల్గుణ మాసం పౌర్ణమి ఘడియలు హెూలీ పండగ జరుపుకొంటారు. ఈ పండగ వేళ.. రంగులు ఒకరిపై ఒకరు జల్లుకొంటారు. అయితే అదే హెూలీ పండగ వేళ.. బూడిదను ఒకరిపై ఒకరు జల్లుకుంటారన్న సంగతి తెలుసా. అది కూడా శ్మశానంలో కాలిన భౌతిక కాయం తాలుక బూడిదను ఈ వేడుకల్లో ఒకరిపై ఒకరు జల్లుకొంటారు.

వారణాసి, మార్చి 10: మరికొద్ది రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రజలు హెూలీ పండగ జరుపుకోనున్నారు.హెూలీ పండగ అంటే.. రకరకాల రంగులతోపాటు గులాల్ ఒకరిపై ఒకరు చల్లు కొంటారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో దాదాపుగా ఇలాగే ప్రతి ఒక్కరు ఈ పండగను జరుపుకొంటారు. అయితే హెూలీ పండుగ రోజు.. శ్మశానంలో చితిపై కాలిన భౌతిక కాయం తాలుక బూడిదతో ఈ పండగ జరుపుకుంటారని తెలుసా. ఓ వేళ తెలిసినా అతి కొద్ది మందికి మాత్రమే ఈ విషయం తెలుస్తుందీ. విశ్వేశ్వరుడు కొలువు తీరిన వారణాసి క్షేత్రంలో బూడిదతో హెూలీ వేడుకలు జరుపుకుంటారు.ఈ హెూలీని మసాన్‌కి హెూలీ, మసాన్ హెూలీ అని పిలుస్తారు. వారణాసిలోని హరిశ్చంద్ర ఘాట్‌లో మహా శ్మశాన్ హారతి అనంతరం మసాన్‌కి హెూలీ ప్రారంభమవుతోంది. ఈ హెూలీ వేళ.. సాధువులు, శివ భక్తులు.. పరమ శివుడిని పూజించిన అనంతరం చితి కాలిన అనంతరం వచ్చిన బూడిదతో హెూలీ నిర్వహిస్తారు. ఈ సమయంలో మణికర్ణికా ఘాట్.. హరిహర్ మహాదేవ్ అనే నామ స్మరణతో మార్మోగుతోంది. అయితే చితి నుంచి వచ్చిన బూడిదతో హెూలీ ఆడటం వల్ల.. శివుడుకి ఆనందం, ఆయన భక్తులకు శ్రేయస్సుతోపాటు ఆశీర్వాదం లభస్తోందని మత విశ్వాసం ఉంది. ఈ నేపథ్యంలో మసాన్ హెూలీ నిర్వహిస్తారు.

**ఈ ఏడాది మసాన్ హెూలీ ఎప్పుడంటే..?**

2025, మార్చి 11వ తేదీ ఈ మసాన్ హెూలీ జరుపుకొంటారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రంగభరి ఏకాదశి రోజున ఈ హెూలీ పండుగ ప్రారంభమవుతుంది. ఈ రంగభరి ఏకాదశి నుంచి ఆరు రోజుల పాటు ఈ హెూలీ పండగ జరుపుకుంటారు.రంగభరి ఏకాదశి రెండవ రోజున మాసాన్ హెూలీ జరుపుకుంటారు. మాసాన్ హెూలీ రోజు.. కాశీలోని హరిశ్చంద్ర, మణికర్ణిక ఘాట్‌లలో శివుడు తన అనుచరులతో వింత హెూలీ ఆడతారనే ఓ మతపరమైన నమ్మకం ఉంది.వారణాసి ప్రజలకు ఈ మాసాన్ హెూలీ అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే ఇది వారి సాంస్కృతిక గుర్తింపుతోపాటు ఆధ్యాత్మిక స్వభావాన్ని చూపిస్తుంది. ఈ పండగ వేళ వారణాసిలో చితిలోని బూడిదను ఉపయోగించడం ద్వారా జీవితం తాలుకు అస్థిరత, అలాగే ఈ ప్రాపంచిక జీవితంలో ఒక వ్యక్తి ఉనికి యొక్క చక్రీయ స్వభావాన్ని సూచిస్తుంది.చితి జ్వాలలు మృతుని అవశేషాలను కాల్చేస్తాయి. అలాగే భోగి మంట బూడిదతో హెూలీ జనన మరణ శాశ్వత చక్రాన్ని గుర్తు చేస్తుంది.ఇక హెూలీ వేళ.. వినియోగించే శరీరం తాలుక బూడిద.. మనస్సు, ఆత్మ నుంచి కాలుష్య కారకాలను తొలగించే ప్రక్షాళన ప్రభావాలను కలిగి ఉంటుందని విశ్వసిస్తారు. వారణాసిలోని శ్మశానంలో హెూలీ వేళ.. ఒకరిపై ఒకరు బూడిదను పూయడం ద్వారా ప్రజలు ఆధ్యాత్మిక ఉల్లాసంతోపాటు అంతర్గత శుద్ధీకరణ జరుగుతోందని చెబుతారు. అదే విధంగా మాసాన్ హెూలీ వేడుకల్లో విభిన్న మతాల వారు పాల్గొంటారు. దీంతో స్థానిక ప్రజల్లో మత సామరస్యం, ఐక్యతను పెంపొందిస్తోంది.

## భారతీయ విద్యార్థులకు బ్రిటన్ యూనివర్సిటీ బంపరాఫర్.. లక్షల్లో ఫీజు రద్దు!



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతీయ విద్యార్థులకు బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఒకటి బంపరాఫర్ ప్రకటించింది. తన విద్యా సంస్థలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుకు దరఖాస్తు చేసుకునే ప్రతిభావంతులైన భారతీయులకు వైస్ ఛాన్సలర్ పురస్కారం కింద 10,000 పౌండ్ల (రూ.11,26,000) ఫీజులను రద్దు చేస్తామని ప్రపంచ ప్రఖ్యాత కింగ్స్ కాలేజ్ వెల్లడించింది. గతేడాది ఈ పథకాన్ని కింగ్స్ కాలేజీ ప్రారంభించింది ఈ సంవత్సరం 30 మంది అర్హులైన భారతీయ విద్యార్థులకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి మొదలయ్యే పూర్తికాల, ఆన్ క్యాంపస్ పీజీ కోర్సుల్లో చేరడానికి భారతీయ విద్యార్థులు ఏప్రిల్ చివరికల్లా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారు తమ విద్యార్హతలు, కింగ్స్ కాలేజీలో విద్యాభ్యాసం ద్వారా తాము ప్రపంచానికి చేయనున్న సేవలను నివేదించాలి. భారత్‌కు చెందిన వైస్-ఛాన్సెలర్ ప్రొఫెసర్ శిజిత్ కపూర్ ఈ అవార్డుల ప్రాముఖ్యతను, ముఖ్యంగా భారతీయ విద్యార్థులకు అందజేయడం వెనుకున్న కారణాలను తెలిపారు. విదేశాలలో ఉన్నత చదువుల కోసం తాను ఢిల్లీ నుంచి లండన్‌కు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కాలేజీతో సుదీర్ఘకాలంగా భారతీయ విద్యార్థులకు సంబంధాన్ని కూడా నొక్కిచెప్పారు. ఈ కాలేజీలోని మహిళా పూర్వ విద్యార్థుల్లో స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు ఒకరని పేర్కొన్నారు.'యూకేలో బెంగాలీ, సంస్కృతం బోధించిన తొలి యూనివర్సిటీల్లో మాది ఒకటి... కింగ్స్ కాలేజీలో మహిళలకు ప్రవేశం లభించిన తొలినాళ్లలో చేరిన ముఖ్యమైన విద్యార్థుల్లో సరోజినీ నాయుడు ఒకరు' అని ఆయన వివరించారు. భారతీయ దరఖాస్తుదారుల సంఖ్య పెరుగుతున్నారని, ట్యూషన్ ఫీజులు చాలా మందికి భారంగా మారాయని ఆయన అన్నారు. 'ఎక్కువ మంది విద్యార్థులను ప్రోత్సహించడానికి మేము వైస్-ఛాన్సలర్ అవార్డులను ప్రతిపాదించాం' అని ఆయన చెప్పారు.ఎయిమ్స్‌లో గ్రాడ్యుయేషన్ అనంతరం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యను అభ్యసించిన శిజిత్ కపూర్..ఆ తర్వాత లండన్ కింగ్స్ కాలేజీలో అధ్యాపకుడిగా చేరారు. రాబోయే 10-15 ఏళ్లలో ప్రపంచ విద్య కోసం భారతీయ విద్యార్థుల డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌లోనూ యూకే విశ్వవిద్యాలయాల తమ క్యాంపస్‌లు ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నాయని, ఈ దిశగా సౌతాంప్టన్, సర్రే యూనివర్సిటీలు తీసుకున్న చొరవను ఆయన స్వాగతించారు.

## 'రన్యారావుకు మీరే అండ.. కాదు మీరే అండ..' బీజేపీ, కాంగ్రెస్ బ్లేమ్ గేమ్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ చేస్తూ ఇటీవల బెంగళూరు ఎయిర్‌పోర్టు లో పట్టుబడింది. దీనిపై ఇప్పుడు కర్ణాటకలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీజేపీ బ్లేమ్ గేమ్ ఆడుతున్నాయి. రన్యారావుకు మీరు అండగా ఉన్నారని బీజేపీ ఆరోపిస్తే.. లేదు మీరే అండగా ఉన్నారని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేస్తోంది. రన్యారావు అరెస్టును తప్పించేందుకు ఇద్దరు రాష్ట్ర మంత్రులు ప్రయత్నించారని కర్ణాటక బీజేపీ ఆరోపించగా.. బీజేపీ హయాంలో రన్యా రావుకు ప్రభుత్వ భూమి కేటాయించారెందుకని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. రన్యారావు బంగారం స్మగ్లింగ్ చేసేందుకు వీలు కల్పించడం అతిపెద్ద ప్రభుత్వ ప్రొటోకాల్ ఉల్లంఘన అని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర యెడియూరప్ప విమర్శించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ ట్రాక్ రికార్డును బట్టి చూస్తే ఈ ఉల్లంఘన పెద్ద ఆశ్చర్యమేం కలిగించదని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రన్యారావు పట్టుబడిన సందర్భంగా ఆమెను అరెస్ట్ కాకుండా విడిపించేందుకు సిద్ధరామయ్య ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. ప్రభుత్వంలోని ప్రముఖుల సహకారం లేకుండా ఇంత భారీ స్మగ్లింగ్ సాధ్యం కాదని వ్యాఖ్యానించింది.ప్రస్తుతం ఈ కేసులో సీబీఐ దర్యాప్తు జరుగుతోందని, దర్యాప్తులో కాంగ్రెస్ బండారం బయటపడు తుందని బీజేపీ చెబుతోంది. పిల్లి కళ్లు మూసు కుని పాలు తాగినట్లు కాంగ్రెస్ తీరు ఉన్నదని, కేసు దర్యాప్తులో నిజాలు బయటికి వస్తాయని పేర్కొంది. అయితే బీజేపీ స్టేట్ చీఫ్ విజయేంద్ర ఆరోపణలపై కాంగ్రెస్ స్పందించింది. కర్ణాటక హెూంమంత్రి జీ పరమేశ్వర మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోందని, సీబీఐ దర్యాప్తు ముగిసే వరకు ఇలాంటి ఊహాగానాలు వస్తూనే ఉంటాయని అన్నారు.రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్‌కు రాష్ట్ర మంత్రుల సహకారం ఉందనే ఆరోపణల్లో నిజం లేదని పరమేశ్వర కొట్టిపారేశారు. బీజేపీ సహకారంతోనే రన్యారావు స్మగ్లింగ్ చేస్తుందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 2023లో బీజేపీ హయాంలోనే రన్యారావుకు ప్రభుత్వ భూమి కేటాయించారని, ఈ విషయంపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తుందని అన్నారు. రన్యారావుకు బీజేపీ సర్కారు భూమి ఎందుకు కేటాయించినట్టని ఆయన ప్రశ్నించారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.. డీఎంకేపై ధర్మేంద్ర ప్రధాన్ ఎదురుదాడి



**న్యూఢిల్లీ-నవభూమి:** నూతన విద్యా విధానం త్రిభాషా విధానంపై డీఎంకే వైఖరిని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో తప్పుపట్టారు. తమిళనాడు విద్యార్థుల సంక్షేమం పట్ల డీఎంకే కు నిజాయితీ లోపించిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును వారు నాశనం చేస్తున్నారని అన్నారు."భాషాపరమైన అవరోధాలు కల్పించడం ఒక్కటే వారి పని. వాళ్లు రాజకీయాలు చేస్తున్నారు. రాద్ధాంతం చేస్తున్నారు. అది అప్రజాస్వామికం, అనాగరికం" అని మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జాతీయ విద్యా విధానంతో కేంద్రం హిందీ భాషను బలవంతంగా బలవంతంగా రుద్దుతోందని డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై కేంద్రం, తమిళనాడు మధ్య తీవ్ర ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో మంత్రి తాజా వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల సెకెండ్ సెషన్ సోమవారంనాడు ప్రారంభమైంది. ప్రశ్నోత్తరాల సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ డీఎంకే వైఖరిపై విరుచుకుపడటంతో పార్లమెంటులో విపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. డీఎంకే ఎంపీలు నిరసనకు దిగడంతో 30 నిమిషాల పాటు సభ వాయిదా పడింది. %ూవీ ాన=×% పథకంపై అడిగిన ఒక ప్రశ్నకు.. తమిళనాడు ప్రభుత్వం రెండునాల్కల ధోరణితో వ్యవహిస్తోందని మంత్రి తప్పుపట్టారు. ఎంఓయూపై సంతకం చేసేందుకు మొదటి అంగీకరించిన తమిళనాడు ప్రభుత్వం ఇప్పుడు వైఖరి మార్చుకుందన్నారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ సహా పలు బీజేపీయేతర రాష్ట్రాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయన్నారు.

**రాజ్యసభలో డీఎంకే వాకౌట్**

మరోవైపు, రాజ్యసభలో త్రిభాష విధానం, డీలిమిటేషన్ అంశాలను డీఎంకే లేవనెత్తింది. అనంతరం సభ నుంచి సభ్యులు వాకౌట్ చేశారు. ఈ అంశంపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చెలరేగింది. విపక్షం వాకౌట్‌పై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విమర్శలు గుప్పించారు. విపక్షాలు వాయిదా తీర్మానానికి ముందు నిబంధనలను చదువుకోవాలన్నారు. వాళ్లు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారనీ, ఎల్ఓపీ సహా విపక్ష నేతలు రిఫ్రెషింగ్ కోర్సుకు వెళ్లి నియమ నిబంధనలను అవగాహన చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ విపక్ష సభ్యులు వాయిదా తీర్మానం ఇస్తుండటం పార్లమెంటరీ వ్యవస్థ ప్రతిష్ఠను తగ్గించడమేనని విమర్శించారు. నిబంధనల కింద ప్రతి అంశాన్ని చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## మాజీ సీఎంకు బిగ్ షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:**మద్యం పాలసీ కేసులో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భూపేష్ భఘేల్‌కు భారీ షాక్ తగిలింది. లిక్కర్ కేసులో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఈడీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ కేసులో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా మొత్తం 14 ప్రాంగణాల్లో సోదాలు జరిగినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇక ఈ సోదాల్లో భిలాయి ప్రాంతంలో ఉన్న భూపేష్ భఘేల్ కుమారుడు చైతన్య భగేల్ నివాసంలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఈడీ అధికారులు నిర్వహించిన తనిఖీల నేపథ్యంలో భూపేష్ భఘేల్ ఆఫీస్ వర్గాలు స్పందించాయి.గత 7 ఏళ్లుగా కొనసాగుతున్న తప్పుడు కేసును కోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం ఈడీ అధికారులు వచ్చి భూపేష్ భఘేల్ నివాసంలో తనిఖీలు చేశారని మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంతో ఆ రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. మద్యం సిండికేట్‌కు రూ.2 వేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని గతంలో ఈడీ అధికారులు పేర్కొన్నారు. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు పలువురు బిజినెస్‌మెన్‌లను ఇప్పటివరకు అరెస్ట్ చేశారు.ఈ నేపథ్యంలోనే తాజాగా మరోసారి ఈడీ అధికారులు దాడులు చేయడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా తప్పుపడుతున్నారు. కాంగ్రెస్‌పై కుట్రలో భాగంగానే ఈ సోదాలు చేస్తున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా అనేక కీలక పత్రాలను పరిశీలించినట్లు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి, ఆయన కుమారుడితోపాటు పలువురు సన్నిహితుల ఇళ్లల్లోనూ ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్ ద్వారా భూపేష్ భఘేల్ కుమారుడు చైతన్య భఘేల్ భారీగా లబ్ధి పొందినట్లు ఈడీ అధికారులు భావిస్తున్నారు. కమీషన్ల ద్వారా పెద్ద భారీగా డబ్బు అందినట్లు అంచనా వేస్తున్నారు. ఈ లిక్కర్ కేసులో దాదాపు రూ.2,161 కోట్లు స్వాహా చేశారని అధికారులు పేర్కొన్నారు. గతేడాది జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలై బీజేపీ అధికారంలోకి వచ్చింది.

## ఒక టెస్టికల్ చిన్నగా ఉంటే ఆర్మీలో చేరలేరా?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం అంటే ఓ ఉద్వేగం. చిన్న వయసులోనే ఆర్థికంగా నిలదొక్కుకోవడ ంతోపాటు.. దేశానికి సేవ చేసే అవకాశం ఉండటంతో లక్షలాది మంది యువకులు సైన్యంలో చేరాలని ఉవ్విళ్లూరుతుంటారు. అయితే ఆర్మీలో చేరడానికి సైన్యం నిర్వహించే పరీక్షలు పాసవ్వాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా టెస్టికల్స్‌ను సైతం పరీక్షిస్తారు. దీనికి సంబంధించిన వీడియోను పోస్టు చేసిన ఓ క్రిటిక్.. ఒక బాల్ చిన్నగా ఉంటే ధైర్యవంతులు కాదా..? అంటూ వెటకారంగా ప్రశ్నించారు.

ఇండియన్ ఆర్మీలో చేరడం అనేది మన దేశంలో చాలా మంది యువకుల కల. చిన్న వయసు లోనే ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించడం తో పాటు.. దేశానికి సేవ చేసే అవకాశం కూడా ఆర్మీలో చేరిన వారికి ఉంటుంది. అందుకే సైన్యంలో చేరి మాతృభూమి రుణం తీర్చుకోవాలని ఎంతో మంది భావిస్తుంటారు. ఆర్మీలో చేరడానికి నిర్ణీత అర్హతలతోపాటు శారీరక దారుఢ్యం ఉండాలి. ఆర్మీలో చేరాలనుకునే యువకుల వృషణాలను సైతం పరీక్షిస్తారు. అయితే ఈ విధానం గురించి మూవీ క్రిటిక్ కేఆర్కే చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అదేంటో.. అందులో ఎంత వరకు నిజం ఉందో చూద్దాం..'ఒకవేళ ఒక బాల్ చిన్నగా ఉంటే.. ఆ వ్యక్తి ధైర్యవంతుడు కాలేడని ఏ పుస్తకంలో రాసి ఉంది. ఇది ఇండియన్ ఆర్మీ మెడికల్ టెస్టు' అనే క్యాప్షన్‌తో.. ఆర్మీ ఉద్యోగార్థుల టెస్టికల్స్‌ను ఓ సైనికుడు చేత్తో పట్టుకొని పరీక్షిస్తున్న వీడియోను కేఆర్కే అనే మూవీ క్రిటిక్ మార్చి 8న ఎక్స్‌లో పోస్టు చేశారు.

**వాస్తవమేంటి..?**

వీడియోలో చూపించినట్లుగా టెస్టికల్స్‌ను పరీక్షించడం అనేది ఇండియన్ ఆర్మీ నిర్వహించే మెడికల్ ఎగ్జామినేషన్ ప్రక్రియలో ఒక భాగం. అయితే ఈ క్లెయిమ్‌లో పేర్కొన్న రెండు వృషణాలు ఒకే సైజులో ఉన్నాయా? లేదా ఒక వృషణం చిన్నగా ఉందా అని తెలుసుకోవడం కోసం ఈ ఎగ్జామినేషన్ నిర్వహించరు.

ఇండియన్ ఆర్మీలో చేరడానికి శారీరకంగా ఫిట్‌గా ఉన్నారా? అని నిర్ధారించడం కోసం నిర్వహించే పరీక్షల్లో భాగంగా.. హెర్నియా (వరిబీజం) లేదా హైడ్రోసెలె (ద్రవాలు చేరడం వల్ల వృషణాల్లో వాపు రావడం), వరికోసెల్ లాంటి సమస్యలు ఉన్నాయేమో తెలుసుకోవడం కోసం ఇలా వృషణాలను పరీక్షిస్తారు. అంతే కానీ ఒక టెస్టికల్ చిన్నగా ఉందా..? రెండు టెస్టికల్స్ ఒకే పరిమాణంలో ఉన్నాయా లేవా అని తెలుసుకోవడం కోసం కాదు. హెర్నియాకు సర్జరీ చేయించుకున్న 24 వారాల తర్వాత ఆర్మీలో చేరేందుకు అర్హులు అవుతారు. ఇండియన్ ఆర్మీలో చేరడానికి మెడికల్, ఫిజికల్ స్టాండర్డ్స్ ఏంటనేది ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్లో చూడొచ్చు.మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. ఒక టెస్టికల్ మాత్రమే ఉన్నవారు కూడా ఇండియన్ ఆర్మీలో చేరేందుకు అర్హులే. అయితే ఒకటే వృషణం ఉండటం అనేది ఇతరత్రా అనారోగ్య సమస్యలకు సూచిక కాకూడదు. ఒక టెస్టికల్ ఉన్న వ్యక్తి ఇండియన్ నేవీలో చేరేందుకు అనర్హులుగా పరిగణించలేమని 2022 జూన్‌లో పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు తీర్పు వెలువరించినట్లు లైవ్ లా అనే వెబ్‌సైట్లో ప్రచురించిన కథనాన్ని ఇక్కడ చూడొచ్చు. దీనికి సంబంధించి టైమ్స్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లోనూ కథనం ప్రచురితమైంది.పైన పేర్కొన్న వివరాలను బట్టి.. ఒక టెస్టికల్ చిన్నగా ఉంటే ఇండియన్ ఆర్మీలో చేరడానికి అనర్హులని అర్థం వచ్చేలా యూజర్ చేసిన క్లెయిమ్‌లో వాస్తవం లేదని సజగ్ టీమ్ నిర్ధారించింది.

ముగింపు:ఇండియన్ ఆర్మీలో చేరాలనుకునే అభ్యర్థులకు నిర్వహించే శారీరక దారుఢ్య పరీక్షలు, ఇతర మెడికల్ టెస్టుల్లో భాగంగా ఇలా వృషణాలను పరీక్షిస్తారు. అయితే ఇది వాటి పరిమాణం సమానంగా ఉందా లేదా అని తెలుసుకోవడం నిర్వహించే పరీక్ష కాదు. ఒక టెస్టికల్ చిన్నగా ఉన్నవారు ధైర్యవంతులు కాదని ఇండియన్ ఆర్మీ ఎక్కడా చెప్పలేదు.

## ఎయిర్ ఇండియా విమానంలో బాంబు బెదిరింపు కలకలం.. న్యూయార్క్ వెళ్తుండగా..



**ముంబై- నవభూమి:** ముంబై నుండి న్యూయార్క్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానంలో బాంబు బెదిరింపు రావడంతో కలకలం చెలరేగింది. బోయింగ్ 777-300 విమానంలో 19 మంది సిబ్బంది సహా 322 మంది ప్రయాణీకులు ఉన్నారు. విమానం గాల్లో ఉండగానే..: ముంబై నుండి 320 మంది ప్రయాణీకులతో న్యూయార్క్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానంలో సోమవారం ఉదయం బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. గాల్లో ఉండగానే బాంబు బెదిరింపులు రావడంతో వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది అప్పటికప్పుడే తిరిగి వెనక్కి పయనమయ్యారు.బాంబు అమర్చినట్లు సమాచారం అందగానే విమానాన్ని వెనక్కి మళ్లించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. విమాన సిబ్బంది, ప్రయాణీకులు క్షేమంగా ముంబైలో ల్యాండ్ అయినట్లు సమాచారం. బాంబు బెదిరింపులపై భద్రతా సంస్థలు దర్యాప్తు చేపట్టాయి."ఈరోజు మార్చి 10 2025న ముంబై నుంచి న్యూయార్క్ వెళుతున్న %ూా×%119 విమానంలో దారి మధ్యలో భద్రతా ముప్పు ఉన్నట్లు గుర్తించాం.ప్రోటోకాల్ పూర్తయ్యాక విమానంలో ఉన్న వారందరి భద్రత దృష్ట్యా విమానం ముంబైకి తిరిగి వచ్చింది" అని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ మీడియా ప్రకారం, విమానంలోని టాయిలెట్‌లో కనుగొన్న నోట్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చిందని తెలుస్తోంది.బోయింగ్ 777-300 %ER% విమానంలో 19 మంది సిబ్బందితో సహా 322 మంది ఉన్నారని అధికారిక వర్గాలు తెలిపాయి.భద్రతా సంస్థలు చేపట్టిన తనిఖీలు, దర్యాపుకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.స్థానిక సమయం ప్రకారం ఉదయం 10:25 గంటలకు విమానం ముంబైలో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది. మార్చి 11న ఉదయం 5 గంటలకు ఈ విమానాన్ని తిరిగి నడపేలా షెడ్యూల్ చేశారు. అప్పటి వరకు ప్రయాణీకులందరికీ హెూటల్ వసతి,భోజనం, ఇతర సహాయం మేమే అందిస్తామని ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఈ అంతరాయం వల్ల ప్రయాణీకులకు కలిగిన అసౌకర్యాన్ని తగ్గించడానికి మా సహెూద్యోగులు కృషి చేస్తున్నారు.ఎప్పటిలాగే,ఎయిర్ ఇండియా ప్రయాణీకులు, సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది"అని ఎయిర్‌లైన్స్ ప్రతినిధి పేర్కొన్నారు.

## టీఎంసీ కార్యాలయంలో నాపై అత్యాచారం జరిగింది.. బీజేపీ మద్దతురాలు ఆరోపణ



**కోల్‌కతా- నవభూమి:** పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యాలయంలో తనపై అత్యాచారం జరిగిందని బీజేపీ మద్దతురాలైన మహిళ ఆరోపించింది. ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు, అతడి అనుచరుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే రాజకీయ ప్రేరేపిత ఆరోపణగా ఆయన ఖండించాడు. కౌంటర్‌గా ఆ మహిళపై ఫిర్యాదు చేశాడు. పశ్చిమ మిద్నాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ మద్దతురాలైన తనను, తన భర్తను నారాయణగంజ్ గ్రామాధిపతి అయిన టీఎంసీ నేత లక్ష్మీ షీట్ లక్ష్యంగా చేసుకున్నట్లు ఒక మహిళ విమర్శించింది.కాగా, ఆదివారం టీఎంసీ కార్యాలయానికి తన భార్యను పిలిపించారని, వృద్ధులైన లక్ష్మీ షీట్, అతడి అనుచరుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆ మహిళ భర్త ఆరోపించాడు. ఆ మహిళ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.మరోవైపు మహిళ ఆరోపణలను లక్ష్మీ షీట్ ఖండించాడు. రాజకీయ ప్రేరేపిత కుట్రగా ఆరోపించాడు. బీజేపీ తనను వేధిస్తున్నదని, అందుకే ఆ పార్టీ మద్దతురాలైన మహిళ ద్వారా కేసులో తనను ఇరికించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



## డిజిటల్ విప్లవంతో వికసిత భారతం

మహారాష్ట్రలోని బారామతిలో, ఒక చిన్న రైతు కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి వ్యవసాయం రూపురేఖల్ని మార్చివేస్తున్నాడు. ఈ అసాధారణ ప్రయత్నం ఇపుడు మన కళ్ల ఎదుట రూపుకడుతున్నది. ఎరువుల వాడకం తగ్గిపోయింది. నీటిని సమర్థంగా వినియోగిస్తున్నారు. అలాగే అధిక దిగుబడీ సుసాధ్యం అయింది. ఇదంతా ఏఐ వల్లనే!భారతదేశంలో ఏఐ సృష్టిస్తున్న విప్లవంలో ఇది ఒక భాగం మాత్రమే. అధునాతన సాంకేతికతలు, ఆవిష్కరణలు ఇక ఎంతమాత్రం ప్రయోగశాలలకే పరిమితం కావు. సాధారణ పౌరుల జీవితాలను అవి సమూలంగా మార్చివేస్తున్నాయి. రేపటి రోజున జరగబోయే పెనుమార్పులకు బారామతి రైతు కథ ఒక సూక్ష్మరూపం- అంటే.. 2047 వికసిత భారత్ దిశగా మనం వేస్తున్న తొలి అడుగులు.డిజిటల్ గమ్యం దిశగా మన ప్రయాణం వేగవంతమవుతోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీపై ప్రధానంగా దృష్టిసారించిన భారత్ తన డిజిటల్ భవిష్యత్తును స్వయంగా రూపొందించుకుంటున్నది. దశాబ్దాలుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న భారత్, ఇప్పుడు హార్డ్‌వేర్ తయారీలో కూడా పెద్ద అంగలు వేస్తూ ముందుకు సాగుతోంది.ప్రపంచ ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తూ ఐదు సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. నేడు భారతదేశం ప్రధాన ఎగుమతుల్లో తొలి మూడూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులే. అలాగే ఈ సంవత్సరం మరో అద్భుతం జరగబోతున్నది. మొట్టమొదటి 'మేక్ ఇన్ ఇండియా' చిప్‌ను మనం ఆవిష్కరించబోతున్నాం.ఏఐ రూపకల్పన: కంప్యూట్, డేటా, ఆవిష్కరణలు : సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ దన్నుగా, భారతదేశపు సాంకేతిక విప్లవాన్ని డీపీఐ ముందుకు తీసుకువెళుతోంది. భారత్ తనదైన ఏఐ సాంకేతికత వ్యవస్థ ద్వారా దానిని ప్రజాస్వామ్యీకరిస్తూ అందరికీ అందుబాటులోకి తెస్తోంది.ఈ విషయంలో 18,000లకు పైగా గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూలు) గల భారత కామన్ కంప్యూట్ సౌకర్యం కీలక మైలురాయిగా నిలుస్తుంది. గంటకు 100 రూపాయల కంటే తక్కువ ధరకు అందుబాటులో ఉండడం ద్వారా, పరిశోధకులు, అంకురసంస్థలు, విద్యావేత్తలు, ఇతర సంబంధిత వ్యక్తులకు అత్యాధునిక పరిశోధనలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రాథమిక నమూనాలు, అనువర్తనాలు సహా ఏఐ-ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి జీపీయూలను సులభంగా వినియోగించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.వైవిధ్యమైన, అధిక-నాణ్యమైన డేటాతో ఏఐ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి భారత్ పెద్ద ఎత్తున వ్యక్తిగతేతర అనామక డేటాసెట్‌లను రూపొందిస్తోంది. పక్షపాతాన్ని తగ్గిస్తూ, ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది, అలాగే ఇది ఏఐ వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమగ్రంగా అందరికీ చేరుస్తుంది. ఈ డేటాసెట్‌లు వ్యవసాయం, వాతావరణ అంచనాలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి వివిధ రంగాల్లో ఏఐ-ఆధారిత పరిష్కారాలను రూపొందించేందుకు వీలు కల్పిస్తాయి.భారత అవసరాలకు అనుగుణంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్‌లు), సమస్యకు సంబంధితమైన నిర్దిష్ట ఏఐ పరిష్కారాల వంటి సొంత ప్రాథమిక నమూనాల అభివృద్ధిని భారత ప్రభుత్వం అందిస్తుంది. ఏఐ పరిశోధనను ప్రోత్సహించడం కోసం అనేక ఎక్సలెన్స్ కేంద్రాలు కూడా ఏర్పాటయ్యాయి.డిజిటల్ ఆవిష్కరణల కోసం భారత డీపీఐ ఒక బ్లూప్రింట్ : డీపీఐ కోసం భారత్ తొలిసారిగా చేసిన కృషి ప్రపంచ డిజిటల్ రంగాన్ని గణనీయంగా మార్చివేసింది. కార్పొరేట్ లేదా ప్రభుత్వ నియంత్రిత నమూనాల మాదిరిగా కాకుండా, భారత్‌లోని అద్భుతంగా చేపట్టిన ప్రభుత్వ-ప్రైవేట్ విధానం ద్వారా ఆధార్, యూపీఐ, డిజీలాకర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించడానికి ప్రభుత్వ నిధులను ఉపయోగిస్తున్నారు. ప్రైవేట్ రంగంలోని నిపుణులు డీపీఐ ఆధారంగా- వినియోగదారుల హితమైన, అప్లికేషన్ ఆధారిత పరిష్కారాలను రూపొందిస్తూ అద్భుతంగా ఆవిష్కరణలు చేస్తున్నారు.యూపీఐ, డిజీలాకర్ వంటి ఆర్థిక, పాలనాపరమైన వేదికలను అద్భుతమైన పరిష్కారాలతో ఏకీకృతం చేస్తున్నారు. ఈ నమూనా ఇప్పుడు ఏఐ శక్తితో మరింత బలోపేతం అవుతున్నది. జీ20 సదస్సులో భారత డీపీఐ విధానం పట్ల ప్రపంచం అంతా ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ నమూనాను అనుసరించాలనే కోరికను వివిధ దేశాలు వ్యక్తం చేశాయి. భారత యూపీఐ చెల్లింపు వ్యవస్థకు జపాన్ పేటెంట్ మంజూరు చేసింది. దీనిని ఎంత వరకైనా విస్తరించడానికి అవకాశం ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం.సంప్రదాయం, సాంకేతికతల సంగమంగా మహాకుంభ్: ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సామాజిక వేడుకల్లో మొదటిది అయిన మహాకుంభ్ సజావుగా, విజయవంతంగా నిర్వహించడం కోసం భారత్ తన డీపీఐ, ఏఐ ఆధారిత నిర్వహణా విధానాన్ని ఉపయోగించుకుంది. ప్రయాగ్‌రాజ్‌లోని రైల్వే స్టేషన్లలో జనసమూహానికి ఇబ్బందులు లేకుండా చేయడానికి ఏఐ %-%ఆధారిత సాధనాలు రైల్వే ప్రయాణీకుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాయి.కుంభ్ సహాయక్ చాట్‌బాట్‌లో ఏకీకృతం చేసిన భాషిణి, అందరికీ వాయిస్%-%ఆధారంగా తప్పిపోయిన వారిని కనుగొనే అవకాశం లభించింది. రియల్%-%టైమ్ అనువాదం అలాగే బహుభాషా సహాయాన్ని అందించింది. భారతీయ రైల్వేలు, ఉత్తరప్రదేశ్ పోలీసులు సహా వివిధ విభాగాలు పరస్పర సహకారంతో సమస్యలకు త్వరిత పరిష్కారం కోసం కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించారు.డీపీఐని ఉపయోగించడం ద్వారా, మహాకుంభ్ సాంకేతికత ఆధారిత నిర్వహణలో ప్రపంచస్థాయి ప్రమాణాలను నిర్దేశించింది, దీనిని మరింత సమ్మిళితంగా, సమర్థంగా, సురక్షితంగా చేసింది.భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తిని రూపొందించడం : డిజిటల్ విప్లవానికి భారత శ్రామికశక్తి ప్రధాన కేంద్రంగా ఉంది. దేశంలో వారానికో కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటవుతూ, ప్రపంచ పరిశోధన, అభివృద్ధి, సాంకేతిక అభివృద్ధికి ప్రధాన గమ్యస్థానంగా భారత్ స్థితిని బలోపేతం చేస్తుంది. అయితే, ఈ వృద్ధిని కొనసాగించడానికి విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నిరంతర పెట్టుబడుల అవసరం ఎంతైనా ఉంది.జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ప్రకారం, ఏఐ, 5జీ, సెమీకండక్టర్ రూపకల్పన వంటి అంశాలను చేర్చుతూ విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వం ఈ సవాలును సమర్థంగా పరిష్కరిస్తోంది. పట్టభద్రులు ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో ఉద్యోగాలను ప్రారంభించేలా చేసి, విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని ఇది తగ్గిస్తోంది.

# తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టం మిలియన్ మార్చ్



ప్రతి ఉద్యమానికి తమ అంతిమ లక్ష్యం సాధించేవరకు ఎన్నో ఎత్తులు పై ఎత్తులు ఎన్నో పోరాటాలు ఎన్నో రకాల ఆందోళనలను మరెన్నో రకాల నిస్సహాయత దాడులు ప్రతి దాడులు నిర్బంధాలు వివక్షత ఆత్మస్థైర్యం కోల్పోవడం ఇవన్నీ కూడా ఉద్యమ లక్ష్యానికి అడ్డంకులుగా నిలిచాయి . ఒక లక్ష్యం పూర్తిస్థాయిలో సాధించాలంటే ఎంతో ఓపిక నిబద్ధత కార్యదీక్ష, నాయకత్వ లక్షణం ఉన్నప్పుడే విజయం సాధించి అంతిమ లక్ష్యాన్ని చేరుకుంటాం . అప్పటివరకు టైం బాండ్ లేకుండా ప్రతిరోజు ఉద్యమమే రకరకాల ఆలోచనలు అన్ని వర్గాల ప్రజలను లక్ష్యం కోసం ఏకం చేసి ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో రకాల ఉద్యమ కొత్త పందాలను తీసుకోవాల్సి వస్తుంది ..అందులో భాగంగానే తెలంగాణ కు సాయుధ పోరాటం నుండి అంచలంచెలుగా పోరాట చరిత్ర ఉంది . ఒకసారి రైకాంగ సాయుధ పోరాటమైతే, మరోసారి నిజాం సర్కార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం, మరోసారి తెలంగాణ ఏర్పాటుకు 1949లో ఆపరేషన్ పోలో, తెలంగాణ లిబరేషన్ డే , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు ఐదు సంవత్సరాలు కాకముందే పెద్దల ఒప్పందానికి తూర్పు పడడంతో 1969 , 1972 ఉద్యమం, 1970 నుండి తెలంగాణ ఏర్పాటు భూ పోరాటం , నక్సలైట్ల ఉద్యమం, నిర్బంధం ఎన్కౌంటర్లతో తల్లడిల్లిన తెలంగాణ , శాంతి చర్చలు ఆ తర్వాత మళ్లీ దశ తెలంగాణ ప్రత్యేక ఉద్యమం ఇలా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎన్నో రకాల పోరాటాలు ఉద్యమాలు నిర్బంధాలు ఎదుర్కొంటూ వస్తూనే ఉన్నారు. నేటికీ తెలంగాణ అస్తిత్వం పూర్తిస్థాయిలో నిలవలేదు . 1996 లో భువనగిరి జనతో సభతో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమం పురుడు పోసుకుంది. 2001లో మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు నాటి డిప్యూటీ స్పీకర్ గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన పదవులకు రాజీనామా చేసి ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షతో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేయటం మలిదశ ఉద్యమానికి కీలక మలుపుగా చెప్పుకోవచ్చు. నాటి నుండి ప్రారంభమైన ప్రత్యక్ష పరోక్ష ఉద్యమాలకు కల్వకుంట్ల చంద్రశేఖర రావు కేంద్ర బిందువుగా మారారు . అన్ని రాజకీయ పార్టీల ఏకంతో ఆచార్య కోదండరాం నాయకత్వంలో జేఏసీ ఏర్పాటు కావడం విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల , రాజకీయ నాయకుల కలయికతో ఉద్యమాలు ప్రారంభమైనాయి

### 14 సంవత్సరాలు పూర్తి



. ప్రతిరోజు ఒక ముఖ్య గట్టమే ప్రతి నెల ముఖ్య సమావేశమే ఎన్నో ఆంక్షలు ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొంటూ తెలంగాణ ప్రజలు ఎదురొడ్డి నిలబడ్డారు . ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షతో ఏర్పాటు అయిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు 29 నవంబర్ 2009 న కరీంనగర్ లో దీక్ష చేయడానికి బయలుదేరినప్పుడు పోలీసులు అరెస్టు చేయడం ఆయనను ఖమ్మం జైలుకు తరలించడం అక్కడినుండి ఆసుపత్రికి తరలించడం , ప్రజల డిమాండ్ తో ఆయనను నిమ్స్ ఆస్పత్రికి తరలించడం ప్రతిరోజు గండంగా ఉద్యమకేరటంగా మారిన



రోజులవి . చివరకు 9 డిసెంబర్ 2009 న తెలంగాణ ఏర్పాటుకు

ప్రక్రియ ప్రారంభమైందని నాటి హోం శాఖ మంత్రి చిదంబరం ప్రకటించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రెండు వారాలు గడవకముందే తిరిగి వాయిదా వేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది . దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. ఉద్యమ చరిత్రలో ప్రధాన ఘట్టాల్లో మిలియన్ మార్చ్, సాగర హారం , సహాయ నిరాకరణ, అన్ని స్థాయిల్లో ధర్నాలు నిరసనలు చాలా కీలకమైనవి

**మిలియన్ 10 మార్చ్ 2011**

ఎన్నో ఉద్యమంలో భాగంగా 10 మార్చ్ 2011 ఉద్యమ ప్రస్థానంలో చాలా కీలకమైన రోజు జేఏసీ ఆధ్వర్యంలో ప్రతిరోజు కొత్త కొత్త కార్యాచరణతో ముందుకు సాగుతున్న తరుణంలో మార్చ్ 10 న మిలియన్ మార్చ్ హైదరాబాద్ హుస్సేన్ సాగర్ పైన నిర్ణయించాలని జేఏసీ నిర్ణయించింది. అయితే అదే సమయంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఉండడంతో వాయిదా వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోర్టుకెళ్లారు . ఉద్యమ క్రమంలో

వెనుకడుగు వేయొద్దని జేఏసీ నిర్ణయించి సాధారణంగా నిర్వహించాలని నిర్ణయించింది. అయితే ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించి ఎన్నో రకాల నిర్బంధాలను పోలీసులలో మిలిటరీను దించింది. అడుగడుగునా మార్కెట్లో ఏర్పాటుచేసి ట్యాంక్ బండి పై పూర్తి పోలీసుల తో నింపివేసింది. అయినా సరే ఉద్యమ కార్య చరణ లో భాగంగా తెలంగాణ పది జిల్లాల నుండి లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి హుస్సేన్ సాగర్ చుట్టు తల దాచుకొని మధ్యాహ్నం రెండు మూడు గంటల సమయంలో ట్యాంకు బండి పైకి ఒక్కొక్కరుగా చేరుకున్నారు పోలీసులు లాఠీ చార్జీలు చేసిన భాషా వాయువు ప్రయోగించిన రబ్బర్ బుల్లెట్లతో కొట్టిన తగ్గలేదు గంటలోపే హుస్సేన్ సాగర్ ను జనసముద్రముగా ముంచి వేసినట్లుగా ఒక్కసారిగా ప్రజలు చేరుకొని ట్యాంకుబండు పైన ఉన్న విగ్రహాలను తొలగిస్తూ తమ ఆక్రోసాన్ని వెల్లడించారు

. అప్పటికే జిల్లాల్లో లక్షల మందిని ఎక్కడికక్కడ నిలిపివేశారు ముఖ్య నాయకులందరినీ తమ తమ ఇండ్ల వద్దే అరెస్టు చేశారు. ట్యాంక్ బండి పైన పూర్తిస్థాయిలో జనసముద్రం కావడంతో మిలియన్ మార్చ్ సికింద్రాబాద్ నుండి హైదరాబాద్ మధ్యలో ట్యాంక్ బండ్ పై ఘనంగా మిలియన్ మార్చ్ నిర్వహించారు . అంతకుముందే జేఏసీ చైర్మన్గా ఉన్న ఆచార్య కోదండరామ్ ని బొల్లారం పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ట్యాంకు బండిపై గొడవ జరగడంతో కోదండరాం చేత ఉద్యమకారులను శాంతింప పరచాలని ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్ తో ట్యాంక్ బండుకు తరలించారు . అదే క్రమంలో తెలంగాణ ఉద్యమ నిర్మాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు , కే కేశవరావు , మధు యాష్ కి గౌడ్ జేఏసీ నాయకులందరూ ట్యాంక్ బండ్ కు పోలీసుల స్వయంగా వారిని తీసుకువచ్చారు . వీరిని తీసుకొస్తే ప్రజలు శాంతిస్తారని ముందు భావించారు. కానీ ఆవేశంతో ఉన్న యువతరం విద్యార్థి నాయకులు మహిళలు ఒక్కసారిగా కెసిఆర్ నాయకుల పైకి తిరుగుబాటు చేశారు . ఉద్యమం సరిగా నిర్మించుట **లేదని ఇంకా దీని ఉధృతం**

చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 10 మార్చ్ 2011 మిలియన్ మార్చ్ మర్చిపోలేని ముఖ్య ఘట్టాల్లో ఒకటి గా నిలిచింది. మిలియన్ మార్చ్ జరిగి నేటికీ 14 సంవత్సరాలు పూర్తవుతుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయిన 2014 నుండి తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో జరిగిన ముఖ్య ఘట్టాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఉద్యమకారులకు సరైన గుర్తింపునివ్వకపోవడంతో టిఆర్ఎస్ పార్టీ అనేక విమర్శలు ఎదుర్కొంది . గద్దర్ నాయకత్వంలో 1996లో భువనగిరిలో పురుడు పోసుకున్న మలిదశ ఉద్యమం లో పాల్గొన్న నాయకులకు ఎవరికి కూడా గద్దర్ తో స్వాహా గుర్తింపు రాలేదు. టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉద్యమ ప్రస్థానంలో పనిచేసిన ముఖ్య నాయకులు కవులు కళాకారులు జర్నలిస్టులు, రచయితలు, ఉద్యోగ సంఘాల నాయకులకు, ప్రత్యేక తెలంగాణ కోసం అమరులైన వారి కుటుంబాలకు సరైన గుర్తింపు ఇవ్వవలసిన బాధ్యత నేటికీ ఉంది ...

-అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196

# హిందీ వివాదం



కేంద్రంపై హిందీవాదుల పెత్తనం స్వాతంత్ర్యం వచ్చిన రోజుల నుంచీ ఉన్నది. ఆ పెత్తనంపై పోరాటం సాగించిన చరిత్ర తమిళనాడుకు అంతకుముందు నుంచీ ఉన్నది. ద్రవిడ ఉద్యమ నేపథ్యం దీనికి దోహదం చేసింది. అనేక సందర్భాల్లో హిందీ వ్యతిరేక ఆందోళనలు తమిళనాడు అంతటా భీకరంగా జరిగాయి. 1937లోనే మద్రాస్ ప్రెసిడెన్సీలో రాజాజీ సర్కారు హిందీని స్కూళ్లలో తప్పనిసరిగా బోధించాలనే నియమం తెచ్చినప్పుడు తీవ్రస్థాయిలో ఆందోళనలు మొదలయ్యాయి.

ఆ సందర్భంగా ఇద్దరు విద్యార్థుల బలిదానం గురించి ఇప్పటికీ తమిళనాడులో చెప్పుకొంటారు. ప్రజావ్యతిరేకత నేపథ్యంలో రాజాజీ రాజీనామా చేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం హిందీ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది. ఆ తర్వాతికాలం లో హిందీ వ్యతిరేకత అనేది తమిళనాడు సంస్కృతిలో భాగమైంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎం.కరుణానిధి హిందీ వ్యతిరేక ఆందోళనల్లో అరెస్టయి కేసులు ఎదుర్కొన్న సందర్భాలూ ఉన్నాయి.

రైల్వేస్టేషన్లు, తదితర స్థలాల్లో హిందీ రాతలను ఆందోళన కారులు చెరిపేయడం ఈ ఉద్యమాలకు ప్రతీకాత్మకంగా నిలుస్తుంది. తాజాగా మరోసారి తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ఈసారి కేంద్ర-రాష్ట్ర తగాదాకు నూతన విద్యావిధానం (2020) కేంద్ర బిందువుగా మారింది. కేంద్రానికి, తమిళనాడుకు మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరుతున్నది. ప్రభుత్వ పాఠశాల్లో మూడు భాషలు బోధించాలన్న నియమాన్ని అమలుచేయకపోతే సమగ్ర శిక్షా అభియాన్ కింద తాము ఇచ్చే నిధులను వదులుకోవాల్సి వస్తుందని కేంద్రం తేల్చిచెప్పడం ఇందుకు కారణం. అయితే తమిళనాడు మాత్రం హిందీకి ససేమిరా అంటూ తన ద్విభా షా సూత్రాన్ని యథావిధిగా అమలు చేస్తున్నది.

ఈ వివాదంపై రాజ్యాంగం వైఖరి కొంత స్పష్టతకు తావిస్తున్నది. హిందీ అధికార భాష అని అందులో ఉంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 15 ఏండ్ల వరకు ఇంగ్లిష్ అధికార భాషగా కొనసాగుతుందని వెసులుబాటు కల్పించారు. అయితే ఆ గడువు ముగిసేలోపే 1963లో తెచ్చిన అధికార భాషల చట్టంలో హిందీతో పాటుగా అదనంగా ఇంగ్లిష్ అధికార వ్యవహారాలకు, అదీ నిరవధికంగా, వినియోగించబడుతుందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని భాషలో దేనినైనా లేదా హిందీని అధికార వ్యవహారాలకు వినియోగించవచ్చని స్వేచ్ఛను కల్పించింది. అదే సమయంలో భారతదేశ మిశ్రమ సంస్కృతిలో ఏక సూత్రత తెచ్చేందుకు హిందీని ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా ఉంటుందని కూడా రా జ్యాంగం స్పష్టం చేసింది.

ఈ బాధ్యతలో భాగంగా కేంద్రం 1968లో మొదటిసారిగా త్రిభాషా సూత్రంతో నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. ఆ ఏడాదే పార్లమెంట్ ఉభయసభలు అధికార భాషా తీర్మానాన్ని ఆమోదించాయి. ఆ రెండింటి ప్రకారం హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల్లో హిందీ తప్పనిసరిగా బోధించాలనే నియమం తెచ్చారు. దీనిపై తమిళనాడులో నిరసనలు భగ్గుమన్నాయి. ద్రవిడ పార్టీల సుస్థిర పాలనలో ఆ రాష్ట్రంలో ద్విభాషా సూత్రమే అమలవుతున్నది. 1980ల మధ్యలో కూడా భీకర స్థాయిలో హిందీ వ్యతిరేక ఆందోళనలు రాజుకున్నాయి. ఈ నేపథ్యంలో 2020లో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే అందులో హిందీ తప్పనిసరి అనకుండా మూడు భాషల్లో రెండు స్వదేశీ భాషలైతే చాలునని సడలింపు ఇచ్చింది.

ఇంగ్లిష్ స్వదేశీ భాష కానప్పటికీ అది అంతర్జాతీయంగా వివిధ సేవారంగాల్లో పోటీ పడేందుకు తోడ్పడుతుందనేది తెలిసిందే. అందుకే తమిళనాడు తమిళం, ఇంగ్లిష్ బోధనను తప్పనిసరిగా అమలు చేస్తూ తమ సిద్ధాంతాలకు అనుగుణంగా హిందీని ప్రతిఘటిస్తూ వస్తున్నది. 2020 ఎన్ఈపీలో హిందీ గురించి నొక్కి చెప్పనప్పటికీ లోపాయికారిగా సంస్కృతాన్ని ప్రోత్సహించడం తమిళనాడుకు నచ్చని అంశంగా ముందుకు వచ్చింది. అంతేకాకుండా కేంద్రం ఎస్ఎస్ఏ కింద ఇవ్వాల్సిన రూ.2 వేల కోట్ల నిధులను ఆపివేయడంతో మరోసారి తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు మొ దలయ్యాయి.

దొడ్డిదారిన హిందీని, సంస్కృతాన్ని రుద్దేందుకే కేంద్రం త్రిభాషా సూత్రంపై ఒత్తిడి తెస్తున్నదనేది తమిళనాడు వాదన. త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు ప్రతిఘటించడం రాజ్యాంగ విరుద్ధమని కేంద్రం అంటున్నది. అయితే రాజ్యాంగంలో ఆ సంగతి ఎక్కడుందో చెప్పాలని తమిళనాడు కేంద్రాన్ని నిలదీస్తున్నది. ఉత్తరాదిన దక్షిణాది భాష ఏదైనా బోధిస్తున్నారా? అని తమిళ సీఎం స్టాలిన్ తాజాగా సవాల్ విసిరారు. హిందీ వివాదం అంతిమంగా సమాఖ్యవాదానికి సవాలుగా పరిణమిస్తున్నదన్న సంగతి గుర్తుంచుకోవాలి.

## స్థితప్రజ్ఞుడు ఎవరు?

భక్తి



"స్థితప్రజ్ఞత అంటే ఏమిటి? స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు?" అనే అర్జునుడి ప్రశ్నకు, దానికి శ్రీకృష్ణుడు ఇచ్చిన వివరణకు భగవద్గీతలో ఎంతో ప్రాధాన్యత ఉంది. స్థితప్రజ్ఞుడు తన పట్ల తాను సంతృప్తితో ఉంటాడని చెప్పిన కృష్ణుడు... స్థితప్రజ్ఞత కలిగినవారు ఎలా మాట్లాడతారు, కూర్చుంటారు, నడుస్తారు? అనే సందేహంపై స్పందించలేదు.పరిస్థితులను బట్టి అజ్ఞాని, స్థితప్రజ్ఞుడు... ఈ ఇద్దరూ ఒకే మాటలు మాట్లాడవచ్చు, ఒకే రీతిలో కూర్చోవచ్చు, నడవవచ్చు. 'స్వయంతో (తనతో) సంతృప్తి' అనేది పూర్తిగా అంతర్గతంగా జరిగే విషయం. బాహ్య ప్రవర్తన కారణంగా దాన్ని కొలవడానికి అవకాశం లేదు. ఇది స్థితప్రజ్ఞత గురించి మనకున్న అవగాహనను మరింత క్లిష్టతరం చేస్తుంది. మరి ఇది ఎలా తెలుసుకోవాలి?

శ్రీకృష్ణుని జీవితం స్థితప్రజ్ఞత కలిగిన జీవితానికి ఉత్తమమైన ఉదాహరణ. ఆయన పుట్టినప్పుడే తల్లితండ్రుల నుంచి విడిపోయాడు. ఆయనను 'వెన్న దొంగ' అని పిలిచేవారు. ఆయన శృంగారం, నృత్యం, వేణుగానం... ఇవన్నీ ఆయన కథలో ఉన్నాయి. కానీ బృందావనాన్ని విడిచిపెట్టాక శృంగారాన్ని కోరుతూ తిరిగి రాలేదు. అవసరమైనప్పుడు పోరాడాడు. శత్రువులను చంపాడు. కానీ కొన్ని సమయాల్లో యుద్ధానికి దూరంగా ఉన్నాడు. అందుకే ఆయనను 'యుద్ధం నుంచి పారిపోయే వ్యక్తి' అని కూడా అన్నారు. ఆయన ఎన్నో అద్భుతాలు చేశాడు. స్నేహితులకు స్నేహితుడు. తనకు దొంగతనం అంటగట్టినప్పుడు, ఆ తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టడానికి... శమంతకమణి జాడను కనిపెట్టాడు. గీతాజ్ఞానాన్ని ఏ సమయంలో ఇవ్వాలో ఆ సమయంలో అర్జునుడిద్వారా అందించాడు.

గుర్తించాల్సిన విషయం ఏమిటంటే... బయటికి కనిపించే ఆయన జీవితం ఒక క్రమపద్ధతిలో ఉన్నట్టు అనిపించదు. కానీ ఆంతరంగికంగా ఆయన ఎప్పుడూ వర్తమానంలోనే జీవించాడు. అనేక ప్రతికూల పరిస్థితులు, సమస్యలు ఎదురైనప్పటికీ... ఆయన జీవితం నిరంతరం ఉత్సాహంగా, ఆనందమయంగా సాగింది. 'స్వయంతో సంతృప్తి' అంటే క్రియాశూన్యత కాదు. కర్తృత్వ భావన అంటే 'చేసేవాడిని నేనే' అనే భావన లేకుండా, కర్మ ఫలాలను ఆశించకుండా కర్మలు నిర్వహించడం. అంటే... గతం తాలూకు భారాన్ని మోయకుండా, భవిష్యత్తు గురించి ఆశ పెంచుకోకుండా వర్తమానంలో జీవించడం. శ్రీకృష్ణుడు తన జీవితం ద్వారా స్థితప్రజ్ఞుడి ప్రవర్తన ఎలా ఉంటుందో చూపించాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
మంగళవారం
11 మార్చి

# నవతార

## ఇలా చేస్తే పగుళ్లు రావు!



దంతాలు ఎంత బలంగా ఉన్నప్పటికీ కొన్ని పొరబాట్ల వల్ల వాటిపై పగుళ్లు ఏర్పడుతూ ఉంటాయి. క్రమం తప్పకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ దంతాలను సంరక్షించుకుకోవచ్చు.నోటిని పరిశుభ్రంగా ఉంచుకుంటే దంతాల దృఢత్వం చెదరదు. రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

నిద్రలో కొంతమంది... ముఖ్యంగా పిల్లలు... పళ్లు కొరుకుతూ ఉంటారు. ఇలా చాలాకాలం కొనసాగితే దంతాలపై పగుళ్లు ఏర్పడతాయి. వైద్యుని సంప్రతించి పళ్లు కొరికే సమస్యను పరిష్కరించుకోవడం మంచిది. శరీరంలో కాల్షియం, డి విటమిన్ లోపించినప్పుడు దంతాలు బలహీనమై విరిగిపోతుంటాయి. నిత్యం పాలు, పాల పదార్థాలు, చేపలు, గుడ్లు, ఆకుకూరలు లాంటి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ఉదయాన్నే లేత సూర్యకిరణాలు శరీరానికి తాకేలా చూసుకోవాలి.

పుల్లని పదార్థాలు, దంతాలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి. దంతాలను సంరక్షించే ఎనామిల్ పొరను దెబ్బతీస్తాయి. దీంతో దంతాలు విరిగిపోవచ్చు. ఊరగాయలు, పండ్ల రసాలు, పుల్లని పండ్లు, టమాటా కెచప్ లాంటివి తీసుకున్న తరవాత మంచి నీటితో నోటిని పుక్కిలించాలి. శీతల పానీయాలు, కాఫీ, టీలు తాగడాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించాలి.


## ఇంటికి శోభనిచ్చే మనీ ప్లాంట్!

చాలామంది ఇళ్లలో మనీ ప్లాంట్ పెంచుకుంటూ ఉంటారు. ఈ తీగ అందంగా అల్లుకోవాలంటే ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

మనీ ప్లాంట్‌ని ఏ సైజు కుండీలోనైనా పెంచవచ్చు. పెద్ద కుండీ అయితే ఆకులు వెడల్పుగా వస్తాయి.

గాజు సీసాలో నిండుగా నీరు పోసి అందులో ఈ మొక్కను ఉంచినా కూడా బాగా పెరుగుతుంది. పదిహేను రోజులకు ఒకసారి నీళ్లు మారిస్తే చాలు.

ఈ మొక్కకు ఎక్కువగా ఎండ తగలకూడదు. కొద్దిగా వెలుతురు ఉంటే చాలు తీగలా చక్కగా పెరుగుతుంది.





కుండీలో తరచూ నీళ్లు పోయకూడదు. మట్టి తేమగా ఉంటే చాలు. ఆకులపై కొన్ని నీళ్లు పిచికారీ చేస్తూ ఉంటే అవి పచ్చగా మెరుస్తూ కనిపిస్తాయి.

కుండీలో మట్టికి మూడు నెలలకు ఓసారి ఆవుపేడతో తయారుచేసిన సేంద్రీయ ఎరువు కలపాలి.

మొక్క మొదళ్లలో నాచుకర్రలు పాతితే వేళ్లకు నిరంతరం తేమ అందుతూ ఉంటుంది. మొక్క పొడవుగా పెరుగుతుంది.

ఎండిన, పండిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేస్తూ తీగను అందంగా అమరుస్తూ ఉంటే మొక్క పెరుగుతూనే ఉంటుంది. కుండీ మధ్యలో పొడవాటి కర్రను ఉంచి దాని చుట్టూ తీగను చుడుతూ ఉంటే మొక్క గుబురుగా పెరుగుతుంది. చూడడానికి అందంగా కనిపిస్తుంది.

## దిండు లేకుండా పడుకోవడమే మేలు..!



రాత్రిపూట తల కింద దిండు పెట్టుకోకుండా పడుకోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తీరుతాయని చెబుతున్నారు.

దిండు మీద తల పెట్టి నిద్రించడం వల్ల మెడపై ఒత్తిడి పెరుగుతుంది. మెడనొప్పి, మెడ పట్టేయడం లాంటివి ఎదురవుతూ ఉంటాయి. అదే దిండు లేకుండా పడుకుంటే మెడ సరైన స్థితిలో ఉండి విశ్రాంతి పొందుతుంది.

దిండు వేసుకోకుండా పడుకుంటే వెన్నెముక సరైన ఆకృతిలో ఉంటుంది. వీపు నొప్పి, నడుము నొప్పి తగ్గుతాయి.


దిండు లేకుండా పడుకోవడం వల్ల తల నుంచి పాదాల వరకూ రక్తప్రసరణ ఒక క్రమ పద్ధతిలో వేగంగా జరుగుతుంది. దీనివల్ల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె పని తీరు మెరుగుపడుతుంది.

దిండు వేసుకుని పడుకుంటే మఖభాగాలన్నీ రాపిడీకి గురై నుదుటి మీద చెంపలపై ముడుతలు వస్తాయి. మొటిమలు, గుల్లల సమస్య కూడా పెరుగుతుంది.

దిండు వల్ల కురుల సమస్యలు ఏర్పడతాయి. తలలో చుండ్రు పెరుగుతుంది. సమతలంగా లేని దిండు వేసుకోవడం వల్ల శిరోజాలకు రాపిడీ పెరిగి అవి చిక్కు పడడమే కాకుండా రాలిపోతాయి.

దిండు లేకుండా పడుకుంటే మానసిక ఒత్తిడి, అలసట తగ్గుతాయి. ప్రశాంతమైన నిద్ర లభిస్తుంది. ఉదయం లేవగానే ఉత్సాహంగా ఉంటుంది.

## రోజూ తలస్నానం మంచిదేనా?



వాతావరణ కాలుష్యం వల్ల కురులలో మురికి చేరుతూ ఉంటుంది. దీనిని తొలగించి శిరోజాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే తలస్నానం తప్పనిసరి. తలస్నానానికి సంబంధించి నిపుణుల సూచనలు ఇవి....


మాడు మీద ఉత్పత్తి అయ్యే జిడ్డుకు దుమ్ము, ధూళి తోడై తలలో కురుపులు ఏర్పడవచ్చు. కాబట్టి తలలో జిడ్డు చర్మం ఉన్నవారు వారానికి నాలుగుసార్లు తలస్నానం చేయాలి. వీరు ప్రతిరోజూ చేసినా కూడా మంచిదే.

తలలో పొడి చర్మం ఉన్నవారు తరచూ తలస్నానం చేయకూడదు. దీనివల్ల మాడుమీద సహజనూనెల ఉత్పత్తి తగ్గిపోయి శిరోజాలు పొడిబారి నిర్జీవంగా కనిపిస్తాయి. వీరు వారానికి రెండుసార్లు తలస్నానం చేస్తే చాలు.

పది రోజులకు ఒకసారైనా తలస్నానం చేయని పక్షంలో కుదుళ్ల దగ్గర బ్యాక్టీరియా వృద్ధి పొందుతుంది. దీనివల్ల చుండ్రు సమస్యలు వస్తాయి శిరోజాలకు రక్తప్రసరణ జరగక అవి రాలిపోతాయి.

స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టాక తప్పనిసరిగా తలస్నానం చేయాలి. పూల్‌లో నింపిన నీటిలో క్లోరిన్ కలుపుతారు. ఇది శిరోజాలకు హాని కలిగిస్తుంది. దుమ్ము, ధూళి, కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివశించేవారుబీ ఎక్కువ దూరాలు ప్రయాణం చేసేవారు ప్రతిరోజూ తలస్నానం చేయడం మంచిది. లేదంటే తలలో ఫంగస్ పెరిగే అవకాశం ఉంది. వేసవికాలంలో తలలో ఎక్కువగా చెమట పడుతూ ఉంటుంది. దీనివల్ల మాడు మీద చెమటకాయలతోపాటు శిరోజాల సమస్యలు వస్తూ ఉంటాయి. అందుకే వేసవిలో వారానికి నాలుగుసార్లు తలస్నానం చేయడం మంచిది.

## ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ డయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ %-% టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయిలను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

## రంగుల వేడుక.. ఆనందాల కానుక



రంగుల వేడుక.. ఆనందాల కానుక

శిశిరంలోనే వసంత సంతసం తీసుకొచ్చే పర్వం హోలి. లేత చివుళ్లు వేసి పులకించిపోతున్న తరులతో ప్రకృతి కాంత పరవ శించిపోతుంది. వసంత పంచమి నుంచి ఆమని ఆగమనానికి ప్రకృతి సిద్ధమవుతుంది. ఈ సంబురాన్ని హోలి కేళి రెట్టింపు చేస్తుంది. ఫాల్గుణోత్సవం, కల్యాణ పూర్ణిమ, వసంత పున్నమి, హుతాశని పౌర్ణమి, కాముని పున్నమి, మదనోత్సవం, డోలా పూర్ణిమ, అనంగ పూర్ణిమ ఇలా ఎన్నో పేర్లతో ఫాల్గుణ పూర్ణిమ నాడు హోలి పర్వదినాన్ని నిర్వహిస్తారు.

హోలి పండుగతో ముడివడిన గాథలు భవిష్య, లింగ పురాణాల్లో కనిపిస్తాయి. ధర్మరాజుకు నారద మహర్షి హోలి పండుగ నియమాలను, విశిష్టతను వివరించాడని భవిష్య పురాణం చెబుతున్నది. శివపార్వతుల్ని ఏకం చేసే ప్రయత్నంలో మన్మథుడు శివుడి ఆగ్రహానికి గురై భస్మమయ్యాడు. అతని భార్య రతీదేవి ప్రార్థన మేరకు ఆమెకు మాత్రమే సశరీరంతో, మిగిలినవారికి అనంగుడిగా అంటే అదృశ్య రూపంలో మన్మథుడు గోచరమవుతాడని శివుడు వరమిచ్చాడు. ఆ సందర్భమే అనంగ పూర్ణిమ. గాథాసప్తశతి, కామసూత్రాలు, నాగావళి వంటి గ్రంథాల్లో హోలి వైభవ ప్రస్తావన ఉంది. శిశు హంతకి అయిన రాక్షసి హోలిక వినాశనానికి సూచికగా హోలి పర్వదినం ఏర్పడిందని చెబుతారు. అగ్ని కూడా దహించలేని శక్తిమంతురాలైన హోలిక హిరణ్యకశిపుడి సోదరి. ప్రహ్లాదుణ్ని ఒడిలో కూర్చోబెట్టుకుని అగ్ని ప్రవేశం చేయమని ఆమెను హిరణ్యకశిపుడు ఆదేశిస్తాడు. హరి భక్తుడైన ప్రహ్లాదుడి స్పర్శ వల్ల హోలిక శక్తి సన్నగిల్లి ఆమె అగ్నికి ఆహుతి అవుతుంది. ఆ అగ్నికీలల నుంచి ప్రహ్లాదుడు ఏ గాయమూ లేకుండా బయటికి వస్తాడు. అలాగే 'దుంధ' అనే రాక్షసి అంతానికి సంతోషంగా ప్రజలు హోలి జరుపుకొనే సంప్రదాయం ఏర్పడిందని భవిష్య పురాణ కథ.

భారతీయ సంస్కృతి ఒక రంగుల హరివిల్లు. కాలానికి అనుగుణంగా మనలో ఆనందాలు నింపే పండుగలతో శోభిస్తుంది. వసంత రుతువు ప్రారంభానికి ముందు వచ్చే హోలి అయితే చెప్పనే అక్కరలేదు. వయోభేదాలు మరిచి అందరూ వసంతాలాడి మైమరచే రంగుల పండుగ చేసుకుంటారు. ఆనందహేల అయిన హోలి వెనుక సంప్రదాయ విశేషాలెన్నో ఉన్నాయి.

బృందావనంలో రాసక్రీడా వసంతోత్సవం ఓ అద్భుత రసమయ వేడుక. గోపికలపై శ్రీకృష్ణుడు వివిధ రంగుల పుష్పాలను ఆనందాతిరేకాలతో విరజిమ్మితే, గోపికలు గోపాలునిపై వసంతాన్ని చిలకరించారట. ఈ మధురోత్సవం సంరంభంగా, కవ్వింతల సంబరంగా పరిఢవిల్లిందని భాగవతం హృద్యంగా అభివర్ణించింది. అంతేకాదు, హోలి వేడుకను ఉత్తర భారతదేశంలో డోలాజాత్రాగా కూడా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రాధాకృష్ణుల మూర్తులను ఊయలలో ఉంచి లాలిపాటలను ఆలపిస్తారు. ఆ సందర్భంగా రంగుల్ని కూడా చిలకరించుకుంటారు.

మధుర మీనాక్షి దేవి తపోదీక్షను చేపట్టి సుందరేశ్వర స్వామిని మెప్పించి ఈ ఫాల్గుణ పౌర్ణమినాడే వివాహం చేసుకుందని పురాణ కథనం. దక్షిణ భారతదేశంలో శక్తి ఆలయాల్లో ఫాల్గుణ పౌర్ణమినాడు కల్యాణీ వ్రతాన్ని నిర్వహించే ఆచారం కూడా కనిపిస్తుంది.

ప్రకృతిలో వ్యక్తమయ్యే వర్ణ వైవిధ్యానికి ప్రతీకగా జన సమూహం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఫాల్గుణ పూర్ణిమ నాడు రంగుల్ని చిలకరించుకుంటారు. ఆసేతు హిమాచలం ఈ పండుగను వేర్వేరు ఆచారాలతో, విభిన్న నేపథ్యాలతో, వివిధ పేర్లతో నిర్వహించుకుంటారు. ఫాల్గుణ పౌర్ణమికి కాస్త అటూ ఇటూగా ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి సంబంధమైన పండుగల్ని నిర్వహించుకునే సంప్రదాయం ఉంది. ప్రాంతమేదైనా, ఏ తరహాలో పండుగ చేసుకున్నా.. అది మత సామరస్యానికి, సమైక్యతకు చిహ్నంగా నిలుస్తున్నది.

**పర్యావరణ హితం**

వేదకాలంలో హోలిని 'నవాహ్నేష్టి యజ్ఞం'గా జరుపుకొనేవారు. పొలంలో సగం పక్వమైన, సగం పచ్చిగా ఉన్న ధాన్యాన్ని తెచ్చి హోమాగ్నిపై ఆవుపాలతో పాయసం తయారుచేసేవారు. పురాణకాలం నుంచి హోలినాడు వసంతాలాడే ఆచారం వచ్చింది. ప్రకృతి సహజమైన రంగులతోనే హోలి జరుపుకోవాలి. హానికరమైన కృత్రిమ రంగులు చల్లుకోవడం సంప్రదాయ విరుద్ధం. ఫల, పుష్ప రసాలను సమ్మిళితం చేసి రంగులుగా చిలకరించుకోవచ్చు. పసుపు కలిపిన చందనం, అష్టగంధం, వృక్షమూలాల రసం, మోదుగ పుష్పాల గుజ్జు, మందార పువ్వులు, గులాబీ పువ్వుల నుంచి తీసిన రసం కలిపిన జలాన్ని హోలి రంగులుగా వినియోగించడం మన సంప్రదాయం. పర్యావరణ హితంగా హోలి నిర్వహించడం వల్ల శరీరానికీ, మనసుకు ఆహ్లాదం చేకూరుతుంది. మొత్తంగా ఈ పండుగ అంతరార్థం అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటమే.

## ఆలస్యం.. విషం! 'ఆలస్యం అమృతం విషం!'..



'ఆలస్యం అమృతం విషం!'.. అనే సూత్రం భోజనం విషయంలోనూ వర్తిస్తుందని చెబుతున్నారు ఆహార నిపుణులు. ఉరుకుల పరుగుల జీవితాలు, రాత్రి విధులు, పార్టీలు.. ఇలా పలు కారణాల వల్ల చాలామంది రాత్రి భోజనాన్ని ఆలస్యంగా ముగిస్తున్నారు. ఇలాంటి అలవాటు ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి భోజనం లేటైతే.. పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు. ఆలస్యంగా తినే ఆహారం.. త్వరగా జీర్ణమవ్వదు. దీంతో గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలు ఎదురవుతాయి. ఇక ఇలా భోజనం చేసి, అలా పడుకొంటే.. నిద్రకు ఆటంకం కలుగుతుంది. జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. అర్ధరాత్రి భోజనం చేయడం కొందరికి అలవాటు.

దీర్ఘకాలంలో ఈ అలవాటు గుండెకు హాని కలిగిస్తుంది. ఇక ఆహారం తీసుకోకపోవడం ఆలస్యమైతే.. జీవక్రియ మందగిస్తుంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పెరగడం మొదలై.. ఊబకాయం బారినపడే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట కొవ్వులు, చక్కెరతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకుంటే.. పేగు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం హార్మోన్ల అసమతుల్యతకూ దారితీస్తుంది. మానసిక ఒత్తిడి, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలను తెచ్చిపెడుతుంది. కాబట్టి భోజనానికి, నిద్రకు మధ్య కనీసం మూడు గంటలైనా విరామం ఉండాలి. రాత్రి భోజనం తర్వాత ఓ 15 నిమిషాలైనా నడవాలి.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 హైదరాబాద్ మంగళవారం 11 మార్చి





# చివరి గంటలో లాభాలు ఆవిరి..!

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అన్నిరంగాల్లో అమ్మకాలు కనిపించాయి. ఉదయం మార్కెట్లు లాభాల్లో మొదలైనా.. చివరి సెషన్‌లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం.. 74,474.98 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత అదే ఉత్సాహం మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 74,741.25 గరిష్ఠానికి చేరుకుంది. అయితే, చివరి సెషన్‌లో లాభాల స్వీకరణకు దిగడంతో ఒక్కసారిగా మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 74,022.24పాయింట కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 217.41 పాయింట్లు తగ్గి.. 74,115.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92.20 పాయింట్లు తగ్గి.. 22,460.30 వద్ద ముగిసింది. మొదటి అర్ధభాగంలో నిఫ్టీ 22,650 పాయింట్ల మార్క్‌ను దాటడంతో లాభాలను ఆర్జించింది.కానీ, చివరి గంటలో లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, ఓఎన్‌జీసీ, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో నిఫ్టీలో ప్రధాన నష్టాలను చవిచూశాయి. పవర్ గ్రిడ్ కార్ప్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్, నెస్లే ఇండియా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం తగ్గింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం పతనమైంది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి రెండుశాతం క్షీణించాయి. వేదాంత్ ఫ్యాషన్స్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఆస్ట్రల్, షాపర్స్ స్టాప్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఈకేఐ ఎనర్జీ, శివ సిమెంట్, పీఎన్‌బీ గిల్ట్స్ తదితర 120కి పైగా స్టాక్‌లు బీఎస్ఈలో 52 వారాల కనిష్ఠానికి పడిపోయాయి.




# మెటల్స్, కమోడిటీస్ షేర్లపై కన్నేయండి!



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడొచ్చు. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయంగా ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సూచీలను నడిపించే వీలుంది. సూచీలు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉన్నాయి...
దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడొచ్చు. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయంగా ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సూచీలను నడిపించే వీలుంది. సూచీలు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉన్నాయి. డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలను బట్టి మార్కెట్ మూమెంటమ్ కొనసాగనుంది. నాణ్యమైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం లేకపోలేదు. మెటల్స్, కమోడిటీస్, ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు బుల్లిషగా ఉన్నాయి. ఆటుపోట్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. శుక్రవారం హోలీ సందర్భంగా మార్కెట్లకు సెలవు కావటం తో ఈ వారం నాలుగు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి.

### స్టాక్ రికమండేషన్స్

**మజగావ్ డాక్-నవభూమి:** గత ఏడాది జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. కొన్ని నెలలుగా అక్యుములేషన్ కొనసాగుతోంది. కీలకమైన రూ.2,000 స్థాయి వద్ద మరోసారి మద్దతు తీసుకుని పెరుగుతున్నాయి. గత వారం నిఫ్టీతో పోల్చితే 9% మేరకు పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,338 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,320/ 2,300 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,285 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.కొచ్చిన్ షిప్‌యార్డ్: జీవితకాల గరిష్ఠం నుంచి 60 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ ఆరంభమైంది. కీలకమైన రూ.1,200 స్థాయిలో మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.1,335 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,280 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.భారత్ రసాయన్: ఈ షేరు రూ.14,500 స్థాయి నుంచి 35 శాతం మేర దిద్దుబాటుకు లోనై తర్వాత రూ.10,000 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 6 శాతం లాభంతో రూ.11,140 వద్ద క్లోజయి బేస్ బ్రేకౌట్ చేసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.11,000 వద్ద ప్రవేశించి రూ.11,500/11,600 టార్గె ట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.11,000 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.రైట్స్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. దాదాపు 50 శాతం మేర పతనమైంది. అయితే గత వారం వరుసగా నాలుగు సెషన్లు లాభపడింది. గత శుక్రవారం ఈ షేరు రూ.219 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.200 వద్ద పొజిషన్ తీసుకుని రూ.225/240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.200 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.జేఎసడబ్ల్యూ ఇన్‌ఫ్రా: ఈ ఏడాది ఆరంభం నుంచి 35 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం 'వీ' షేప్ రికవరీ కనిపిస్తోంది. రూ.220 వద్ద మద్దతు తీసుకున్న ఈ షేరు గత వారం 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.239 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.260 స్థాయిలో ప్రవేశించి రూ.310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.245 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

# రూ. 448కే 84 రోజుల వ్యాలిడిటీ.. జియో ఆఫర్.. అన్‌లిమిటెడ్ వాయిస్ సర్వీసులు!

**న్యూఢిల్లీ-నవభూమి:**మొబైల్ సిమ్ రీఛార్జులకు సంబంధించి.. ఒకప్పుడు అవసరం ఉన్నంత మేరకే చేసుకునే వాళ్లం. అప్పట్లో రూ. 10, 20 ఇలా టాపప్ రీఛార్జులు ఉండేవి. రానురానూ అన్‌లిమిటెడ్ డేటాను అలవాటు చేసిన టెలికాం కంపెనీలు.. ఇప్పుడు రీఛార్జ్ కోసం నెలకు వందల్లో ఖర్చు పెట్టిస్తున్నాయి. డేటా అవసరం లేకుండా వాయిస్ ఓన్లీ ప్లాన్లను ఇటీవల తీసుకురాగా.. దేంట్లో ఎలా టారిఫ్స్ ఉన్నాయో చూద్దాం. అన్‌లిమిటెడ్ డేటా.. దిగ్గజ టెలికాం కంపెనీలు ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన ఈ వ్యూహం ఫలించిందనే చెప్పొచ్చు. అప్పటివరకు చిన్న మొత్తాల్లో నగదుతో రీఛార్జులు చేసుకునే వారు కాస్త.. వందల్లో ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మొదట్లో రీఛార్జి అంటే ఒకేసారి రూ. 50, రూ. 100 ఇలా అవసరం ఉన్నంత వరకు పెట్టి రీఛార్జ్ చేసుకునేవారు. ఇది కూడా ఎక్కువే అనుకున్నవారు అవసరం ఉన్నప్పుడు రూ. 10, రూ. 20 స్క్రాచ్ కార్డులు తీసుకొని రీఛార్జ్ చేసుకునేవారు. ఇక డేటా ఛార్జీలు కూడా అప్పట్లో తక్కువలో ఉండేవి. రూ. 11, రూ. 22 ఇలా అవసరం ఉన్నంతలో కొనుగోలు చేసేవారు. కానీ రిలయన్స్ జియో ఎంట్రీతో పరిస్థితి మారిపోయిందన్న సంగతి తెలిసిందే. అన్‌లిమిటెడ్ కాలింగ్, డేటా పేరుతో సరికొత్త విప్లవం సృష్టించింది. తొలుత చాలా తక్కువ ధరల్లో ఇంత మొత్తంలో రీఛార్జి చేసుకుంటే.. అన్‌లిమిటెడ్ కాల్స్, డేటా ఇలా ఆఫర్లు ప్రవేశపెట్టింది. దీంతో చాలా మంది జియోకు మారారు. తమ కస్టమర్లు తగ్గుతారన్న భయంతో.. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కూడా ఇదే బాటలో నడిచాయి.అయితే కస్టమర్లకు తర్వాతే అర్థమైంది. ఇందులో ఇరుక్కుపోయామని. క్రమక్రమంగా టారిఫ్స్ పెంచుతూ వెళ్లాయి. ఒకప్పుడు పెట్టిన మొత్తానికి 3 నెలలకు వచ్చేది.. ఇప్పుడు నెల కూడా రావట్లేదు. తక్కువ మొత్తంలో చేసుకునే రీఛార్జుల్ని క్రమంగా ఎత్తేసింది. ఒకప్పుడు డైలీ 1GB డేటా ప్లాన్లు ఎక్కువగా ఉండగా.. ఇప్పుడు ఈ డేటాను పెంచి.. రేట్లను కూడా పెంచేసింది. ఈ క్రమంలోనే డేటా పెద్దగా అవసరం లేని వారికి కూడా ఈ రీఛార్జ్ చేసు కోవాలంటే.. తప్పనిసరి పరిస్థితుల్లో పెద్ద మొత్తంలోనే ఖర్చు చేసి వాయి స్, ఎస్ఎంఎస్‌లతో పాటుగా డేటా ప్లాన్స్ కూడా తీసుకోవాల్సి వచ్చేది.

# రేపటి కోసం ప్లాన్ ఎలా?..ఎన్‌పీఎస్ వివరాలు తెలుసా..




**న్యూఢిల్లీ-నవభూమి:**రిటైర్మెంట్‌తో మీకు అందే ఆదాయానికి తెరపడ్డట్టే. రోజువారీ అవసరాలకు కూడా నానా ఇబ్బందులు తలెత్తుతాయంటే అతిశయోక్తి కాదు. ఇలాంటప్పుడే ప్లానింగ్ విలువ తెలిసేది. రిటైర్మెంట్ కోసం చక్కని ప్రణాళికల్ని వేసుకొనేవారికి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ప్రధానమని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ స్వచ్ఛంధ పథకం విషయానికొస్తే..

**టైర్ 1 అకౌంట్**
రిటైర్మెంట్ సేవింగ్స్ కోసం టైర్ 1 అకౌంట్ ప్రధానం. పూర్తిస్థాయిలో ఎన్‌పీఎస్, పన్ను ప్రయోజనాలను అందుకోవాలంటే ఇది అవసరం.

**కనీస విరాళాలు**
కనీస ప్రారంభ విరాళం రూ.500. ఆ తర్వాత ప్రతీ ఆర్థిక సంవత్సరం కనీస విరాళం రూ.1,000.

**పన్ను ప్రయోజనాలు**
ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీసీడీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను పొందవచ్చు. అదనంగా సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద మరో రూ.50వేలు క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ(2) కింద అదనపు కోతల ద్వారా కార్పొరేట్ ఉద్యోగులూ లాభం పొందవచ్చు.

**లాకిన్ పీరియడ్**
టైర్ 1 ఖాతాలో ఖాతాదారునికి 60 ఏండ్లు వచ్చేదాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయితే 60 శాతం నిధిని పన్ను లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగతా 40 శాతం నిధిని రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ కోసం యాన్యుటీని కొనాల్సి ఉంటుంది.

**టైర్ 2 అకౌంట్**
ఇది వాలంటరీ సేవింగ్స్ అకౌంట్. దీనికి ఎలాంటి పన్ను ప్రయోజనాలు వర్తించవు. అయితే రిటైర్మెంట్‌కు ముందే ఫండ్స్‌ను విత్‌డ్రా చేసుకోవాలనుకొనేవారికి ఇది ఉపయోగకరం.కనీస విరాళాలు: రూ.1,000. మీడియం టర్మ్ సేవింగ్స్, ఎమర్జన్సీలకు మంచి అవకాశం. టైర్ 2 అకౌంట్‌ను తెరవాలంటే టైర్ 1 ఖాతాను తీసుకోవాలి. కాగా, టైర్ 1, 2 ఖాతాలు సింగిల్ పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్)కు లింకై ఉంటాయి.

# బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**భారతదేశంలో బంగారం ధరలు గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులు అవుతున్నాయి. కానీ వెండి ధరలు మాత్రం కొంత స్థిరంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నిర్ణయాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ విలువ పెరగడం, వడ్డీ రేట్ల మార్పు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో నేడు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**గోల్డ్ రేట్లు..**
బంగారం, వెండి ధరలు ప్రతి రోజు కూడా మారుతుంటాయి. గుడ్ రిటర్న్ వెబ్?సైట్ ప్రకారం ప్రస్తుతం 2025 మార్చి 10న తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణంలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 87,770కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 80,390గా ఉంది. అదే సమయంలో వెండి ధర కేజీకి రూ. 108,000 స్థాయికి చేరుకుంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 80,540కి చేరగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,850కి చేరుకుంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ గోల్డ్ రేట్, 24 క్యారెట్ గోల్డ్ రేట్
చెన్నైలో రూ. 80,390, రూ. 87,770
ఢిల్లీలో రూ. 80,540, రూ. 87,850
కోల్‌కతాలో రూ. 80,390, రూ. 87,770
బెంగళూరులో రూ. 80,390, రూ. 87,770
హైదరాబాద్‌లో రూ. 80,390, రూ. 87,770
విజయవాడలో రూ. 80,390, రూ. 87,770
పూణేలో రూ. 80,390, రూ. 87,770
పాట్నాలో రూ. 80,440 రూ. 87,750
ముంబైలో రూ. 80,390, రూ. 87,770
కేరళలో రూ. 80,390, రూ. 87,770

బంగారం స్వచ్ఛతను ఎలా గుర్తించాలి
బంగారం స్వచ్ఛతను హాల్‌మార్కింగ్ ద్వారా గుర్తించడానికి వివిధ అంతర్జాతీయ సంస్థలు ప్రమాణాలను రూపొందించాయి. భారతదేశంలో ®BIS హాల్‌మార్క్ బంగారం స్వచ్ఛతకు ప్రామాణిక గుర్తింపును ఇస్తుంది.

హాల్‌మార్క్ నంబర్ల అర్థం
24 క్యారెట్ - 999 (99.9% స్వచ్ఛత)
23 క్యారెట్ - 958 (95.8% స్వచ్ఛత)
22 క్యారెట్ - 916 (91.6% స్వచ్ఛత)
21 క్యారెట్ - 875 (87.5% స్వచ్ఛత)
18 క్యారెట్ - 750 (75% స్వచ్ఛత)
14 క్యారెట్ - 585 (58.5% స్వచ్ఛత)

క్యారెట్ ప్రాముఖ్యత
24 క్యారెట్ స్వచ్ఛమైన బంగారం, కానీ చాలా మృదువుగా ఉండటంతో ఆభరణాల తయారీలో చాలా తక్కువగా వినియోగిస్తారు
22 క్యారెట్ బంగారం ఎక్కువగా ఆభరణాలలో ఉపయోగిస్తారు
18 క్యారెట్ బంగారం కూడా ఆభరణాల కోసం వాడతారు
14 క్యారెట్ కంటే తక్కువ క్యారెట్ల బంగారం ఎక్కువగా డిజైనర్ జ్యువెలరీలో లేదా డెయిలీ వేర్ కోసం ఉపయోగిస్తారు

# చతికిల పడిన ఐపీఓ మార్కెట్



**న్యూఢిల్లీ-నవభూమి:** సెకండరీ మార్కెట్లో కనిపిస్తున్న దిద్దుబాటు (కరెక్షన్) ప్రభావం ప్రైమరీ మార్కెట్‌పైనా కనిపిస్తోంది. గత మూడు వారాలుగా ఒక్క ప్రధాన కంపెనీ షేరు కూడా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కాలేదు. గత ఏడాది డిసెంబరులో 16 కంపెనీలు నిధుల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేశాయి. ఈ ఏడాది జనవరి నాటికి వీటి సంఖ్య ఐదుకు, ఫిబ్రవరికి నాలుగుకు పడిపోయాయి. ఇన్వెస్టర్లు ఆదరిస్తారో.. లేదోననే భయంతో అడ్వాన్స్‌డ్ సిస్టెక్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, వినీ కార్పొరేషన్ అనే మూడు కంపెనీలు ఏకంగా తమ ఐపీఓలనే పక్కన పెట్టాయి.గత ఏడాది 91 కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి 'బేర్' పట్టుతో మార్కెట్ ట్రెండ్ మారింది. గత రెండు నెలల్లో లిస్టయిన ఐపీఓలూ మదుపరులకు పెద్దగా లాభాలు పంచలేక పోయాయి. అయినా మార్కెట్ కోలుకుంటే రూ.67,000 కోట్ల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేసేందుకు ఇప్పటికే 45 కంపెనీలు సెబీ ఆమోదం పొందాయి. ఇంకో రూ.1.15 లక్షల కోట్ల సమీకరణ కోసం మరో 69 కంపెనీలు సెబీ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇందులో 45 కంపెనీలు గత రెండు నెలల్లోనే దరఖాస్తు చేయడం విశేషం. మార్కెట్ కోలుకున్నా ఐపీఓల వాల్యుయేషన్లు సముచితంగా ఉంటే తప్ప మదుపరులు ఆదరించక పోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.


ఏప్రిల్‌లో ఏథర్ ఎనర్జీ ఐపీఓ
మరో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే నెల (ఏప్రిల్)లో ఐపీఓకు వచ్చే అవకాశం ఉందని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాల సమాచారం. ఈ ఐపీఓకు నాందిగా 1.73 కోట్ల కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఒక్కోటి రూపాయి ముఖ విలువ ఉన్న 24.04 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చేందుకు ఏథర్ ఎనర్జీ బోర్డు ఈ నెల 8న ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓ కూడా రూ.5,000 కోట్లకుపైగానే ఉంటుందని సమాచారం.టాటా గ్రూప్ నుంచి మరో బాహుబలి ఐపీఓ మార్కెట్‌కు రాబోతోంది. టాటా మోటార్స్ ఫైనాన్స్ కంపెనీని తనలో విలీనం చేసుకునేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం లభించిన వెంటనే ఐపీఓకు వచ్చేందుకు టాటా క్యాపిటల్ సిద్ధమవుతోంది. ఎన్‌సీఎల్‌టీ ఈ నెలాఖరులోగా ఇందుకు అనుమతిస్తుందని భావిస్తున్నారు. ఈ ఐపీఓ రూ.17,000 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

# భారత్‌తో పోలిస్తే దుబాయ్ బంగారం ధర ఎందుకు తక్కువంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం అక్రమ రవాణా కేసులో నటి రన్యా రావు అరెస్టయ్యాక దుబాయ్‌పై చర్చ మొదలైంది. దుబాయ్‌లో బంగారం ధరలు తక్కువగా ఉంటాయా? దీనికి కారణమేంటీ అనే చర్చ జరుగుతోంది. మరి అసలు దుబాయ్ బంగారం కథ ఏంటో వివరంగా తెలుసుకుందామా?
దుబాయ్‌లో బంగారం ధర భారత్‌లో పోలిస్తే చాలా తక్కువ. బంగారం వాణిజ్యానికి దుబాయ్ ఎప్పటి నుంచో కేంద్రంగా ఉంటోంది. భారత్ కంటే తక్కువకే అక్కడ బంగారం దొరకుతుంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి.
బంగారం కొనుగోళ్లపై దుబాయ్ ప్రభుత్వం ఎలాంటి పన్నులు విధించదు. దీంతో, అక్కడ మార్కట్ ధరలకే వినియోగదారులు బంగారాన్ని కొనుక్కోవచ్చు.ఇక భారత్‌కు భిన్నంగా దుబాయ్ ప్రభుత్వం బంగారం దిగుమతులపై కూడా ఎలాంటి సుంకాలు విధించదు. దీంతో, పసిడి ధరలు మరింత తగ్గుతాయి. దీనికి తోడు అక్కడి మార్కెట్లో పోటీ కారణంగా వ్యాపారులు వినియోగదారులకు తక్కువ ధరకే బంగారం విక్రయిస్తుంటారు. చరిత్రలో కూడా దుబాయ్‌కు బంగారం వాణిజ్యంలో కీలక స్థానం ఉంది.
భారత్‌లో బంగారంపై పన్నులు.. సుంకాలు..
అసలే భారతీయులకు బంగారంపై మమకారం ఎక్కువ. ఫలితంగా పసిడిపై కొనుగోళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం బంగారంపై సుంకాలు, పన్నులు విధిస్తోంది. గతేడాది బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. స్మగ్లింగ్‌కు అడ్డకట్ట వేసి చట్టబద్ధమైన దిగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సుంకాల్లో కోత పడ్డప్పటికీ ఎంత దిగుమతి చేసుకోవచ్చనే విషయంలో కొన్ని పరిమితులు అమల్లో ఉన్నాయి. దీన్ని దాటితే అదనపు పన్నులు చెల్లించాల్సి వస్తుంది. దీనికి తోడు భారతీయ పర్యాటకులు విదేశాల నుంచి కొని తెచ్చుకునే బంగారు నగలపై కూడా పరిమితులు ఉన్నాయి పురుష ప్రయాణికులు ఒక్కొక్కరు గరిష్ఠంగా 20 గ్రాములు లేదా రూ.50 వేల విలువైన బంగారాన్ని కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండానే భారత్‌కు తీసుకురావచ్చు. మహిళల విషయంలో ప్రభుత్వం ఈ పరిమితిని 40 గ్రాములు లేదా రూ.లక్ష విలువైన బంగారంగా నిర్ణయించింది. ఈ పరిమితి దాటితే అదనంగా కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఎంతనేది అదనంగా తెచ్చుకున్న బంగారంపై ఆధారపడి ఉంటుంది. అయితే, కస్టమ్స్ సుంకాల తగ్గింపు తరువాత భారత్‌లో బంగారం దిగుమతులు పెరిగాయి. ఏకంగా 10.06 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఫలితంగా వాణిజ్య లోటు పెరిగి అప్పట్లో 29.65 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

# 11 శాతం వడ్డీకి రూ. 3 లక్షల లోన్.. నెలకు ఈఎంఐ ఎంత? ఇంకా తగ్గించుకోవాలంటే?




**న్యూఢిల్లీ-నవభూమి:**మీరు గనుక బ్యాంకుల్లో పర్సనల్ లోన్ తీసుకోవాలని భావిస్తే.. కచ్చితంగా ఫిక్స్‌డ్ వడ్డీ రేటుకు తీసుకోవడం బెటర్. అంటే ఇక్కడ మీరు ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం.. తొలి ఈఎంఐకి కట్టే మొత్తమే.. ఆఖర్లో అంటే లోన్ చివర్లో కూడా ఉండాలి. ఇలా స్థిరమైన ఈఎంఐ ఉండటం వల్ల మీ స్తోమతకు తగ్గట్లుగా చెల్లించగలుగుతారు. ఏదేమైనా.. లోన్ ఈఎంఐ అనేది 3 అంశాల్ని బట్టి మారుతుంటుంది. దీనికి తగ్గట్లుగా మీకు మీరు ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా వడ్డీ రేటు. ఇది లోన్లపై బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేటు. అధిక వడ్డీ రేటు ఉంటే.. అప్పుడు ఈఎంఐ ఎక్కువ పడుతుందని చెప్పొచ్చు. రెండోది లోన్ టెన్యూర్. అంటే ఎంత కాలంలో మీరు లోన్ చెల్లిస్తారనేది చూసుకోవాలి. ఎక్కువ కాలం తీసుకుంటే.. చెల్లించే ఈఎంఐ తక్కువ పడుతుంది. మూడోది లోన్ మొత్తం. ఇక్కడ లోన్ ఎక్కువ మొత్తం తీసుకుంటే.. అప్పుడు కూడా ఈఎంఐ ఎక్కువ పడుతుంది. తక్కువ అమౌంట్‌పై ఈఎంఐ తక్కువ పడుతుంది.దీనిని సరిగా అర్థం చేసుకునేందుకు ఈఎంఐ కాలిక్యులేటర్ వాడాల్సి ఉంటుంది. అప్పుడే మీరు మీ లోన్ మొత్తం.. వడ్డీ రేటు.. టెన్యూర్ వంటివి ఎంచుకోవడంలో.. సకాలంలో మీరు ఈఎంఐ చెల్లించడంలో సహాయపడుతుంది. దీనిపై సరైన అవగాహన లేకపోతే.. ఈఎంఐ ఎక్కువ చెల్లించాల్సి రావొచ్చు.. అప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండొచ్చు. అందుకే సరిగా ప్లాన్ చేసుకోవాలి.
ఉదాహరణకు మీరు రూ. 3 లక్షల పర్సనల్ లోన్ తీసుకున్నట్లయితే .. బ్యాంక్ ఇక్కడ 11 శాతం వడ్డీ రేటు వసూలు చేస్తే.. 24 నెలల్లో అంటే రెండేళ్లకుగానూ నెలకు ఈఎంఐ రూ. 13,982 పడుతుంది. అయితే ఇది మీకు ఎక్కువ అనిపించింది. అంటే నెలలో మీరు ఇంత కట్టలేరనిపిస్తే.. వేరే ఆప్షన్ చూసుకోవాలి. అప్పుడు రూ. 10 వేల కంటే తక్కువ ఈఎంఐనే మీరు చెల్లించగలిగినట్లయితే ఇక్కడ రెండు ఆప్షన్లు ఉన్నాయి. ఒకటి వడ్డీ రేటు తగ్గించుకోవడం లేదా లోన్ టెన్యూర్ పెంచుకోవడం.ఇదే నగదు మొత్తంపై మీరు లోన్ టెన్యూర్‌ను 30 నెలలకు పెంచుకున్నట్లయితే అప్పుడు ఈఎంఐ రూ. 11,483 చొప్పున పడుతుంది. ఇంకా ఈఎంఐ తగ్గించుకోవాలంటే .. అప్పుడు టెన్యూర్ 36 నెలలకు పెంచుకుంటే ఈఎంఐ రూ. 9,821 గా ఉంది. ఇక్కడ రూ. 10 వేల కిందికి దిగొచ్చిందని చెప్పొచ్చు. ఎంత నగదు మొత్తంపై అయినా.. మీరు చెల్లించగలిగే సామర్థ్యాన్ని బట్టి.. ఈఎంఐని ఎంచుకోవాలి. ఇక్కడ టెన్యూర్ పెంచుకోకుండా.. బ్యాంకును ఒప్పించి వడ్డీ రేట్లను తగ్గించమని అడగొచ్చు. ఇలా కూడా టెన్యూర్ పొడిగించుకోకున్నా.. ఈఎంఐ తగ్గించుకునే అవకాశం ఉంటుంది.


# రైలు రిజర్వేషన్ టికెట్‌పై 10 శాతం డిస్కౌంట్

## బెర్త్ కన్ఫర్మ్ ఎలాగో తెలుసా




**న్యూఢిల్లీ-నవభూమి:**బస్సులు, విమాన టికెట్లపై ప్రయివేటు సంస్థలు తమ బిజినెస్ పెంచుకోవడానికి, ప్రయాణీకులను ఆకర్షించడానికి రకరకాల డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటిస్తుంటయి. అదే ప్రభుత్వ రంగానికి చెందిన సంస్థలు రాయితీలు ప్రకటించడం చాలా అరుదు. ముఖ్యంగా అందరికీ అందుబాటులో ఉండే రైలు ప్రయాణానికి సంబంధించి రిజర్వేషన్ టికెట్లపై డిస్కౌంట్ ఇస్తుందని మీకు తెలుసా. అయితే ప్రతి రిజర్వేషన్ టికెట్‌పై ఈ ఆఫర్ వర్తించదు. డిస్కౌంట్ పొందాలంటే భారతీయ రైల్వే కొన్ని నియమ, నిబంధనలు విధించింది. ఈ రాయితీ రిజర్వేషన్ తరగతులకు మాత్రమే వర్తిస్తుంది. స్లీపర్, ఏసీ ఇలా అన్ని రకాల రిజర్వేషన్ టికెట్లపై 10 శాతం డిస్కౌంట్ అందిస్తుంది. సాధారణంగా ఒక రైల్వే టికెట్ రూ.వెయ్యి ఉంటే డిస్కౌంట్‌లో రూ.900కే లభిస్తుంది. ఇప్పటికే సీనియర్ సిటిజన్, మీడియా సిబ్బందికి రాయితీలు ఎత్తివేసిన రైల్వే 10 శాతం డిస్కౌంట్ ఎందుకు ఇస్తుందో అర్థం కావడంలేదా. అసలు భారతీయ రైల్వే ఏ టికెట్లపై ..భారతీయ రైల్వే కరెంట్ రిజర్వేషన్ టికెట్లపై 10 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. ఒక రైలు బయలుదేరడానికి కనీసం నాలుగు గంటల ముందు చార్ట్ తయారవుతుంది. ఈ చార్ట్ ప్రిపరేషన్ తర్వాత ఆ రైలులో ఏవైనా బెర్తులు ఖాళీగా ఉంటే వాటిని కరెంట్ రిజర్వేషన్ కింద అందదుబాటులో ఉంచుతారు. రైలు బయలుదేరడానికి 30 నుంచి 60 నిమిషాల ముందువరకు కరెంట్ రిజర్వేషన్ టికెట్లు అందుబాటులో పెడతారు. ఈలోపు టికెట్లు బుక్ అయిపోతే బెర్తులు ఖాళీ లేవని చూపిస్తుంది. భారతీయ రైల్వే ఒక రైలులో మిగిలిపోయిన సీట్లన భర్తీ చేసుకునేందుకు పది శాతం డిస్కౌంట్ ప్రకటిస్తోంది. సాధారణ రిజర్వేషన్ సమయంలో కనిపించే టికెట్ ధర, కరెంట్ రిజర్వేషన్‌లో పది శాతం ధర తగ్గించి కనిపిస్తుంద.ఎలా పొందాలి..ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ లేదా రైల్వేస్టేషన్‌లోని కరెట్ రిజర్వేషన బుకింగ్ కౌంటర్ల వద్ద ఈ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అన్ని రైల్వే స్టేషన్లలో ఈ విధానం అందుబాటులో ఉండదు. కేవలం ప్రధాన రైల్వే స్టేషన్లలో మాత్రమే కరెంట్ రిజర్వేషన్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు అందుబాటులో ఉంటే ఎక్కడినుంచైనా చేసుకోవచ్చు. స్లీపర్ నుంచి ఫస్ట్ క్లాస్ ఏసీ వరకు ఏ తరగతిలో అయినా కరెంట్ రిజర్వేషన్ టికెట్ చేసుకుంటే పది శాతం డిస్కౌంట్ లభిస్తుంది. సాధారణంగా ప్రయాణీకుల రద్దీ లేని రైళ్లు, సమయాల్లో మాత్రమే కరెంట్ అవైలెబులిటీ చూపిస్తుంది. ప్రతి రైలులో, అన్ని సందర్భాల్లో ఈ టికెట్లు అందుబాటులో ఉండవు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ మంగళవారం 11 మార్చి



# పట్టపగలే రెచ్చిపోయిన దొంగల ముఠా.. తుపాకీతో బెదిరించి రూ.కోట్ల విలువైన ఆభరణాలు



**బీహార్-నవభూమి:** బీహార్ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. పట్టపగలే దొంగల ముఠా రెచ్చిపోయింది. జువెల్లరీ షోరూమ్ లోకి ప్రవేశించి రూ.కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన అరానిలోని తనిష్క్ షోరూమ్ లో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం 10:30 గంటలకు దుకాణం తెరిచారు. కొందరు కస్టమర్లు కూడా వచ్చారు. అదే సమయంలో ఎనిమిది నుంచి తొమ్మిది మంది ముసుగులు, హెల్మెట్లతో ముఖాలను కప్పుకుని షాప్‌లోకి ప్రవేశించారు. సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. షోరూమ్‌లోని సిబ్బంది, కస్టమర్లను తుపాకీతో బెదిరించారు. అనంతరం అక్కడున్న బంగారాన్నంతా తమ సంచుల్లో నింపుకుని ఉడాయించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు షాప్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. చోరీకి గురైన బంగారం విలువ రూ.25 కోట్లు ఉంటుందని షోరూమ్ మేనేజర్ కుమార్ మృత్యుంజయ్ తెలిపారు. బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదును కూడా దొంగల ముఠా తీసుకెళ్లిపోయినట్లు చెప్పారు. అయితే, ఎంత మొత్తం సొమ్ము పోయిందన్నది ఆయన వెల్లడించలేదు. చోరీ సమయంలో దొంగల ముఠాకు తెలియకుండా పోలీసులకు ఫోన్ చేసినట్లు సిబ్బంది ఒకరు తెలిపారు. దాదాపు 25 నుంచి 30 కాల్స్ చేసినట్లు చెప్పారు. షోరూమ్‌కు 600 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ వారు సమయానికి రాలేదని ఆరోపించారు.

# 27,500 మంది కుమార్తెలకు తండ్రి..!.. ఎవరీ కేపీ రామస్వామి?



**న్యూఢిల్లీ-నవభూమి:** కార్పొరేట్ పెద్దలు ఉద్యోగుల శ్రమను దోచుకొంటారు.. ఖర్చు తగ్గించుకొంటారు.. లాభార్జన గురించి ఆలోచిస్తారని అనుకుంటాం. ఈయన మాత్రం జీవితాలను మార్చడంలో ముఖ్యంగా మహిళల ఎదుగుదల కోసం నిమగ్నమయ్యారు. తన కంపెనీలో పనిచేసే కార్మికులను గ్రాడ్యుయేట్లుగా, ఉన్నత విద్యా వంతులుగా మార్చుతూ వేలాది మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు. ఒకరా ఇద్దరా ఏకంగా ఆయన ఇప్పటి వరకూ 40 వేల మందికిపైగా చదువుకోడానికి ఆయన సాయం చేశారు. అందుకే అందరూ అయనను 'అప్పా (నాన్న)' అని పిలుస్తారు. అయనే తమిళనాడుకు చెందిన కేపీ రామస్వామి. కోయంబత్తూరులోని మిల్లుల యజమాని. వృత్తిరీత్యా వస్త్ర పరిశ్రమ నిర్వహిస్తున్నా ఆయన ఎంచుకున్నది మాత్రం తండ్రి పాత్ర. తన మిల్లులో పనిచేసే కార్మికులను గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్ది... విద్యను వారి మెరుగైన జీవితానికి పునాదిగా మార్చడం ద్వారా తండ్రి పాత్ర పోషిస్తున్నారు. తన మిల్లులో పనిచేసే ఓ యువతి అభ్యర్థన రామస్వామి ఆలోచనను మార్చేసింది. 'అప్పా నాకు చదువంటే ఇష్టం... కానీ పేదరికం వల్ల నా తల్లిదండ్రులు న్ను బడి మాన్పించి ఇక్కడికి పంపారు.. కానీ నేను ఇంకా చదువుకోవాలనుకుంటున్నాను.. సాయం చేస్తారా?' అని అభ్యర్థించింది. ఆమె ఆవేదన ఆయన మనసును కదిలించింది. తన కార్మికులకు కేవలం జీతం ఇవ్వడమే కాదు.. వారికి ఉన్న భవిష్యత్తును ఇవ్వాలని అప్పుడే నిర్ణయించుకున్నారు. తమ మిల్లు లోపలే విద్యా వ్యవస్థను ఏర్పాటు చేసి.. 8 గంటల షిఫ్ట్ పూర్తయిన తర్వాత కార్మికులకు 4 గంటల చదువుకునేందుకు అవకాశం కల్పించారు. పూర్తిస్థాయిలో తరగతి గదులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, యోగా కోర్సులను ప్రారంభించి.. నిధులు సమకూర్చారు 1998లో మొదలైన ఈ విద్యాదానం ద్వారా ఇప్పటి వరకు 24,536 మంది మహిళలు పది, ఇంటర్, పీజీ డిగ్రీలు పొందారు. పదివేల మంది గ్రాడ్యుయేట్ల అయ్యారు. అలా చదువుకున్న చాలా మంది ఇప్పుడు నర్సులు, టీచర్లు, పోలీసు అధికారులుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. ఈ ఏడాది తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ నుంచి 20 మంది గోల్డ్ మెడల్ అందుకున్నారు. అయితే, తన కంపెనీలో పనిచేసే కార్మికులు చదువుకుని వెళ్లిపోతే ఎలా అనే సందేహం రావచ్చు. దీనికి ఆయన చెప్పేది ఏంటంటే "నేను వారి సామర్థ్యాన్ని వృథా చేస్తూ మిల్లులోనే కార్మికులుగా ఉంచాలనుకోవడం లేదు.. ఇది వాళ్లు ఎంచుకున్నది కాదు.. పేదరికం కారణంగా వచ్చారు. వారికి భవిష్యత్తును ఇవ్వడం నా పని, ఇది పంజరం కాదు అని" అయన అంటారు. తమ మిల్లులో పనిచేస్తూ చదువుకుని బయటకు వెళ్లి కెరీర్ నిర్మించుకుంటారని, ఆ తర్వాత? వారి గ్రామాల నుంచి మరింత మంది ఆడపిల్లలను మిల్లుకు పంపుతారనఅంటున్నారు. ఈరోడ్ జిల్లా కలియంపుత్తూరు అనే కుగ్రామంలో ఓ సాధారణ వ్యవసాయం కుటుంబంలో పుట్టిన రామస్వామి.. నలుగురు సంతానంలో పెద్దవాడు. చదివించే స్థోమత లేక తల్లిదండ్రులు ఆయన్ను వ్యవసాయ పనులకు పంపారు. పొలం పనులు చూసుకుంటూ ముగ్గురు తమ్ముళ్లను ప్రయోజకుల్ని చేశారు. క్రమంగా వ్యవసాయంలో నష్టాలు పెరగడంతో దాన్ని వదిలేశారు. అనంతరం రూ.8 వేలు అప్పుచేసి.. 1971లో తన రెండో తమ్ముడితో కలిసి నాలుగు స్పిన్నింగ్ మెషిన్లతో చిన్నగా వ్యాపారం మొదలుపెట్టారు.

# 'మీది అనాగరికత.. మీది దురహంకారం..' హిందీ భాషపై కేంద్రం, తమిళనాడు వర్డ్స్ వార్



**న్యూఢిల్లీ-నవభూమి:** నూతన జాతీయ విద్యా విధానం పైన, స్కూళ్లలో హిందీ భాష బోధన పైన కేంద్రం తమిళనాడు ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఇదే విషయమై ఇవాళ పార్లమెంట్ లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌చేసిన వ్యాఖ్యలు రెండు ప్రభుత్వాల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. హిందీ భాష విషయంలో తమిళనాడు తీరు అనాగరికత అని కేంద్ర మంత్రి విమర్శిస్తే.. కేంద్రానిది దురహంకారం అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. ముందుగా కేంద్ర మంత్రి ప్రధాన్ లోక్‌సభలో మాట్లాడుతూ.. 'వాళ్లకు (డీఎంకే నేతలకు) నిజాయితీ లేదు. తమిళనాడు విద్యార్థులపట్ల వారికి చిత్తశుద్ధి లేదు. తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును వాళ్లు నాశనం చేస్తున్నారు. భాషను అడ్డం పెట్టుకోవడమే వాళ్ల పని అయ్యింది. వాళ్లు రాజకీయాలు చేస్తున్నారు. ఇది దుర్మార్గం. వారు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు.' అని వ్యాఖ్యానించారు. అంతేగాక డీఎంకేలో అంతర్గత కలహాలు ఉన్నాయని, గత ఎన్నికల సందర్భంగా ఇవి బయటపడ్డాయని ప్రధాన్ ఆరోపించారు. అంతర్గత కలహాలను కప్పిపుచ్చుకునేందుకే హిందీ భాషపై వివాదం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాన్ వ్యాఖ్యలకు తమిళనాడు సీఎం స్టాలిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మీరు తమిళనాడు ప్రజలను అవమానిస్తున్నారు. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీన్ని అంగీకరిస్తారా..?' అని స్టాలిన్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ఒక సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఈ పోస్టుకు ప్రధాని మోదీని కూడా టాగ్ చేస్తూ కొనసాగించారు. 'నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం మీ త్రిభాషా సూత్రం అమలు కోసం మేం ముందడుగు వేయలేం. త్రిభాషా సూత్రాన్ని అమలుపర్చాలని మాపై ఎవరూ ఒత్తిడి చేయలేరు.' అని పేర్కొన్నారు. అదేవిధంగా తమిళనాడు స్కూళ్లలో హిందీ బోధనను అమలు చేయకపోతే విద్యాశాఖ నిధులు నిలిపివేస్తామని గత నెలలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను స్టాలిన్ గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు బ్లాక్ మెయిల్ హెచ్చరికలని స్టాలిన్ ఆరోపించారు. ఇది కేంద్ర ప్రభుత్వం దురహంకారమని ఆయన మండిపడ్డారు.

# పన్ను తగ్గింపులు అడగొద్దు.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రిక్వెస్ట్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** పన్ను తగ్గింపులు కోరవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కార్ల పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వానికి డబ్బు అవసరమన్నారు. భారత్‌లో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9శాతానికి తగ్గుతుందన్నారు. జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని డిమాండ్ చేయొద్దన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని.. పన్నులు తగ్గిస్తే.. మరింత డిమాండ్ చేస్తారన్నారు. ఇది మానవ మస్తత్వం అన్నారు. తాము పన్నులను తగ్గించాలని అనుకుంటున్నా మని.. కానీ పన్నులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. ధనవంతుల నుంచి పన్నులు తీసుకొని పేదలకు ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ దార్శనికత అని.. ప్రభుత్వానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 14-16 శాతంగా ఉందని.. రాబోయే రెండేళ్లలోపు లాజిస్టిక్స్ ఖర్చు 9శాతానికి తగ్గుతుందని హామీ ఇచ్చారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పోటీతత్వాన్ని కలిగి ఉంటామన్నారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8శాతం ఉండగా.. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఇది 12 శాతం ఉందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా భారత పరిశ్రమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మూలధన పెట్టుబడిని పెంచడం ద్వారా భారతదేశం మరిన్ని ఉద్యోగాలను సృష్టించబోతోందని చెప్పారు. 'మీరంతా సంపద సృష్టికర్తలు మాత్రమే కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు'. ఈ స్వర్ణ యుగాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి' అంటూ పిలుపునిచ్చారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం గా మార్చేందుకు దిగుమతులను తగ్గించి.. ఎగుమతులను పెంచాల్సిన అవసరాన్ని గడ్కరీ నొక్కి చెప్పారు.

# వెజ్ థాలీ ధర కిందికి.. నాన్‌వెజ్ థాలీ ధర పైకి : క్రిసిల్ నివేదిక



**న్యూఢిల్లీ-నవభూమి:** 2023 ఫిబ్రవరి నెలతో పోల్చుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఇళ్లలో వండుకునే వెజ్ థాలీ ధర ఒక శాతం తగ్గింది. అదే సమయంలో నాన్ వెజ్ థాలీ ధర 6 శాతం పెరిగింది. క్రిసిల్ తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది ఫిబ్రవరి కంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో కూరగాయల ధరలు, వంట గ్యాస్‌సిలిండర్ ధరలు తగ్గడమే వెజ్ థాలీ ధర తగ్గడానికి కారణమని నివేదిక పేర్కొన్నది. అదే సమయంలో బ్రాయిలర్ చికెన్ ధర పెరగడం నాన్ వెజ్ థాలీ ధర పెరగడానికి కారణమని తెలిపింది. 2023 ఫిబ్రవరిలో కిలో టమాట ధర రూ.32 ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో అది రూ.23 తగ్గిందని క్రిసిల్ రిపోర్టు పేర్కొన్నది. గత ఏడాది ఫిబ్రవరి కంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో మార్కెట్ టమాట పంట 20 శాతం అధికంగా రావడమే టమాట ధర తగ్గడానికి కారణమని తెలిపింది. అదే సమయంలో గత ఫిబ్రవరిలో 14.2 కేజీల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.903 గా ఉండెనని, ఈ ఫిబ్రవరిలో అది రూ.803కు తగ్గిందని, ఇది కూడా వెజ్ థాలీ ధరలో తగ్గుదలకు ఒక కారణమని పేర్కొంది. అయితే టమాట, గ్యాస్ ధరలు తగ్గినా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉల్లిగడ్డ, ఆలుగడ్డ ధరలు 16 శాతం పెరిగాయని, అదేవిధంగా వెజిటెబుల్ ఆయిల్ ధరలు 18 శాతం పెరిగాయని, వెజ్ థాలీ ధర ఇంకా దారుణంగా పడిపోకుండా ఇవి అడ్డుకోగలిగాయని క్రిసిల్ రిపోర్టు వివరించింది. అదేవిధంగా 2023 ఫిబ్రవరితో పోల్చుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్రాయిలర్ చికెన్ ధరలు 15 శాతం పెరిగాయని తెలిపింది. నాన్ వెజ్ థాలీ ధరలో 50 శాతం చికెన్ ధరే ఉన్నదని పేర్కొంది. గత ఏడాది బ్రాయిలర్ చికెన్ సరఫరా ఎక్కువగా ఉండటంతో ధరలు తక్కువగా ఉన్నాయని, ఈ ఏడాది అంత సరఫరా లేకపోగా, కోళ్ల దాణా ధర కూడా 6 శాతం పెరిగిందని అందుకే నాన్ వెజ్ థాలీ ధర పెరిగిందని క్రిసిల్ రిపోర్టు వెల్లడించింది.

# అమ్మాయి పుడితే 50 వేలు.. అబ్బాయైతే ఆవు.. ఆఫర్‌ను సమర్థించుకున్న టీడీపీ ఎంపీ



**న్యూఢిల్లీ-నవభూమి:** మూడవ సంతానం మగ పిల్లవాడైతే ఓ గోవును లేదా ఆడపిల్ల పుడితే 50 వేలు ఇస్తానని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అప్పల నాయుడు ప్రకటించిన ఆఫర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. అయితే ఆ వ్యాఖ్యలను ఆయన సమర్థించుకున్నారు. జనాభా ప్రతిపాదికన డీలిమిటేషన్ చేపట్టేందుకు కేంద్ర సర్కారు సిద్ధమైన నేపథ్యంలో.. తెలుగు దేశం పార్టీ నేత అప్పలనాయుడు ఈ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చింది. విజయనగరంకు చెందిన ఎంపీ శనివారం ఆ వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ మూడవ సంతానంగా మగబిడ్డకు జన్మనిచ్చే మహిళలకు గోవును బహుమతిగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒకవేళ అమ్మాయి పుడితే, వారికి తన జీతం నుంచి 50 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అధిక సంఖ్యలో పిల్లల్ని కనాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల కొన్ని స్కీమ్‌లను కూడా ప్రకటించారు. దానికి తగినట్లే ఎంపీ అప్పలనాయుడు ఈ ఆఫర్ వెల్లడించారు. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తక్కువగా ఉన్నది. అయితే డీలిమిటేషన్ ప్రక్రియతో ఉత్తరాదికి లాభం చేకూర అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధిక సంఖ్యలో పిల్లల్ని కనేందుకు ఆడవాళ్లకు ఆఫర్ ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల్లోనూ అధిక లోక్‌సభ సీట్లు రావాలంటే, జనాభా సంఖ్య ఇంకా పెరగాల్సి ఉన్నది. అయితే ఎంపీ అప్పలనాయుడు చేసిన ప్రకటనను ఏపీ సీఎం చంద్రబాబు కూడా సమర్థించారు. జనాభా ప్రతిపాదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ విభజన చేపట్టరాదు అని ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్న విషయం తెలిసిందే. కేంద్రం చేపట్టబోయే డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుకునేందుకు .. ఏడుగురు సీఎంలతో స్టాలిన్ భేటీకి పిలుపునిచ్చారు.

# ప్లీజ్ ఆ బహుమతులు తీసుకురాకండి

## బంధువులకు ఎంపీ తేజస్వీ సూర్య రిక్వెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని అత్యంత పిన్న వయస్కుడైన ఎంపీగా పేరు పొందిన భాజపా పార్లమెంట్ సభ్యుడు తేజస్వీ సూర్య వివాహం నాలుగు రోజుల క్రితమే ఘనంగా జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆదివారం రోజే ఈయన రిసెప్షన్ జరగ్గా.. ముందుగానే ఆయన బంధువులు, స్నేహితులకు ఓ రిక్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఓ రెండు బహుమతులను మాత్రం తనకోసం తీసుకు రావద్దని ప్రత్యేకంగా కోరారట. మరి ఆ బహుమతులు ఏంటి, అసలు వద్దని ఎందుకు చెప్పారో మనం ఇప్పుడు తెలుసుకుందాం. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వివాహం మార్చి 6వ తేదీన బెంగళూరులో ఘనంగా జరిగింది. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను.. తేజస్వీ సూర్య పెళ్లి చేసుకున్నారు. అంగరంగ వైభవంగా జరిగిన వీరి వివాహ మహోత్సవానికి కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘవాల్, వి సోమన్న, బీజేపీ నేతలు అన్నామలై, అమిత్ మాలవీయ, బీవై విజయేంద్ర తదితరులు వచ్చారు. వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలు సైతం నెట్టింట తెగ వైరల్ అయ్యాయి. వివాహం జరిగిన మూడ్రోజుల తర్వాత అంటే మార్చి 9వ తేదీ ఆదివారం రోజు బెంగళూరులో వీరి రిసెప్షన్ జరిగింది. ఈ వేడుకకు ముందే ఎంపీ తేజస్వీ సూర్య.. రిసెప్షన్‌కు వచ్చే బంధువులు, స్నేహితులకు ఓ విన్నపం చేశారట. తమను ఆశీర్వదించడానికి వచ్చేటప్పుడు ఓ రెండు బహుమతులు మాత్రం అస్సలే తీసుకు రావొద్దని వివరించారట. అందులో ఒకటి బొకేలు కాగా మరోటి డ్రై ఫ్రూట్స్. తమ పెళ్లికి వచ్చిన అనేక మంది అతిథులు ఈ రెండింటిని బహుమతులుగా అందజేసినట్లు వివరించారు. ముఖ్యంగా పూలు, బొకేలు ఎక్కువగా రాగా.. పెళ్లి జరిగిన 24 గంటల్లోపే వాటిలో 85 శాతం పూలను పారవేయాల్సి వచ్చిందని ఎంపీ తేజస్వీ సూర్య వెల్లడించారు. ప్రతీ ఏడాది వివాహాల సమయంలో దాదాపు 3 లక్షల కిలోల డ్రై ఫ్రూట్స్ మిగిలిపోతున్నాయని.. వాటిపై దాదాపు రూ.315 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని సర్వేలో తేలినట్లు చెప్పుకొచ్చారు. కాబట్టి ఈ వృథా ఖర్చులను నివారించడానికి తమ రిసెప్షన్‌కు వచ్చే అతిథులు వీటిని తీసుకురావొద్దని ముందుగానే విజ్ఞప్తి చేశారు. ఈక్రమంలోనే బంధువులు సైతం వీటిని తీసుకెళ్లకుండానే వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతుండగా.. ఎంపీ విజ్ఞప్తిని అంతా మెచ్చుకుంటున్నారు. ఇలాంటి వృథా ఖర్చులను అరికట్టడం మంచి ఆలోచన అంటూ ప్రశంసిస్తున్నారు.

# నోరు అదుపులో పెట్టుకో.. కేంద్ర మంత్రికి సీఎం స్టాలిన్ వార్నింగ్



**చెన్నై-నవభూమి:** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమలు అంశంలో కేంద్రం, తమిళనాడు రాష్ట్రం మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తోంది. ఎన్ఈపీ అమలు చేయకుండా తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును డీఎంకే నాశనం చేస్తున్నదని ఇవాళ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆరోపించారు. లోక్‌సభలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీన్ని తమిళనాడు సీఎం స్టాలిన్ తప్పుపట్టారు. ఎన్ఈపీ 2020ని అమలు చేయబోమని స్టాలిన్ స్పష్టం చేశారు. ఆ విద్యా విధానాన్ని అమలు చేయాలని ఎవరూ తమను వత్తిడి చేయలేరన్నారు. విద్యార్థులకు చెందిన నిధుల్ని విడుదల చేస్తారా లేదా అని ఆయన కేంద్రాన్ని నిలదీశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆయనకు ఆయనే రాజులా ఫీలవుతున్నారని, చాలా దరుసుగా మాట్లాడుతున్నారని, క్రమశిక్షణ అవసరమని స్టాలిన్ తెలిపారు. తమిళనాడుకు రావాల్సిన నిధుల్ని మంజూరీ చేయకుండా, తమిళనాడు ఎంపీల పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. గతమిళనాడు ప్రజల్ని మంత్రి అవమానిస్తున్నారని చెప్పారు. మంత్రి ప్రదాన్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ ఆమోదిస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ప్రధాన్ తన నోటిని అదుపులో పెట్టుకోవాలన్నారు. నిధులు ఇవ్వకుండా తమిళ ప్రజల్ని మోసం చేస్తున్నారని, తమిళ ఎంపీలను అనాగరికులు అంటారా అని తన సోషల్ మీడియా పోస్టులో స్టాలిన్ ఎదురుదాడి చేశారు.

# గుల్మార్గ్ ఫ్యాషన్ షోపై వివాదం.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో రచ్చ



**శ్రీనగర్-నవభూమి:** జమ్ముకశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో మార్చి7న ఫ్యాషన్ షోపై నిర్వహించడంపై వివాదం చెలరేగింది. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఈ కార్యక్రమం జరుగడంపై విమర్శలు వెల్లువెత్తాయి. సోమవారం జమ్ముకశ్మీర్ అసెంబ్లీని ఈ అంశం కుదిపేసింది. అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ), స్వతంత్ర సభ్యులు ఈ అంశాన్ని సభలో లేవనెత్తారు. అశ్లీల కార్యక్రమాన్ని ఖండించారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు. ముస్లిం ప్రజలు రంజాన్ ఉపవాసాలు పాటిస్తున్నప్పుడు అలాంటి కార్యక్రమం ఎలా జరిగిందో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఫ్యాషన్ షోపై వివాదం అనవసరమైన అంశమని బీజేపీ సభ్యులు వాదించారు. అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను అంగీకరించాలని అన్నారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఈ నేపథ్యంలో సీఎం ఒమర్ అబ్దుల్లా సభలో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించిందని తెలిపారు. 'గుల్మార్గ్‌లో జరిగిన ప్రైవేట్ కార్యక్రమం ప్రజల మనోభావాలను దెబ్బతీసింది. ఇలాంటి కార్యక్రమాలు ఏ సమయంలోనూ జరుగకూడదు. ఈ ఫ్యాషన్ షోతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. వారు (నిర్వాహకులు) ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఇది ఒక హోటల్‌లో నిర్వహించిన ప్రైవేట్ షో. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు'

# ఇండియన్ ఆర్మీలో చేరిన జవాన్ భార్య.. ఆయన చివరి కోరిక తీర్చేందుకు సిద్ధమైన ధీర వనిత



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లైన నెలకే భర్తను కోల్పోయి.. ఆర్మీ ఆఫీసర్ కావాలనే సైనికుడి కలను నెరవేర్చింది. తండ్రి మాజీ సైనికుడిగా.. కాగా.. కట్టుకున్నవాడు కూడా దేశ సేవకు అంకితమైన సైనికుడు. అటు పుట్టిల్లు.. ఇటు అత్తిల్లు సైనిక కుటుంబాలే కావడంతో సంతోష పడింది. భర్తతో తన బంగారు భవిష్యత్‌ను ఊహించుకుని.. కొత్త జీవితంలోకి అడుగు పెట్టిన ఓ యువతి పెళ్లైన నెల రోజులకే రోడ్డు ప్రమాదంలో భర్తను పోగొట్టుకుంది. ఈ లోకాన్ని వీడుతూ సైన్యంలో చేరి సేవ చేయాలనే భర్త చివరి కోరికను.. కలను నిజం చేసి.. నిజమైన నివాళి అర్పించిం ది.బంగారు భవిష్యత్‌ను ఊహిం చుకుని.. కోటి ఆశలతో అత్తారింటిలో అడుగుపెట్టిన ఆమెను విధి చిన్నచూపు చూసింది. పెళ్లైన నెల రోజులకే ఊహించని విధంగా జరిగిన ఓ ప్రమాదంలో సైనికుడైన భర్తను పోగొట్టుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ఉంటే కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. కానీ, ఆమె మాత్రం ధైర్యం కోల్పోలేదు. ఈ లోకాన్ని వీడుతూ సైన్యంలో చేరి సేవ చేయాలనే భర్త చివరి కోరికను.. కలను నిజం చేయాలని నిర్ణయించుకుంది. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని, కుటుంబసభ్యుల మద్దతుతో సైనిక అధికారిగా ఎంపికై.. ఎందరికో ప్రేరణగా నిలిచారు ఉత్తరాఖండ్‌కు చెందిన సోని బిష్ట్. లెఫ్టినెంట్‌గా దేశానికి సేవ చేయబోతున్నారు. ఉత్తరాఖండ్‌లోని హల్దానీకి చెందిన సోని కథ మొత్తం పోరాటాలతో నిండి ఉంది: సోనీ తండ్రి కుందన్ సింగ్ బిష్ట్ 13 గార్డ్స్ రెజిమెంట్‌లో సుబేదార్‌గా పదవీవిరమణ చేశారు. ఖతిమాకు చెందిన సైనికుడు నీరజ్ భండారీని 2023లో సోని వివాహం చేసుకున్నారు. కానీ, పెళ్లైన 34 రోజులకే ఆయన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ దుర్ఘటన ఆమె జీవితంలో చీకట్లు నింపింది. అయితే, ధైర్యం కోల్పోకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగడానికి సోనీ సిద్ధమైంది. తన భర్త కలను నెరవేర్చి, ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచడానికి భారత సైన్యంలో చేరాలని ఆమె నిర్ణయించుకుంది. కష్టపడి చదివి ఆర్మీ ఉద్యోగానికి సంబంధించిన అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి.. శిక్షణ కోసం చెన్నైలోని ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీలో చేరింది. అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న 133 మంది క్యాడెట్‌లకు శనివారం పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. మొత్తం 24 మంది మహిళలు ఉండగా.. వీరిలో సోని బిష్ట్ ఒకరు. కుటుంబసభ్యుల ప్రోత్సాహం, మద్దతుతో తాను ఈ విజయం సాధించానని ఆమె తెలిపారు. ఆర్మీ ఆఫీసర్ అయినందుకు సంతోషంగా ఉన్నా.. భర్తను పోగొట్టుకోవడం జీవితంలో అత్యంత బాధాకరమైందన్నారు. 'కుమావున్ రెజిమెంట్‌లో మహిళా అధికారులు ఎంట్రీ గురించి తెలిసినప్పుడు బ్రిగేడ్ ఆఫ్ గార్డ్స్ బెటాలియన్ రిటైర్డ్ సుబేదార్ అయిన నా తండ్రి ఈ మార్గాన్ని ఎంచుకోవాలని ప్రోత్సహించారు' అని సోనీ పేర్కొన్నారు. 'ఇది అంత సులభం కాదు.. కానీ నేను ప్రతి సవాల్‌ను అధిగమించాను' అని తెలిపారు. ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్‌లోకి లెఫ్టినెంట్‌గా సోని చేరారు.

# తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును డీఎంకే నాశనం చేస్తోంది : ధర్మేంద్ర ప్రదాన్

**న్యూఢిల్లీ-నవభూమి:** తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును డీఎంకే నాశనం చేస్తున్నదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. లోక్‌సభలో ఇవాళ ఓ ప్రశ్నకు బదులిస్తూ.. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమలు అంశంలో దేశాన్ని డీఎంకే తప్పుదోవ పట్టిస్తోందన్నారు. హిందీ భాష అమలు అంశంలో తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. త్రీ లాంగ్వేజ్ పాలసీని తమిళనాడు వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయం చేస్తోందని, తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టేస్తోందన్నారు. డీఎంకే అనాగరికంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. మంత్రి ధర్మేంద్ర వ్యాఖ్యలతో సభలో గందరగోళం నెలకొన్నది. డీఎంకే ఎంపీలు సభలో నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. పీఎం శ్రీ స్కీమ్‌పై అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. కేంద్ర స్కీమ్‌ను అమలు చేసే అంశంలో డీఎంకే నేతృత్వంలోని తమినాడుళ సర్కారు యూ టర్న్ తీసుకున్నట్లు చెప్పారు. ఎన్ఈపీ స్కీమ్‌పై ఒప్పందం కుదుర్చుకుంటే ఆ రాష్ట్రానికి నిధులు మంజూరీ అవుతాయన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ మంగళవారం 11 మార్చి


# హీరోయిన్ రష్మికపై వివాదాస్పద వ్యాఖ్యలు..



ప్రముఖ నటి రష్మిక మందన్నాపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గనిగ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై అటు రాజకీయ పార్టీల నేతలతో పాటు సినీ ప్రముఖులు సైతం విమర్శలు గుప్పించారు. దాంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే దిగి వచ్చి.. తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. వాస్తవానికి గతవారంలో కర్నాటకలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్స్ జరిగాయి. ఈ వేడుకలకు రష్మిక మందన్నా హాజరయ్యేందుకు అంగీకరించలేదంటూ రవి గనిగ మండిపడ్డారు. ఆమెకు గుణపాఠం చెప్పాలన్నారు. కెరియర్‌ను ఇచ్చిన ఇండస్ట్రీని గౌరవించడం నేర్చుకోవాలంటూ సూచించారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరు కావాలని గతేడాది ఎన్నోసార్లు రష్మికను కోరామని.. కర్ణాటకకు వచ్చేంత సమయం తనకు లేదని చెప్పిందని.. తమ ఇల్లు హైదరాబాద్‌లో ఉందని.. కర్నాటక ఎక్కడో తనకు తెలియనదన్నట్లుగా మాట్లాడిందన్నారు. కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీ, భాష పట్ల ఆమె అగౌరవంగా వ్యవహరిస్తున్నారని.. ఆమెకు సరైన పాఠం నేర్పించాల్సిన అవసరం లేదా? అంటూ స్పందించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీతో పాటు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు మండిపడ్డారు. రష్మికకు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో ఎట్టకేలకు రవి గనిగ వివరణ ఇచ్చారు. ఆమె (రష్మిక)కు గుణపాఠం నేర్పుతానని చెప్పానని.. జీవిత పాఠాలు చెప్పాలనుకున్నానని, కానీ దాడి చేయాలనేది తన ఉద్దేశం కాదన్నారు. ఎక్కిన నిచ్చెన లేకపోతే.. కిందపడిపోతావని చెప్పానన్నారు. రష్మికకు ఆహ్వానం పంపినా కర్నాటక రాష్ట్ర కార్యక్రమానికి హాజరుకాలేదన్నారు. ఈ రాష్ట్ర ఆహారాన్నే తింటూ పెరిగావని.. అందుకే ఈ రోజు అక్కడ ఉన్నావని.. నువ్వు నీకాళ్లపై నిలబడగలిగావన్నారు.



# క్యూట్ జాన్వీ కపూర్‌ని చూశారా!



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా కాలం అయింది. ఈమె అక్కడ పెద్దగా సక్సెస్‌ను దక్కించుకోలేక పోయింది. అయినా సోషల్ మీడియాలో ఉన్న పాపులారిటీ కారణంగా ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు దక్కిన గుర్తింపు కారణంగా బాలీవుడ్‌లో ఫ్లాప్‌లు పడ్డా వరుసగా ఆఫర్లు అయితే వచ్చాయి. తాజాగా తెలుగులో ఎన్టీఆర్‌కి జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో మొదటి కమర్షియల్ బ్రేక్‌ను దక్కించుకుంది. తెలుగులో ఈ అమ్మడు ప్రస్తుతం రామ్ చరణ్‌కి జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే. ఎన్టీఆర్‌తో దేవర సినిమాలో నటించి నటిగా ఆశించిన స్థాయిలో అలరించలేక పోయిన జాన్వీ కపూర్‌కి ప్రస్తుతం నటిస్తున్న రామ్ చరణ్ మూవీతో కచ్చితంగా మంచి మార్కులు వస్తాయని అంతా భావిస్తున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ పల్లెటూరు అమ్మాయిగా కనిపించబోతుంది. బుచ్చిబాబు మొదటి సినిమా ఉప్పెనలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. కనుక ఈ సినిమాలోనూ జాన్వీ కపూర్ పాత్రకు మంచి ప్రాముఖ్యత ఉండటం ద్వారా టాలీవుడ్‌లో ఈ అమ్మడు మరింతగా ప్రేక్షకులకు చేరువ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ రేంజ్ మాసివ్ రోల్! జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ప్రతి సారి జాన్వీ కపూర్ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఏ ఔట్ ఫిట్‌లో అయినా జాన్వీ కపూర్ చాలా అందంగా ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. అలాంటి ఫోటోలను షేర్ చేసే జాన్వీ కపూర్ తాజాగా మరో సారి తన క్యూట్ ఫోటోలను షేర్ చేసింది. ఒక డ్రింక్‌ను తాగుతూ క్యూట్‌గా నవ్వుతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన జాన్వీ కపూర్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంత క్యూట్‌గా ఉండటం జాన్వీ కపూర్ కే సాధ్యం అంటూ కొందరు నెటిజన్స్ సోషల్ మీడియా ద్వారా కామెంట్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తున్న జాన్వీ కపూర్ మరో వైపు బాలీవుడ్‌లోనూ అదే జోరును కొనసాగిస్తోంది. తెలుగులో ఈ అమ్మడు చేస్తున్న సినిమా ప్రస్తుతం ఒకటే అనే విషయం తెల్సిందే. రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబో మూవీ కాకుండా జాన్వీ కపూర్ మరో అవకాశంను తన ఖాతాలో వేసుకుందనే వార్తలు వస్తున్నాయి. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ ఒక హీరోయిన్‌గా ఎంపిక అయిందట. సినీ వర్గాల ద్వారా అందుతున్న ప్రచారం ప్రకారం అల్లు అర్జున్‌తో అట్లీ రూపొందిస్తున్న సినిమాలు నలుగురు లేదా ఐదుగురు హీరోయిన్స్ నటించనున్నారట. అందులో మెయిన్ హీరోయిన్‌గా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేశారని టాక్ వినిపిస్తుంది. పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

# శ్రీలీలకు చిరు సత్కారం

మెగాస్టార్ చిరంజీవి ఉమెన్స్ డే సందర్భంగా తన చెల్లెళ్లు మాధవి రావు, విజయ దుర్గ, తల్లి అంజనీదేవి, భార్య సురేఖతో కలిసి ఉన్న ఫోటోలను పోస్ట్ చేస్తూ తనతో పని చేసిన హీరోయిన్లతో పాటూ ప్రతీ ఒక్కరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపిన విషయం తెలిసిందే. అయితే అదే రోజు టాలీవుడ్ హ్యాపెనింగ్ హీరోయిన్ శ్రీలీల కూడా చిరంజీవిని కలిసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్న ఫోటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసి అందరికీ షాకిచ్చింది. ప్రస్తుతం విశ్వంభర షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోస్ లో వేసిన స్పెషల్ సెట్స్ లో జరుగుతుంది. అదే స్టూడియోలో మరో షూటింగ్ లో ఉన్న శ్రీలీల, చిరంజీవి అక్కడే ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుని ఆయన్ను కలవడానికి విశ్వంభర సెట్స్ కు వెళ్లింది. ఆ రోజు ఉమెన్స్ డే కావడంతో చిరంజీవి అక్కడే శ్రీలీలను శాలువా కప్పి సన్మానించి దుర్గాదేవి ప్రతిరూపమున్న శంఖాన్ని బహు మతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని స్వయంగా శ్రీలీలనే సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ఓజీ శంకర్ దాదా ఎంబీబీఎస్ అంటూ మెగాస్టార్ తో దిగిన ఫోటోలను షేర్ చేసింది శ్రీలీల. మెగాస్టార్ ఆమెకు ఇచ్చిన ఆతిథ్యానికి ఎంతో సంబరపడిపోయిన శ్రీలీల, సెట్స్ లో తాను తిన్న రుచిక రమైన ఉప్మా మరియు దోసెల గురించి కూడా ప్రస్తావించింది. ఆ రేంజ్ మాసివ్ రోల్! ఉమెన్స్ డో రోజున చిరంజీవి గారు తనకు ఇచ్చిన బహుమతి చాలా ప్రత్యేకమని శ్రీలీల ఆ ఫోటోలను షేర్ చేస్తూ చెప్పుకొచ్చింది. ఇక శ్రీలీల నటించిన రాబిన్‌హుడ్ సినిమా రిలీజ్ కు రెడీ గా ఉంది. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మార్చి 28న రిలీజ్ కానుండగా, ఈ సినిమా ప్రమోషన్స్ డిఫరెంట్ గా జరుగుతూ ప్రతీ ఒక్కరినీ ఎట్రాక్ట్ చేస్తున్నాయి. దీంతో పాటూ బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ తో చేస్తున్న ఆషికి3 కోసం కూడా శ్రీలీల రెడీ అవుతుంది. మొత్తానికి శ్రీలీల పలు ఇండస్ట్రీల్లో తన సత్తా చాటుతూ రోజురోజుకీ మరింత బిజీగా మారిపోతుంది.



# షో స్టాపర్ సితార ఘట్టమనేని స్టన్నింగ్ లుక్







ఫ్రేమ్‌లో ఎందరు ఉన్నా సితార ఘట్టమనేని షో స్టాపర్ అనడంలో సందేహం లేదు. మహేష్ - నమ్రత దంపతుల ఏకైక గారాలపట్టీ సితార అల్ట్రా స్టైలిష్ లుక్స్ వెబ్‌లో నిరంతరం హాట్ టాపిక్. తాజాగా నమ్రత షేర్ చేసిన ఫోటోషూట్ నుంచి ప్రిన్సెస్ సితార స్మైలీ లుక్ అభిమానుల్లోకి దూసుకెళుతోంది. నిర్మాత మహేష్ రెడ్డి కుమారుడు నితీష్ రెడ్డి - కీర్తి వివాహం అబుదాబిలో జరిగింది. ఈ పెళ్లికి పెద్ద సంఖ్యలో టాలీవుడ్ తారలు హాజరయ్యారు. నమ్రతా శిరోద్కర్ ఈ వివాహ వేడుకల నుండి ఆకర్షణీయమైన ఫోటోలను ఇన్ స్టాలో షేర్ చేసారు. ఈ ఫోటోగ్రాఫ్ లో సితార ఘట్టమనేని ట్రెడిషనల్ లుక్‌లో ఎంతో అందంగా కనిపించారు. ఫ్రేమ్‌లో ఎందరు ఉన్నా సితార యూనిక్ నెస్ ప్రత్యక్షంగా ఎలివేట్ అవుతోంది. ఇక ఇదే వేడుకలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ - ఉపాసన జంట ప్రత్యేక ఫోటో ఆన్‌లైన్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది. ఉపాసన స్టైలిష్ లేత గోధుమరంగు ఎంబ్రాయిడరీ దుస్తుల్లో కనిపించగా, రామ్ చరణ్ క్లాసిక్ సూట్‌లో స్మార్ట్ గా కనిపించారు. ఇదే వేడుకకు జూనియర్ ఎన్టీఆర్ - లక్ష్మీ ప్రణతి దంపతులు కూడా హాజరయ్యారు. ఈవెంట్‌లో మహేష్ బాబు కుమార్తె సితార నేవీ బ్లూ షరారా దుస్తుల్లో అందంగా కనిపించగా, నమ్రత ఎరుపు రంగు డిజైనర్ దుస్తుల్లో ట్రెడిషనల్ గా కనిపించారు. ఈ ఫోటోలకు నమ్రత అందమైన క్యాప్షన్ ని జోడించారు. చివరి రాత్రి.. అంతిమంగా నితీష్‌రెడ్డి- కీర్తి జంటకు జీవితాంతం ప్రేమ, ఆనందం కలగాలని కోరుకుంటున్నాను! అని తెలిపారు. అంతకుముందు నమ్రతా ప్రీ-వెడ్డింగ్ వేడుకల నుండి ఫోటోలను షేర్ చేసారు. ఇందులో చరణ్- ఉపాసన దంపతులు సహా ఇతర ప్రముఖులు ఉన్నారు. సంగీతం, నృత్యంతో ఘనమైన వేడుకలో స్టార్ సెలబ్రిటీలు సందడి చేసారు. ప్రస్తుతం ఈ పెళ్లి వేడుక నుంచి త్రోబ్యాక్ ఫోటోలు ఇంటర్నెట్ లోకి విడుదలవుతున్నాయి. వాటిని అభిమానులు వైరల్ గా షేర్ చేస్తున్నారు.

# ఫెయిల్ అయిన వారసులు... ఇలా అయితే కష్టమే!



బాలీవుడ్‌లో స్టార్ కిడ్స్ హీరో హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇవ్వడం కొత్తేం కాదు. అయితే వారసుల్లో సక్సెస్ రేటు చాలా తక్కువగా ఉంది. కొద్ది మంది మాత్రమే హీరో హీరోయిన్‌గా సక్సెస్ అవుతున్నారు. కొందరు ఇండస్ట్రీలో అడుగు పెట్టడం అక్కడ హిట్ రాకపోవడంతో కొన్నాళ్లు ప్రయత్నాలు చేసి కనుమరుగు అవుతున్నారు. కొందరు మాత్రం సక్సెస్‌ల కోసం ఏళ్లకు ఎళ్లు ఎదురు చూస్తున్నారు. ఇటీవల దివంగత అతిలోక సుందరి శ్రీదేవి చిన్న కూతురు ఖుషి కపూర్ హీరోయిన్‌గా పరిచయం అయింది. ఇప్పటి వరకు మూడు సినిమాల్లో నటించినా ఖుషికి హిట్ పడటలేదు. వెబ్ సిరీస్‌లోనూ నటించి తన అదృష్టంను పరీక్షించుకునే ప్రయత్నం చేసింది. కానీ ఫలితం దక్కలేదు. తాజాగా ఖుషి కపూర్ 'నాదానియన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ హీరోగా నటించాడు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఇబ్రహీం అలీ ఖాన్ ఇండస్ట్రీ ఎంట్రీపై వార్తలు వస్తున్నాయి. ఎట్టకేలకు నాదానియన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చాడు. ఇబ్రహీంకి ఇది మొదటి సినిమా కాగా ఖుషి కపూర్ మాత్రం అప్పటికే రెండు మూడు సినిమాలు నటించి ఉంది. కానీ ఆ సినిమాలు హిట్ కాకపోవడంతో ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. ఇబ్రహీం అలీ ఖాన్‌తో పాటు ఖుషి కపూర్‌కి సైతం 'నాదానియన్' సినిమా హిట్ అత్యంత కీలకం. అందుకే కాస్త ఎక్కువ శ్రద్ధ పెట్టి సినిమాను చేయడం జరిగింది. కూతురు కోసం సీక్వెల్ ప్లాన్ చేసిన స్టార్ ప్రొడ్యూసర్ షానా గౌతమ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాను నేరుగా ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేసి మంచి పని చేశారు. ఈ సినిమాను థియేటర్‌లో ఎలా చూస్తారు జనాలు అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. హీరోగా ఇబ్రహీం ఇంకా చాలా మెరుగు పడాలంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతే కాకుండా అతడి నటనను చాలా మంది తండ్రి సైఫ్ అలీ ఖాన్ నటనతో పోల్చుతూ కామెంట్స్ చేస్తున్నారు. ఇదెక్కడి విడ్డూరం అంటూ పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. నటనలో మినిమం ఓనమాలు కూడా నేర్చుకోలేదా అంటూ కొందరు పెదవి విరుస్తూ కామెంట్స్ చేశారు. ఇక హీరోయిన్‌గా నటించిన ఖుషి కపూర్ పై తీవ్ర విమర్శలు చేస్తున్న వారు ఉన్నారు. ఇబ్రహీం మొదటి సినిమా కనుక ఆయన తప్పులను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఖుషి కపూర్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు మూడు సినిమాలు కూడా చేసింది. అయినా ఇప్పటి వరకు నటనలో మినిమం జ్ఞానం సంపాదించలేదు. అంతే కాకుండా ఖుషి స్క్రీన్ ప్రజెన్స్ అస్సలు బాగుండటం లేదు. అక్క జాన్వీ కపూర్‌తో పోల్చుతూ కొందరు ఖుషి కపూర్ అందంను తక్కువ చేసి మాట్లాడుతున్నారు. మొత్తానికి ఈ ఇద్దరు వారసులు చాలా ఆశలు పెట్టుకుని చేసిన నాదానియన్ సినిమా నిరాశ పరచడంతో భవిష్యత్తు ఏంటో అంటూ చాలా మంది చాలా రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇలా అయితే ఫ్యూచర్‌లో ఆఫర్లు రావడం కష్టమే, స్టార్ డం దక్కడం మరింత కష్టం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభాస్ 'బక' - ప్రశాంత్ వర్మ ప్లాన్ ఏంటీ?



ప్రభాస్ ప్రతి ప్రాజెక్ట్‌ను ఓ కొత్త లెవెల్ కు తీసుకెళ్లే హీరో. ఆయన కొత్త సినిమాల ప్రకటనలు ఎప్పుడూ అంచనాలను పెంచేస్తాయి. ఇప్పుడు దర్శకుడు ప్రశాంత్ వర్మతో కలిసి ఒక కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న ఈ భారీ చిత్రానికి 'బక' అనే టైటిల్ పరిశీలనలో ఉందట. మహాభారతంలోని బకాసురుడి కథ ఆధారంగా రూపొందనున్న ఈ ప్రాజెక్ట్, మరోసారి ప్రభాస్ క్రేజ్‌ను పెంచేలా ఉండబోతుందని తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ తన 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతేకాదు, 'హనుమాన్' కథను మరో దశకి తీసుకెళ్లేందుకు 'జై హనుమాన్' చిత్రాన్ని కూడా ప్రకటించాడు. ఈ యూనివర్స్‌లో భాగంగా ప్రభాస్‌తో ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నారని, అందుకు 'బక' అనే టైటిల్ ఫిక్స్ చేశారని టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు వచ్చిన పౌరాణిక, మైథలాజికల్ సినిమాల నుంచి ఈ సినిమా పూర్తిగా విభిన్నంగా ఉండబోతుందట. ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా, ఈ కొత్త ప్రాజెక్ట్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసికున్నాడు అనే విషయంలో ఇంకా క్లారిటీ రాలేదు. ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాడని రకరకాల గాసిప్స్ పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం 'కల్కి 2898 ', 'సలార్ 2', 'రాజా సాబ్' లాంటి భారీ సినిమాల్లో నటిస్తూనే, ప్రశాంత్ వర్మ సినిమాను అంగీకరించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రం పూర్తి స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ గా ఉండబోతుందని, ప్రభాస్ మరోసారి అద్భుతమైన పాత్రలో కనిపించబోతున్నాడని టాక్. మహాభారతంలో బకాసురుడు అనే రాక్షసుడి కథ అందరికీ తెలిసినదే. గ్రామస్తుల నుంచి బలిగా మనుషులను తీసుకునే బకాసురుడి ప్రస్థానం, ఆఖరికి భీముడి చేతిలో అతను ఎలా ఓడిపోయా దన్నదే ప్రధాన కథ. అయితే, ప్రశాంత్ వర్మ ఈ కథను మరో లెవెల్‌కి తీసుకెళ్లి, మోడరన్ స్టైల్‌లో మలచబోతున్నాడని సమాచారం. ఈ ప్రాజెక్ట్ కూడా ఆయన క్రియేట్ చేస్తున్న మైథలాజికల్ యూనివర్స్‌లో భాగమై ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు 'బక' గురించి అధికా రికంగా ఏ సమాచారం రాలేదు. కానీ టాలీవుడ్ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్ పైన బిగ్ బజ్ నడుస్తోంది. 'హనుమాన్' తర్వాత ప్రశాంత్ వర్మ మైథలాజికల్ ఫ్రాంచైజీని విస్తరించాలనే ఆలోచనలో ఉన్నాడని, అందులో భాగంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోందని టాక్.

# చాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ మూవ్‌మెంట్..!



**దుబాయ్-నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్‌లో టీమిండియా విజయం సాధించింది. ఈ విజయంతో సర్వత్రా సంబురాలు వ్యక్తమయ్యాయి. అభిమానులు నృత్యాలు చేస్తూ.. డ్రమ్స్ వాయిస్తూ విజయోత్సవాలు జరుపుకున్నారు. మాజీ క్రికెటర్లు సైతం పలువురు టీమిండియా విజయం సాధించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. భారత దిగ్గజ బ్యాట్స్‌మెన్, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సైతం డ్యాన్స్ చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గవాస్కర్ ఛాంపియన్స్ ట్రోఫీకి కామెంటరీ బృందంలో సభ్యుడిగా ఉన్నారు. టీమిండియా విజయం సాధించిన సమయంలో ఆయన గ్రౌండ్‌లోనే ఉన్నారు. టీమిండియా కప్‌ను అందుకున్న సమయంలో ఆయన భావోద్వేగాలను నియంత్రించు కోలేకపోయారు. డ్యాన్స్‌తో విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. మరో వైపు టీవీ స్టూడియోలో ఉన్న మాజీ ఆటగాళ్లు హర్భజన్ సింగ్, సురేష్ రైనా సైతం తమ సీట్లలో నుంచి లేచి ఈలలు వేస్తూ.. భాంగ్రా నృత్యం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# టీమిండియాపై బీసీసీఐ ప్రశంసలు.. జడేజాకు బెస్ట్ ఫీల్డర్ అవార్డు



**దుబాయ్-నవభూమి:** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025ని గెలుచుకున్న టీమిండియా జట్టుపై బీసీసీఐ ప్రశంసలు కురిపించింది. భారత క్రికెట్ జట్టు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని, ఆ హోదాలోనే విజేతగా నిలిచిందని, వన్డేలు.. టీ20ల్లో ఇండియా టాప్ ర్యాంక్ జట్టుగా కొనసాగుతున్నట్లు బీసీసీఐ ఇవాళ తన ప్రకటనలో పేర్కొన్నది. రోహిత్ సేన అత్యద్భుత ప్రదర్శన ఇచ్చిందని, అన్ని సవాళ్లను ఎదుర్కొన్నదని, నిర్భయంగా.. క్రమశిక్షణతో టోర్నీలో విజేతగా నిలిచినట్లు బీసీసీఐ వెల్లడించింది. ప్రపంచ టోర్నీల్లో విజయకాంక్షతో భారత్ దూసుకెళ్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఇండియా తన సత్తా చాటినట్లు బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన ప్రకటనలో తెలిపింది. చరిత్రాత్మక విజయంలో కెప్టెన్ రోహిత్ శర్మ పాత్రను బీసీసీఐ విశేషంగా కొనియాడింది. రోహిత్‌లోని అసాధారణ నాయకత్వ లక్షణాలు.. జట్టును గెలుపుబాటలో నిలపడంలో సక్సెస్ అయ్యిందని ప్రకటనలో తెలిపారు. రోహిత్ నేతృత్వంలో ఇండియా రెండోసారి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకున్నదని బీసీసీఐ తెలిపింది. 2024 టీ20 వరల్డ్‌కప్‌తో పాటు 2025 చాంపియన్స్ ట్రోఫీ విజయంతో.. రోహిత్ ఓ సక్సెస్‌ఫుల్ కెప్టెన్ అయ్యారని పేర్కొన్నది.

# చాంపియన్స్ ట్రోఫీ ప్రజెంటేషన్ సెర్మనీపై వివాదం.. విస్మయం వ్యక్తం చేసిన షోయెబ్ అక్తర్..



**దుబాయ్-నవభూమి:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వ్యవహార శైలిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను భారత్ గెలుచుకున్న విషయం తెలిసిందే. అయితే కప్ ప్రజెంటేషన్ సమయంలో.. వేదికపై ఒక్క పాకిస్థానీ ప్రతినిధి కూడా లేరు. వాస్తవానికి చాంపియన్స్ ట్రోఫీని ఈసారి ఆర్గనైజ్ చేసింది పాకిస్థాన్ క్రికెట్ బోర్డే. కానీ ఆదివారం రాత్రి దుబాయ్ స్టేడియంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాకిస్థాన్ ప్రతినిధి లేకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. న్యూజిలాండ్‌పై ఉత్కంఠభరిత ఫైనల్లో నాలుగు వికెట్ల తేడాతో ఇండియా నెగ్గింది. ఐసీసీ చైర్మెన్ జే షా చేతులు మీదుగా కప్‌ను రోహిత్ సన అందుకున్నది. అయితే ప్రజెంటేషన్ వేదికపై బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి దేవజిత్ సాకియా, న్యూజిలాండ్ క్రికెట్ డైరెక్టర్ రోజర్ టౌస్ కూడా పాల్గొన్నారు. కానీ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన పాకిస్థాన్ ప్రతినిధులు ఎవరూ ప్రజెంటేషన్ సమయంలో లేకపోవడం విస్మయానికి గురి చేసింది. పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ అహ్మద్.. దుబాయ్‌లోనే ఉన్నా.. ఆయన ఆ కార్యక్రమంలో పాల్గొనలేకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**